వివేకానంద గీతావళి

గ్రంథకర్త

కడియాల సుబ్బన్నశాస్త్రి

ప్రచురణ:

రామకృష్ణా గ్రంథమండలి.

20/390, ఏలూరు రోడ్డు,

విజయవాడ.

బెజవాడ, ఆంధ్ర గ్రంథాలయ ముద్రాక్షర శాలయందు

ముద్రింపబడిరి

1949

{వెల. రు. 1-0-0

అభినందనము

బ్రహ్మశ్రీ కడియాల సుబ్బన్న శాస్త్రిగారు వ్రాసిన వివేకానంద గీతావళి, అను గ్రంథము నామూలాగ్రముగాఁ జూచితిని. రామకృష్ణ పరమహంసయెడలను, వానిశిష్యుఁడగు వివేకానందుని యెడలను, నాయిరువురి బోధలయెడలను నీ కవివర్యులకుఁగల గాఢానురాగము నీగ్రంథము వెలయించుచున్నది. మహాపండితులకు సైత మగమ్యములగు మహత్తర వేదాంత విషయములను స్త్రీ బాల వృద్ధముగ నందఱును జదువుకొనుట కనువగునట్లుఁ దేఁటతెల్లమొనర్పఁగల వీరిలేఖిని కొనియాడఁదగినది. ప్రథమ ప్రయత్నమగుట ధార యెడనెడఁ గొంచెము కుంటువడినను మొత్తముపై మెచ్చుకోలునకుఁ దగ్గది. పెద్దవిషయమును జిన్న మాటలలో సులభగ్రాహ్యముగఁజెప్పెడునట్టిదియే నవయుగమున ముఖ్యముగాఁ గవులకు వలయు సామర్థ్యము. అట్టి సామర్థ్యము వీరిలో మెండుగాఁ గన్పట్టుచున్నది. ఇట్టి వేదాంతవిషయిక గ్రంథములనురచియించుటకు వలయు నాయురారోగ్యైశ్వర్యాదులను భగవంతుఁడు వీరికిఁ బ్రసాదింపవలెనని కోరుచున్నాఁడను.

గొడుగుపేట.
మచిలీపట్టణము
14—6—49,

అద్దేపల్లి లక్ష్మణస్వామి.

శ్రీ వివేకానంద స్వామి

శ్రీరామకృష్ణ పరబ్రహ్మణే నమః

శ్రీవివేకానందాయ నమః

శ్రీ వివేకానంద గీతావళి

—: ప్రశంస :—

సీ. శ్రీకృష్ణ భగవాను శేముషీవిభవంబు
శ్రీరామ చంద్రుని శీలపటిమ
బుద్ధ దేవునియొక్క బోధనాపద్ధతి
శంకరాచార్యుని జ్ఞానదీప్తి
ప్రహ్లాదబాలుని భక్తిప్రభావంబు
శ్రీకృష్ణచైతన్య చిద్విలాస
మంజనాతనయుని యమలసేవాసక్తి
క్రైస్తవమహనీయు కరుణబోధ

తే గీ. ఇట్టియోగ్యత లెన్నియో పట్టువడఁగ
రామకృష్ణ పరమహంస సేమమలర
నవతరించెను జ్ఞానియై యవనియందు
సర్వమతముల సారంబు చక్కఁబఱుప.

క్రీడా గీతము

ఆ. గీ. ఆతని ప్రియశిష్యుఁడౌ వివేకానంద
దేవుఁడున్న యెడలఁ దెలియఁగా వ
లెనను దీక్షగలిగి మనమునఁ జింతించి
గురునిబోధ వినఁగఁగోనెను దీక్ష.

తే. గీ. ఆంధ్ర గీర్వాణ భాషల నభ్యసించి
సకలశాస్త్ర పురాణము ల్చదివి చదివి
వేద వేదాంతములనెల్ల విశదముగను
దనివితీరఁగ నర్థంబు దఱచితెఱచి

తే. గీ. మతములన్నిటి సారంబు మదినెఱింగి.
గురువుచేసినబోధను బరులకెల్ల
నిరుపమాన సుధాధార నెఱుకఁ జేయ
దివ్యసుందరమూర్తియై తేజరిల్లి

తే. గీ. దేశదేశముల్ తిరిగి యుత్తేజమలర
మధుర గంభీర వాక్కులు మదినినాట
గురుని సందేశమును దెల్పఁ గోర్కెమీర
భారతావని పృథ్విలో వన్నెకెక్క.

ఉ. బాహ్యప్రపంచ జీవనమె పావనమంచు యథార్థ తత్వముల్
గ్రాహ్యముగాక భోగముల కాలము వ్యర్థముచేయుచుల్ సదా
యేహ్యతతోడ హిందువుల నెప్పుడునుం గను నన్యజాతులల్
సహ్యత గల్గి చూచెఁగడు శాశ్వతమైన పథంబుఁజూపియున్.

తే. గీ. అమెరికా ముఖ్య పట్టణ మందు నాడు
సకల మతబోధకుల సభ సాగియుండ
హైందవ మతబోధకుఁడు గా నచటి కేగి
వేద వేదాంత సారంబు విశదపఱచి

తే. గీ. యన్ని మతముల సారంబు నదియ యనుచు
గాంధికపుఁ బ్రమాణమ్ములు గ్రాహ్యపఱచి
జీవసేవయె పరమార్థసేవ యనుచు
నాత్మ పరమాత్మ ప్రతిబింబ మనుచుఁ దెలిపి

తే. గీ. జనుల హృదయ సీమలయందుఁ జక్కనైన
స్వేచ్ఛ చక్కగ నెలకొల్పి భీతిమాన్పి
దీన భావంబు విడనాడి తేజమలర
సచ్చిదానంద మూర్తులై జనులు భువిని

తే. గీ. జీవయాత్రను గడుపుట శ్రేయమనుచు
బోధచేసెను సభ్యు లామోదమంద

చ. అరిగియు దేశదేశములయందలి పల్లెలఁ బట్టణంబులన్
దఱుగని వేదసూక్తులు సదా వెదచల్లుచు సజ్జనావళిన్
గరముఁ దరింపఁ జేసియు సఖావళితోడను శిష్యకోటితోన్
మఱలెను మాతృభూమి కసమాన యశంబుఁ గడించి
వేడ్కతోన్.

ఉ. భారతభూమియందు మతభావమున్నియుఁ దారుమారులై
క్రూరముగా జనంబు కులరోషముతోఁ గలహించుచుండఁగా
వారికి సత్యముం దెలుప వాదనఁ జేసియు బోధఁ జేసియున్
సారముఁ జూపి వేదముల శాంతినిగూర్చె వివేక నందుఁడున్.

తే. గీ. స్వామి యాంగ్లభాషను వ్రాసెఁ బద్యములను
వానిఁ గొన్నిటిఁ దెనిగించి వ్రాసినాఁడఁ
దేట గీతములో వానిఁ దేటపడఁగ
భాషయందలి దోషము ల్పాటిగొనక
భావములను గ్రహింప మత్ప్రార్థనంబు.

తణుకు 1- 2- 43 } కడియాల సుబ్బన్న శాస్త్రి
రిటైర్డు, బోర్డుహైస్కూలు టీచరు. తణుకు.

నిర్వాణషట్కము

(క్రీడా గీతములు)

మనసునేనుగాను మఱి బుద్ధియునుగాను
అహముగాను చిత్త మఱయఁగాను
మేనుగాను నేను మేని మార్పులుగాను
శ్రవణ జిహ్వా ఘ్రాణ చక్షురింద్రి
యములు గాను వాయు వాకాశ మగ్నియు
జలము పృథ్వీభూత చయముగాను
ఆత్మ నేనె సచ్చిదానంద మూర్తిని
నేనతండ నతఁడునేన సుమ్మి!! (శివోహం శివోహం) 1

(క్రీడా గీతములు)

ప్రాణశక్తి పంచ ప్రాణశక్తులుగాను
దేహ వస్తువులను దేనిగాను
కోశ పంచకంబు లేశమైననుగాను
జ్ఞానకర్మలకును సాధ్యపడను
తలపనేను సచ్చిదానంద మూర్తిని
నేనతండ నతడు నేనె సుమ్మి!! (శివోహం శివోహం.) 2

(గీతమాలిక)

విముఖ సుముఖత్వ భావము ల్వేదుక లేవు
అహ మనూయత గుణములు నఱయ లేవు
ధర్మ మోక్షమార్గములును దఱికిరావు
కోర్కెనేనుగాను మఱియు కోర్కెదీర్చ

వస్తు సముదాయమును గాను వాస్తవముగ
సచ్చిదానంద మూర్తినై జగతియందు
వెలయుచుంటిని గాంచు డో విబుధులార!
నేనతండను నాతండు నేనెసుమ్మి!! (శివోహంశివోహం)3

(గీతమాలిక)

పాప పుణ్యంబు సుఖదుఃఖ భావములును
దేవళంబును బూజయు దేశయాత్ర
గ్రంథ రాజంబు లేవియు గానునేను
భోగమును భోగవస్తువు భోగ కర్త
వీరియం దెవ్వరినిగాను వెదకిచూడ
సచ్చిదానంద మూర్తినై జగతియందు
వెలయుచుంటిని గాంచు డో విబుధులార!
నే నతండను నాతండు నేనెసుమ్మి!!(శివోహంశివోహం)4

(గీతమాలిక)

లేదుమృత్యువు నాకెప్డు లేదుకులము
మరణ భయమును శూన్యంబు మదినినాకు
జన్మ లేదు నాకెప్పు డీ జగతియందు
తల్లిదండ్రులు మిత్రులు దలప లేరు
చుట్టములు గూడ నెచ్చటం జూడ లేరు
గురువు శిష్యులు నాకెందు గూడ లేరు
సచ్చిదానంద మూర్తినై జగతియందు
వెలయుచుంటిని గాంచు డో విబుధులార!
నేనతండను నాతండు నేనెసుమ్మి!!(శివోహంశివోహం) 5

(గీతమాలిక)

ఇంద్రియంబులు నన్నంట వెపుడు సుమ్మి
ముక్తిగాను నేనెవరికి బోధపడను
హద్దురూపముల్ నాకెప్డు నద్దులేవు
కాల మావరణలు నన్నుగట్టలేవు
అన్నివస్తువులందు నే నమరియుంటి
జగతి కాధారముగ నేను జాలియుంటి
సర్వమును నిండియుంటిని జగతియందు
సచ్చిదానంద మూర్తినై జగమునందు
వెలయుచుంటిని గాంచుడో విబుధులార!
నేనతండను నాతండు నేనెసుమ్మి!!(శివోహం శివోహం)6

యతీశ్వరుని గీతము

(గీతమాలిక)

కామకాంచన కీర్తులఁ గాంక్ష దెల్పు
వేడినిట్టూర్పు లెచ్చట వినగలేము
జ్ఞాన మానంద సత్యము ల్బరసగతిని
బాఱుచుండునో సెలయేటి తీరునెపుడు
సాంద్రకాంతారసీమల సందునఁ గడు
వ్యాప్తిఁజెంది నట్టి చదును బయలులందు
గాలిచొఱనట్టి పర్వత గహ్వరముల
లోకరోదన వినరాని లోకమందు

శాంతినెల కొన్నయట్టి యాప్రాంతములను
నిట్లు గానంబు వినబడె నట్లుగాన
హెచ్చు గాత్రంబుతో ధృతిపెచ్చు పెఱుగఁ
దాపసోత్తమ! ఓమ్తత్సదనుచు బాఁడు. 1

(గీతమాలిక)

త్రుంచివేయుము నిన్ను బంధించుగొలుసు
లను మెఱుఁగు పసిఁడిదైన నినుపదైనఁ
ప్రేమయు నసూయతయు నింకఁ బెక్కుమంచి
చెడ్డ జంటగుణంబులు చివరకెపుడు
బంధ కారణములగుచు బాధఁగూర్చు
దాను బానిసగా నెంచుమానవుండు
నిజముగా బానిస యగుట నిశ్చయంబు
శిక్షరక్షణ వానికి స్వేచ్ఛనీవు
పసిఁడి గొలుసు బంధింపఁగ బలముతక్కు
వనుచు నెంచియు నద్దానినంతవిడువ
కూడదు మనము ఖండింపకుండ నెపుడు
హెచ్చుగాత్రంబుతో ధృతి పెచ్చు పెరుగఁ
దాపసోత్తమ! ఓమ్తత్సతనుచు బాడు. 2

(గీతమాలిక)

అంధకారము నీయందు నంతమంద
జ్ఞానభానుని వెలిగించు మానసమున
జ్ఞానియగు సద్గురువు నీకుఁ జాలినంత
జ్ఞానమిడి యంధకారము సమసిపోవఁ

దగినసాయంబుఁజేయును దారిఁజూపి
జ్ఞాన శూన్యుడు గురువైన సరిగనిన్నుఁ
గొఱివి దయ్యము రీతిని గొఱివిఁజూపి
కటికచీఁకటి లోద్రోచు గరుణలేక
జననమొందినపిమ్మటఁ జావుగల్గి
మఱల జన్మంబుగల్గుట మఱువవలదు
జీవునకు జన్మహేతువు జీవితంబు
జీవితాశను సంతృప్తిఁజేయు మీవు
అహముఁగల్గఁగ నన్నియు నంతరించు.
లోనుగాకుము దేనికి దీనిఁదెలిసి
హెచ్చుగాత్రింబుతో ధృతిపెచ్చుపెరుగఁ
దాపసోత్తమ! ఓమ్తత్సదనుచు బాడు. 3

(గీతమాలిక)

విత్తులను జల్లు నాతడె పొత్తుదీయు
గారణము ఫలమును నిచ్చి తీరవలయు
మంచి ఫలితము దెచ్చును మంచికర్మ.
చెడ్డకర్మము తెచ్చును జెడ్డఫలము.
ధర్మమును దప్ప నేరికి దరముగాదు
జీవుడు శరీరమును ధరించిన నతండు
బంధమునుగూడ ధరియింప వలయు ననుచుఁ
బల్కిరి ఋషులు మున్నది వాస్తవంబు
ఆత్మనామ రూపంబుల కవలనుండు.

స్వేచ్ఛతోఁ గూడి యెప్పుడు స్థిరముగాను
అది యే నీవని తెలిసియె హాయి నొందు.
హెచ్చుగాత్రంబుతో ధృతి పెచ్చు పెరుగఁ
దాపసోత్తమ! ఓమ్‌తత్సదనుచుఁ బాడు. 4

(గీతమాలిక)

తల్లిదండ్రుల బిడ్డలఁ దలచుచుండు
భార్యమిత్రులప్రేమను బడయుచుండు
వ్యర్థమగు కలలఁ గనెడు వ్యర్థులెపుడు
సత్యమును గాంచనేరరు జగతియందుఁ
దండ్రి యెవ్వరికాతఁడు దలచిచూడ?
బిడ్డ యెవ్వరికాతండు పెంచిచూడ?
నాతఁడెవ్వరిమిత్రుఁడు ప్రీతిఁజూడ?
నెవనిశత్రువాతం? డొకఁడె యయియుండ
నన్ని జీవకోటులయందు నాత్మ యొకఁడె
గాన నితరమేదియు లేదు వానికంటె
నతఁడె నీవని తెలియుము హాయిపొంద
హెచ్చుగాత్రంబుతో ధృతి పెచ్చు పెఱుగఁ
దాపసోత్తమ! ఓమ్‌తత్సదనుచుఁ బాడు. 5

(గీతమాలిక)

స్వేచ్ఛగలిగి యొకండె నిజేచ్ఛ గలడు
అతఁడె నామరూప రహితమైన యాత్మ
అతఁడె పఱుగును జ్ఞాతగా నతనియందె
మాయయనునది పొడగట్టు మఱియుఁ గూడ

స్వప్నతుల్యమతనికి నీ జగతియగుట
నతఁడు దానికి సాక్షియై యలరుచుండె
నతఁడె ప్రకృతియు జీవాత్మలగుటఁ దోచు
నతఁడె నీవని తెలియుము హాయినొంద.
హెచ్చుగాత్రంబుతో ధృతి పెచ్చుపెరుగఁ
దాపసోత్తమ! ఓమ్తత్సదనుచు బాడు. 6

(గీతమాలిక)

నీవుగోరిన స్వేచ్ఛను నిజముగాను
నెట్టిలోకమైననుగాని యిద్దిగాని
యిడగఁజాలదు నీకించు నెంచుమెపుడు
గ్రంథములు దేవళంబులు గడకు నీకు
నిడగఁ జాలవు స్వేచ్ఛ నొకించుకైన
నీవు పట్టిన బంధమే నిన్నులాగు
విడువఁ బట్టును దుఃఖంబు విడుచునిన్ను
హెచ్చుగాత్రంబుతో ధృతి పెచ్చుపెరుగఁ
దాపసోత్తమ! ఓమ్తత్సదనుచుఁబాడు. 7

(గీతమాలిక)

శాంతి గలిగి యుందురుగాక జనులు భువిని
నన్యజీవికి నేనెప్డు హానిజేయ
నూర్ధ్వ పాతాళలోకము లుండుచోట్ల
గలవు జీవకోటులు పెక్కు కడకు నందు
నుండు నాత్మయు నేనుగా నుంటసుమ్మి

స్వర్గ పాతాళ మర్త్య ప్రపంచములను
నట్టి లోకజీవితముల నెట్టివైచి
యాశ భయముల రెంటికి నావలుంటి
ననుచుఁ బలుకుము నీ వెప్డు హర్ష మొప్ప
బంధములఁ ద్రుంచి వేయంగఁ బాటుపడుము
హెచ్చుగాత్రంబుతో ధృతి పెచ్చుపెరుగఁ
దాపసోత్తమ! ఓమ్ తత్సదనుచుఁ బాడు. 8

(గీతమాలిక)

దేహ మావశ్యకము నీకు దీరిపోవ
జావు బ్రతుకుల నీవప్డు సరకుగొనవు
ముంచినను గర్మ దానిని ముంచుగాక
పూజచేసిన దానిని బొగడుచున్న
దన్నుచుండిన దానిని దగదటంచు
నొరునితో బల్కకుండుము మీ! ఓర్పుగలిగి
పొగడఁ బడు వాఁడును మఱియుఁ బొగడతయును
భూషణకుఁ దగువాఁడును భూషణయును
నొక్క యాత్మయేగాని వేఱొకటి లేదు
దూషణయు భూషణయు గూడ దుదకునొక్క
దేహమునకు జెందునుగాని తెలిసికొనగ
నాత్మ కెప్పుడుఁ జెందనివగును జుమ్మి
కాన శాంతితోడను ముక్తి గాంచుమీవు
హెచ్చు గాత్రంబుతో ధృతి పెచ్చుపెరుగ
దాపసోత్తమ! ఓమ్‌తత్సదనుచు బాడు. 9

గీతమాలిక

వాంఛ కామము కీర్తి యువతులచోట
స్థానమే లేకయుండును సత్యమునకు
స్త్రీని భార్యగా నూహించు మానవుండు
భువిని పరిపూర్ణభావంబుఁ బొందలేడు
తనది యనఁదగు వస్తు వీ ధరణియందు
నెంత కొంచెముగానున్న నంతవఱకు
గ్రోధ మతనిని బంధించి క్రుంగదీయు
నపుడు మాయను దాటలే డతడు సుమ్మి!
గానదానిని విడనాడఁబూనవలయు
హెచ్చుగాత్రింబుతో ధృతి పెచ్చు పెరుగఁ
దాపసోత్తమ! ఓమ్‌తత్సదనుచు బాడు. 10

(గీతమాలిక)

గృహమనునది నీకుండినకీడుగల్గు
నెట్టు గేహము నీ కిరవీయఁజాలు?
పసిరిక తలంబె మెత్తనిపాన్పునీకు
నాకసము నీకుఁ గప్పుగా నమరియుండు.
నుడికిన నుడకకున్నను నూరక లభి
యించునది నీకు నాహారమంచుఁగొనుము!
తన్నుదాను దెలిసికొనఁదగినదగుట
నాత్మఘనమైనదగుచు నొప్పారు నెపుడు
దాహ మాహారములు దానిదరికిఁ జేరి
దాని లేశముఁ జెరుపంగఁబూనలేవు

ఏఱుపాఱెడువిధమున నెపుడునీవు
స్వేచ్ఛతోఁగూడి విహరించు పృథ్వియందు
హెచ్చుగాత్రంబుతో ధృతి పెచ్చుపెరుగఁ
దాపసోత్తమ! ఓమ్తత్సదనుచు బాడు. 11

(గీతమాలిక)

స్వల్పసంఖ్య గలజనులుసత్యమరయఁ
గలరుగాని యితరులు నిన్నలసభావ
ము గలిగి పరిహాసింతురుమూర్ఖులగుచు
గాని మహనీయుడవు నీవు గానదానిఁ
కెట్టిలక్ష్యముఁజూపకు మెపుడుఁగూడ
జనులు వసియించుచోట్లకు జనియు నీవు
వారి యఁధకారంబును వమ్ముజేసి
జ్ఞానమిచ్చియు వారికి సాయపడుము
స్వేచ్ఛనొందినవాఁడవై చింతలేక
బాధవలని భయములేక పడయు విషయ
భోగములను వాంఛయు లేక పూర్తిగాను
వీని రెంటికి దూరమై వెడలిపొమ్ము.
హెచ్చుగాత్రంబుతో ధృతి పెచ్చుపెరుగ
దాపసోత్తమ! ఓమ్తత్సదనుచుఁబాడు. 12

(గీతమాలిక)

కర్మశక్తులు క్రమముగా ఖర్చుపడఁగ
స్వేచ్ఛ నాత్మకుఁ జేకూర్చుఁ జివరవఱకు

జన్మ యనునది లే దెప్డు జగతియందు
నేను, నీవును, దేవుడు, మానవుండు.
నిజముగా లేమనుచు నెంచు నిశ్చయమ్ముగ
నేనె యంతయు నైతిని నిజముగాను
నేను గానంతయును గూడఁ గానఁబడును
అంత నానందరూపమై యలరుచుండు
నదియె నీవంచుఁ దెలియుము హాయినొంద
హెచ్చు గాత్రంబుతో ధృతి పెచ్చుపెరుగఁ
దాపసోత్తమ! ఓమ్తత్సదనుచుఁ బాడు. 13

శాంతిగీతము

(గీతమాలిక)

అదిగో! చూడుము దాని యనంత బలము
శక్తిగాదది మఱి మహాశక్తిగాని
కటికి చీకటిలో నుండు కాంతియదియె
అమితకాంతిలో నుండెడు తిమిర మదియె
వెల్లడికి రాని యానంద వేశ మదియె
అనుభవింపఁ బడని దుఃఖ మదియెసుమ్ము
జీవితముగాని శాశ్వత జీవితమదె
ఏడ్వఁబనిలేని మరణము నెంచనదియె
దుఃఖ మానందమును గాదు తుదకునదియుఁ
వాని రెంటికి మధ్యను వఱలునదియుఁ
బవలు రేయియుఁ గా దదివాస్తవముగ
వాని రెంటికి సంధియై వఱలుచుండు

గానమునకు మాధుర్యము కలుగఁజేయు
నట్టి విశ్రాంతిగా నుండునదియు దలపఁ
భావనమగు కళకు మధ్య వాస్తవమగు
నావిరామ మనునదియె యదియు నగును.
అద్దిసంభాషణ సమయమందు మధ్య
గలిగెడు విరామమని యెంచవలయు నెపుడు
విషయ వాంఛ ఫలము నొందు వేళఁ గలుగు
హృదయ శాంతియు నూహింప నదియెసుమ్మి.
కాంచ లేనట్టి యందముఁగడకునదియె
ఒంటరిగనుండు ప్రేమగానొప్పునదియె
పాడ బడనట్టి మృదువగు పాట యదియె
తెలియ బడనట్టి యజ్ఞాన తేజ మదియె
రెండుజీవితముల మధ్య నుండునట్టి
మృత్యువనునది యద్దియే సత్యముగను
రెండగు తుపానులకు మధ్య నుండుశాంతి
యదియె పరికింప పూర్తిగా నవనియందు
దేనినుండి సృష్టిగలుగు దేనియందు
నది లయముగాంచునట్టి శూన్యంబునెంచ
నద్దిగా నుండు నూహింప నవనియందు
నిర్మలానంద రూపము నెగడునట్టుల
దేని నశ్రుబిందువు చేరు దానిఁ దలఁప
నద్దియేయంచుఁ దెలియుంగనగును సుమ్మి
జీవితమునకు గమ్యము చివర కదియె
శాంతియే దానినిలయము సత్యముగను

శ్రీ రామకృష్ణని దైవత్వము

(గీతమాలిక)

లోకపూజ్యుఁడవగు దేవ! నీకు మేము
వందనము లిడుచుంటి మీ వందుకొనుము
వాస్తవంబుగ సంసార బంధములను
ఖండనముఁ జేసియున్నట్టి ఘనుఁడ వీవు
నిష్కళంకుఁడ వీవును నిశ్చయముగ
దైవ లక్షణ మూర్తివై తనరుదీవు
గుణముల కతీతుఁడవు నీవుగూడ నౌదు
మానవాకృతిఁదాల్చి యీ మహిని నీవు
వెలయుచుంటివిగాన నీ యిలను నీకు
వందనములిడి భక్తితో నందఱమును
పూజ గావింతుమయ్య! యో పూతచరిత! 1

(గీతమాలిక)

వాక్కు మనసును నీ ప్రాపు వడసియున్న
వాని రెంటి కతీతమై వఱలు దీవు
కాంతియే నీవు కలవీవు కాంతియందు
హృదయగహ్వరమనునది యెపుడుఁగూడ
నీవు దర్శనమిచ్చిన నిక్కముగను
గాంతిమంతముగా నుండఁగలుగు నెపుడు
నరుని గాఢ మజ్ఞాన తిమిర మెపుడును
నీవె పాఱఁదోలఁగలవు నిక్కముగను. 2

(గీతమాలిక)

ప్రొద్దుక్రుంకెడు వేళలఁ బూజసలుపు
సమయమునను నీ భక్తులు సరసగాను
తాళ వాద్య మృదంగ సమ్మేళనంబుఁ
జేసి మైక్య కంఠముతోడ వాసి నచట
భక్తిరసము నలుగడలఁ బొంగుచుండ
మధురగానముఁజేయుచు మనుజులెల్లఁ
బరవశత్వముఁ జెందఁగఁ బాడుచుంద్రు. 3

(గీతమాలిక)

జ్ఞానమను నంజనముచేత సత్యముగను
నిర్మలతఁ జెందు నీ దివ్య నేత్రములను
గాంచ నొకసారి మాయయుఁ గడకుఁ దొలఁగు
బాపములను బోఁగొట్టెడు వాఁడ వీవె
స్వచ్ఛమై నిర్మలంబగు జ్ఞానమగుచు
నుండు నీ స్వరూపము వెల్గుచుండు భువిని
సహజమై స్వయమగు ప్రకాశమును గల్గి
వెల్గుచుండును నీ యాత్మ పృథ్వియందు
దైవభక్తికి నున్నత భావములకు
సాగరమువంటి వాఁడవు సత్యముగను
పావనంబగు నీ పాదపద్మములను
బొంది నీ భక్తులగువారు పూర్ణముగను

సార రహితమౌ సంసార సాగరమును
సేమముగ దాట యత్నంబుఁ జేయుచుంద్రు. 4

(గీతమాలిక)

ఓ జగత్ప్రభూ! నీయొక్క యోగమాయ
యందు నీప్రపంచమున నీ వవతరించి
గొప్పగా వెల్గుచుంటివి నీ విప్పగిదిని
మేము జీవించియుండగా మేలుగాదె?
ఇంద్రియముల జయించియు నిహమునందు
నీవు మహనీయ మూర్తివై నెగడుచుంట
నీ కృపవలన మాత్రమే నిజముగాను
మా మనస్సు సమాధిలో మగ్నమగుటఁ
గాంచఁ గల్గుచుంటిమి మేము కడకు నెపుడు
కరుణయేయగు నీ మూర్తి కఠినమైన
పనులు నీయవిగాఁ గానఁబడునుగాదె?. 5

(గీతమాలిక)

దుస్థితి వినాశముల కీడుఁ దొలఁగఁజేసి
కలియుగమునందు జనులను గట్టివైచు
కర్మబంధముల నఱికి కడకు వారి
నెల్లరనుగూడ రక్షింతు వీవుగాదె?
జీవితంబును త్యాగముచేసి నీవు
స్వేచ్ఛ నిడుదువు జనులకు బృథ్వియందు

నో జగద్రక్షకా! పురుషోత్తముడవు!
త్యాగమూర్తి పరమహంసగాఁగ నీవు,

(గీతమాలిక)

స్త్రీ పురుష భేదభావముఁ జెప్ప నున్న
సొత్తు భావము నీయందు శూన్యమయ్యె
భోగములు నీకు నింద్యార్హములుగ నుండె
గాన నీ పావన పదములైన వాని
యందు గాఢభక్తిని మేముపొందఁగల్గు
దారి మాకును జూపుము త్యాగమూర్తి! 7

(గీతమాలిక)

నీకు సహజగుణంబగు నిర్భయంబు
సందియము లన్నియును నీకు సమసిపోయె
నీమదియు నిశ్చయత్వము నిలిపికొనును
నిన్ను ప్రేమించు భక్తులు నిశ్చయముగ
హేతువాదము దాటియు నెపుడుఁగూడ
నధికభక్తిని గలియు నలరుచుందు్రు
జాతి వంశము కీర్తియు సాటిలేని
పేరువలనను గర్వము పెచ్చుపెరుగ
భక్తు లెప్పుడు దానిని బాఱఁదోలి
శరణుఁ జొత్తురుగాదె? యో పరమహంస! 8

(గీతమాలిక)

పావనమగు నీ పదములే వాస్తవముగ
నుండె నాకొక నిధివలె నొప్పుగాను

దానిఁ జేరంగ జగమెల్లఁ గానుపించు
గోవు డెక్కచే నేర్పడు గుంటయందుఁ
జేరు నుదకంబు రీతిని జివజ కెపుడు. 9

(గీతమాలిక)

ప్రేమకు వరప్రసాదంబ వీవుగాదె
సకల మానవులందును సరిసమాన
మైన తత్త్వము గనుచుండు నతఁడ వీవె
నాశనముఁజెందు లోకమునందునుండు
బాధ చెడుగులు నీయందుఁ బతనమగుచు
నాశనముఁ జెందు నో పరమేశ! కడకు. 10

దై వ మా త

(గీతమాలిక)

దివ్యసుందరమూర్తివౌ దేవి! నీవు
కష్ట సుఖముల రెంటి నీ కరములందుఁ
బట్టియుంచితి వమ్మనో! గట్టిగాను
మంచి కూర్చుచు నుందువు మానవులకు
నెవరివో నీవు? దెలియంగ నెవరివశము?
నునికి యను జలార్ణవమందు నుండునట్టి
బలమగు కెరటములు లేచి పైకి సుడుల
తోడ నూఁగులాఁడుటఁ గాంచఁ దుదకు నంత
నీవలన జరుగుచుండును నిజముగాను
చెదరియున్నట్టి జగతిని జేర్చి మఱల

నెడ తెఱపిలేక యిట్టుల నెప్పుడుఁగూడ
నీవు పనిఁ జేయుచుందువు నిజముగాను. 1

(గీతమాలిక)

భూతకర్మల ఫలితము భువినిఁ గల్గు
జను లనుభవింప వారికి సరిగ నీవు
పంచుచుందువు యోగ్యతఁబట్టి యెపుడు
భావికర్మలఁ జేయఁగఁ బద్ధ తెదియొ?
వారలకుఁ దెల్పుచుందువు వాస్తవముగ
నీకు విశ్రాంతి యుండునే నిజముగాను?
నేను నీ పుత్త్రుఁడ నగుట నీవు నాకు
దీవన లిడుచుఁ బ్రోవుము దేవి! యెపుడు
కర్మపాశములను నీవు కరములందుఁ
బట్టియుంచితి వంచు నే గట్టిగాను
నెఱిఁగి యనుభవించుచు నమ్మ! యెపుడుఁగూడ. 2

(గీతమాలిక)

మూలశక్తియో? యది సృష్టి మూలమైన
వస్తువనునది కాదేమొ? వాస్తవముగ
దైవ లిఖితమో? ముందుగాఁ దలపలేని
ఫలిత మేదైన నగునేమొ? పలుక దాని
నదియు లేకున్న నేది యీ యవనియందుఁ
దెలియఁబడకుండు నెప్పుడుఁ దేఁటపడఁగ?
చంచలములేని చిత్తమే సరిగదాని
మాత్రములను దెలిసికొను సూటిఁ దెలిసి

యట్టి మూలశక్తియు నాకు నాశ్రయంబు
నిచ్చి రక్షించుఁగావుత మెపుడుఁగూడ.

(గీతమాలిక)

తన మహిమమును జగతిలో ఘనతనొప్పఁ
బెక్కుగు నవతారములను బృథ్వియందు
నెత్తె నామెయుఁ దనశక్తి యినుమడింపఁ
జావు పుట్టువులను గల్గు సాగరంబు
పొంగి పొరలఁగఁ జేసెడు ముఖ్యమైన
శక్తులనుకల్గి మార్పు లేశంబు లేని
దానికిని మార్పుఁ గల్గించి తత్క్షణమున
మార్పుగలవానికిఁ దియుగ మార్పుఁ దెచ్చి
యేకమును జేయు శక్తియె యెపుడు నామె
గాన నామెయందునుగాక వేనియందు
మనము శరణుఁ జొత్తుము లోకజననియగుట.

(గీతమాలిక)

శత్రుమిత్రులఁ జూతువు సమముగాను
భాగ్యవంతులకుఁ గడు నిర్భాగ్యులకును
బ్రాణము నొసంగు నీ స్పర్శ ఫలమునిచ్చు
నెపుడు సమముగా భేదము నెంచకుండ
మృత్యు వుండుట మృత్యు లేమియునుగూడ
నీ కటాక్షము తల్లిరో! నిజముగాను
నేను నీ పుత్త్రుడనుగానె నిజముగాను?
దయను వెలిబుచ్చు నీమోము దాచకుండ
నాకుఁ జూపుచు నుండు మో లోకజనని!

(గీతమాలిక)

ఎట్టిదానవో? నినుఁగూర్చి యెఱుఁగలనేను
పూర్తిగాఁ బల్కఁ గలుగుదుఁ బొల్లులేక?
తలఁప నాగ్రహింపగ శక్తి తక్కువగుట;
జగతినంతను పోషించు జననివగుట
నిన్ను నా కరములఁబట్ట నెన్నఁడైన
సాధ్యమగునోకో! యత్నింపఁ జాలియున్న
నిర్భయత్వమునకు నెప్డు నిలయమైన
శ్రీమహాలక్ష్మి నినుఁ జేరి సేవఁజేసె
నట్టి పావన పదముల నాశ్రయింతు. 6

(గీతమాలిక)

జననమాదిగ నాకామె సాయపడుచుఁ
గష్టములనుండి ననుఁ జేర్చె గమ్యమునకుఁ
దల్లివలెనామె చక్కఁగాఁ దగినరీతి
నాట పాటలతో జ్ఞాన మబ్బునటుల
సమధికోత్సాహమయజీవితమును గూర్చె
నేనుఁ జేసిన కృషికిని నిజముగాను
దగిన ఫలితము గలిగిన తరుణమందు
నదియు గల్గకయున్నను నామె నాకు
దల్లియేయగు నామె యే తప్పదింక
శరణ మగును నాకెపుడు నీ జగతియందు. 7

కాళి (జగన్మాత)

(గీతమాలిక)

కానఁబడకుండఁ దార లాకాశమందు
మేఘములు గప్పివైచెను మేఘములను
గాలి సుడులతో నిండియుఁ గలఁతఁ జెందె
హోరుమనుచు ధ్వనియొకటి యుద్భవిల్లె
గాఢతరమైన చీఁకటి క్రమ్మె దిశలఁ
బిచ్చివాఁగు జీవులు పెచ్చుపెరిగి
బందిఖానను వీడియు బయటఁ బడెడిఁ
బెల్లగిల్లెను వృక్షము వ్రేళ్లతోడ
గొండలను బోలు కెరటము ల్గోలసేయ
మింటి కెగయుచు నుండఁగ మితిని మించి
సాగరముఁగూడఁ జేరెను సంగరమున
తెలుపు పసుపు వర్ణములతోఁ దేజరిల్లు
కాంతి యొక్కటి నలుగడ క్రుమ్మివైచె
ప్లేగు మొదలగు వ్యాధులఁ బెక్కుగూర్చి
మృత్యుదేవత రూపులు మితినిమీఱి
నిలను బెక్కు దుఃఖములతో నిలుపునామె
నృత్యమును సల్పుచుండియు నిజముగాను
పిచ్చి యానందమునుగూడి భీతిఁగొల్ప
రమ్ము తల్లిరో! నీవిప్డు రమ్ము వేగ 1

(గీతమాలిక)

భయమె నీ నామముగనొప్ప వసుధయందు
నీకు మృత్యువు శ్వాసగా నెగడుచుండు
జలనయుతమగు నీ యడ్గు సంహరించు
జగతి నంతను బూర్తిగా శక్తిఁజూపి
కాలరూపి వినాశనకారి వీవు
రమ్ము తల్లిరో! నీ విక రమ్ము వేగ. 2

(గీతము)

ఎవఁడు ప్రేమించు దుస్స్థితి నెప్డుఁగూడ
ఎవఁడు మృత్యుదేవతఁ గౌఁగిలించు వేడ్క
ఎవ్వఁ డామెతో నృత్యము నెపుడు సల్పు
నతఁడె దేవిని దర్శింప నర్హుడగును. 3

శివ స్తోత్రము

(గీతమాలిక)

వందనము సేయుదును శివు భక్తితోడ
నతని మహిమను గొనియాడ నలవిగాదు
అతఁడె సృష్టి స్థితి లయము లన్నిఁటికిని
గారణంబగుచు జగతిఁ గాంచుచుండు
శివుని యందలి భక్తిచే జీవితంబుఁ
గడుపుచుంటిని నే నెప్డుఁ గౌతుకమున
నంతకును దాను ప్రభువుగా నలరుచుండి
దాని నంటక సాక్షియై తనరుచుండు. 1

(గీతమాలిక)

ప్రభువనెడు నామమొప్పియు వఱలు నతఁడు
భ్రాంతిని దొలగఁజేసెడి ప్రభువతండు
అమిత వాత్సల్య నిలయమై యలరుచుంటఁ
బేరు లన్నిటిలో మంచి పేరుగాంచి
తేజమొప్పగ నా మహాదేవుఁడయ్యె
నతఁడు ప్రేమమూర్తి యగుచు నలరుచుంట
గాఢ భక్తిచే వానిని గౌఁగిలింప
హరుని హృదయమునందు నా పరమశక్తి
స్వప్నతుల్యముగాఁ దోఁచు సహజముగను. 2

(గీతమాలిక)

మేటి కెరటములనుగూడు నీటివలెను
పూర్వజన్మ కర్మ ఫలము లుప్పొంగివాని
శక్తులు హృదయమున గొప్ప చలనముగలి
గించుచుండును, దానియం దెంచిచూడ
నీవు నేనను వ్యత్యాస భావముండు
చంచలమగు మానసము విశ్రాంతిఁ జెందు
నట్టి శాంతమూర్తికి నేను కట్టకడకు
వందనం బాచరింతును భక్తితోడ
నతఁడు శివుఁడు మహాదేవుఁ డగునుగాక. 3

(గీతమాలిక)

తల్లి దండ్రులు, బిడ్డలుఁ దలఁప మఱియు
నిర్మలంబగు నూహలు నియతిలేని

వివిధ భావము లెచ్చట విలయమగునో?
బయట లోప లటంచును బల్కునునికి
భావము లెచట పూర్తిగ భగ్నమగునో?
మార్పులని యెడు నట్టి యా మారుతంబు
నెచట శాంతిఁ జెందుచు నుండు నెపుడుఁగూడ?
నట్టి మానస సంహారి యైనయట్టి
హరుని బూజింతు నేనెప్డు హర్షమొప్ప. 4

(గీతమాలిక)

వేనినుండియుఁ జీఁకటి వెల్లివిరియు?
ధవళ పద్మము వికసింప ధవళకాంతి
యందమును వెల్గురుచుచుండు చందమునను?
వేనినుండి తెల్లనికాంతి వెల్లివిరియు?
నెవఁడు నవ్వీన జ్ఞాన మే యెప్డుఁగూడ
దేజమై యోజమై యెప్డుఁ దెలియఁబడును
ఇంద్రియములను గెలిచియు నెవని హృదయ
మెపుడు నిశ్చలధ్యానము నెంతో గల్గి
యుండి యతఁ డెవనిఁగనుచు నుండునట్టి
మానస సరోవరమునందుఁ గానఁబడుచు
నన్ను గాపాడుచుండెఁ? బ్రసన్నుఁడైన
రాజహంసకు మ్రొక్కి నీరాజనమిడి. 5

(గీతమాలిక)

లోకమండలి చెడుగును ద్రోసిపుచ్చు
నట్టి ప్రభు వెవ్వఁడగునో? మ తెట్టిదైన

కలియుగమునందు హెచ్చుగాఁ గలిగియుండు
నా కళంకమును దుడిచి యంతమొందు
నటులఁ జేయువాఁ డెవ్వఁడో? యాదరమునఁ
దన కరము నెవ్వనికినిడె దక్షపుత్రి? 6

(గీతమాలిక)

తెల్లని కలువపువ్వుల తీరునుండు
జగ్గదనమును కలిగిన సరసు డెవడో?
పరుల మంచికి దనయొక్క ప్రాణములను
విడువ సిద్ధముగానుండు వీరుఁడెవఁడో?
దృష్టి నెవ్వఁడు నిలుపునో? దీనులందుఁ
గాలకూటము మ్రింగిన కారణమున
నీలకంఠముతో నొప్పి నీలకంఠుఁ
డనఁగ నెవ్వఁడు పిలువబడంగఁ జెల్లు?
నట్టి శివునకు మ్రొక్కెదు హర్షమొప్ప. 7

సృష్టివర్ణన (1)

ఉనికి యునికియు శూన్యము ననెడునవియు
లేవు లోకమాకాశము లేవు మఱియు
నట్టి మబ్బునుగప్పిన దదియునేది?
అదియు వేనినుండియుఁబుట్టెఁ బిదపమఱియు?
గాఢమగు నంధకారపుగర్భమందు
నేదియుండెనో తెలియక యెవరికైన.? 1

(గీతమాలిక)

మృత్యువనునది లేకుండె నిత్యమైన
శాశ్వతత్వము లేదయ్యె సరిగనపుడు
పగలురాత్రియు నేకమై పరగుచుండు
జలన రహితమై కంపము గలది యగుచు
నొంటరిగ దనమహిమతో నొప్పియుండు
దానికావలనేదియుఁగానరాదు. 2

(గీతమాలిక)

జలనిధినిబోలి చీఁకటి యలముకొనియు
నేకమైయుండె భేదము లేకయుండి
గొప్పమహిమను చీఁకటి గప్పివేయ
శూన్యముననుండి వెలువడెఁ జూడనగియుఁ
దన తపోబలము వలనఁ దప్పనీక. 3

(గీతమాలిక)

మొదట మానసమున నొక ముఖ్యమైన
కోర్కె యను బీజ ముదయించె గొప్పగాను
దాని కిరణములెల్లను దాటి హద్దు
పైకిఁ గ్రిందికిఁ బ్రక్కకు వ్యాప్తిఁ జెందె
దీనిఁ గాంచిరి మానులు దివ్యమైన
వారి హృదయములందును వాస్తవముగ
శూన్యముననుండి యునికిని జూడగల్గి. 4

(గీతము)

సృష్టివైభవమప్పుడు స్పష్టమయ్యె
సృష్టిమూలముక్రిందను సృష్టిశక్తి
బయటను తమశక్తుల నెల్లబయలుపఱచె. 5

(గీతమాలిక)

దీనిమార్గము నెవ్వరు తెలిసికొనిరి?
ఇది యెచటనుండివచ్చెనో యెవరికెరుక?
దేనిలో నిదివ్యక్తమై తేజరిల్లు?
వ్యక్తరూపమున మొదటశక్తివలన
దేవతలు పుట్టియుండిరి తేజమొప్పఁ
గాన నిదియెట బుట్టెనో దేనిమీద
నిదియు నాధారపడియుండె? నెపుడుఁగూడ
దానిగూర్చి యెవఁడెఱుఁగుఁదథ్యముగను? 6

(గీతము)

సృష్టిగూర్చియు దానిని సృష్టిఁజేయు
సృష్టికర్తకే దెలియును స్పష్టముగను
లేక తెలియకయుండును గాకవాని
కైనఁగాని తెలియకుండు వేనికైన 7

సృష్టివర్ణన (2)

(గీతమాలిక)

నామరూపములును రంగు నాస్తిగాగ
భూత భావి కాలములు ప్రఖ్యాతిలేక

కాలమనునది శూన్యమై గగనసీమ
నావరణ రహితమగుచు హద్దులేక
నాదశూన్యమగుచు నంత నాస్తియగుచు
నేతినేతియని కడుఁబ్రఖ్యాతిఁగన్న
బ్రహ్మవాదన శూన్యమై పరగుచుండ
సర్వశూన్యముగా నెంతో సాగుచుండు
నొక్కమహనీయ వస్తువై యుండెనొకటి 1

(గీతమాలిక)

కారణత్వ మనెడు నది పాఱుచుండఁ
గోర్కె మెఱసెడు నీటితోఁగూడ నేను
గలను నేనుంటి నేనుంటిఁ గడకునంచు
గొప్ప రోదనఁ జేయుచుఁ జెప్పరాని
యహముతోఁగూడి వెలువడె నందునుండి. 2

(గీతమాలిక)

హద్దులేని కోర్కె యనెడు నంబురాశి
యందు వివిధ శక్తులతోడ నలరుచుండు
లెక్కలేనట్టి కెరటము లొక్కరీతి
వెలువడెను నలుగడలందు వింతగొల్ప
నవియు నెంతో శక్తినిగల్గి యంతులేక
యెన్ని రూపములందియు నెన్ని వివిధ
చలనములతోడ గన నయ్యె సరిగనపుడు?
నెన్ని యున్నవో లెక్కింప నెవరితరము? 3

(గీతమాలిక)

కోర్కె యనునట్టి కడలిలో [illegible] కొలది
సూర్యచంద్రులు నెలసిరి చ[illegible]
నాకసము నిండె గోళము లంతులేక
కాంతి యావరించె నపు డాకాశమంత
ధ్వనియు నొక్కటి దానిలో బయలుదేరె. 4

(గీతమాలిక)

పెక్కు జీవులు పుట్టెను లెక్కమీఱి
ప్రబలె నిర్జీవ వస్తువు లబ్బురముగను
జనన మరణము లను నవి కలుగ నయ్యొ
భోగ బాధలు రోగముల్ పుట్టె భువిని
సూర్యు డాతడు నిజముగఁ జూడమఱియు
నాతని దగును కిరణంబు నదియుగాక
అతఁడు సూర్యుడుకిరణంబునతఁడె యగును. 5

సమాధివర్ణన

(గీతమాలిక)

సూర్యబింబము లేకుండె సుందరమగు
చంద్రబింబము లేదయ్యె! సరిగఁ జూడ
గాంతి యంతయు నశియించెఁ గడకు నపుడు
శూన్యమా నాకసమునందుఁ జూడనొక్క
ఛాయ రూపము దాల్చిన జగతిబొమ్మ
తేలుచుండు సమాధిలోఁ దిరిగిచూడ. 1

(గీతము)

శూన్యమగు మానసంబునఁ జూడనంత
నిత్యమును లేని జగతియు నిలిచియుండి
తేలిమున్గును బిమ్మటఁ దెలియరాక
నేననెడు ప్రవాహమునందు నిజముగాను. 2

(గీతము)

ఛాయ సముదాయ మప్పుడు శాంతముగను
నాది గర్భమునం జేరి యందునుంటి
నేను నేనుంటి నను నంతు లేనియట్టి
యొక ప్రవాహమునం దేలుచుండిపోవు. 3

(గీతమాలిక)

అప్పుడంతయుఁ జూడఁగ నాఁగిపోవు
నేను నేననువాహిని నిలచిపోవు
శూన్యమనునది చేరును శూన్యమందు
వాక్కు మానసంబులు రెండుఁ బలుకలేవు
దానిఁగూర్చియు నే మాత్రమైనఁగాని
యెవని హృదయము దానిని నెరుగగల్గు?
నతడెఁ వర్ణింపగల్గుటకర్హుఁడగును. 4

ముక్తినొందిన వానిపాట

(గీతమాలిక)

గాయపడినట్టి సర్ప మాగ్రహము చేతఁ
బడగ విప్పుచు లేచును బైకి నెపుడు

నగ్నిపైలేచు మంటయు నధిక మగును
దానిఁ గదలింప నొక్కఁడు పూనినంత
బొమ్మపై దెబ్బఁ గొట్టఁగ రోదనంబుఁ
జేయు సింహముగర్జనచే నెడారి
మారు మ్రోఁగంగఁ జేయును మనసు చెదర. 1

(గీతము)

మెఱుపు బొమ్మనంటిన యంత మేఘమెపుడుఁ
గుంభవృష్టిచి గురిపించుఁ గూడి బలము
నాత్మను గుఱించి లోతుగా నఱసిచూచి
మహిమవును వెల్లడింతురు మానులెల్ల 2

(గీతమాలిక)

కండ్ల దృష్టిలో క్షీణత కల్గుఁగాక
హృదయమందు నిరుత్సాహ మొదవుగాక
స్నేహధర్మము పూర్తిగాఁ జెడునుగాక
ప్రేమ మోసముఁ జేసియు వీడుఁగాక
కలుగుఁగాక కష్టములును కాలగతిని
కటికచీఁకటి మార్గము గట్టుఁగాక 3

(గీతమాలిక)

ప్రకృతి యంతయు నీపైని ప్రబలమైన
కోపమునుబూని యణపంగఁ గోరుఁగాక
తెలిసికొను మాత్మ యిట్టులు దేఁటపడఁగ
గలదు దైవాంశ నీయందు ఘనత నొప్పి

సొగసుమించకను ముందుకు వేగముగను
దప్పతో త్రోవలఁ ద్రొక్కక తత్క్షణమున
గమ్యమును జేర యత్నింపు కడకు నీవు. 4

(గీతమాలిక)

దేవతనుగాను మానవదేహిఁగాను
పశువుఁగాను దేహముఁగాను వాస్తవముగ
మానసముఁగాను పురుషుఁడఁగాను నేను
స్త్రీనిగూడఁగాను మఱియు దేని గాను
గ్రంథములు నన్ను వర్ణింపఁ గలుగ లేక
చూచు నిర్ఘాంతపడి యొక్కచోట నిలచి
నే నతండనగుదుఁ జుమ్మి నిశ్చయముగ. 5

(గీతము)

సూర్యచంద్రులు భూమియుఁ జూడఁ బెక్కు
తారలును ధూమకేతువు ల్చేరుముందె
కాలమనునది లేకుండు కాలమందె
యుంటి నేనుందు నిపుడు నేనుందు ముందు. 6

(గీతమాలిక)

సుందరంబగు నవనియు సొంపుమీఱు
సూర్యుఁడును, జల్లదనమును సొబగునొప్పి
యుండు చంద్రుఁడు నక్షత్ర యుతముగాఁగ
మినుకు మినుకు మనుచు వెల్గు మిన్నుగూడ
సృష్టిసూత్రములనుబట్టి సృష్టియందు

సంచరింపుచు నివసించి సరిగ నవియు
బంధములయందు నశియించు బంధములను. 7

(గీతమాలిక)

మానసంబను కప్పను మఱియుఁ గల్గి
స్వప్నతుల్యమౌ వలలోన సరిగఁ జిక్కి-
పడుగు పేకలతోఁ గూడి పరగుచుండు
నూహాలందు మాత్రమెపుడు నుంచఁబడెడు
స్వర్గ మర్త్యపాతాళాల సామ్యమొప్పు
పెక్కులోకము లచ్చట లెక్కమీఱి
వెలయుచుండును నరునకుఁ దలపునందు. 8

(గీతము)

బాహ్యరూపము లివియని గ్రాహ్యమగును
కాలమవకాశములు మఱి కారణమును
ఫలితమును బుద్ధి యూహాల బయటనుండి
సాక్షివలెనుంటి జగతికి సరిగ నేను. 9

(గీతమాలిక)

ఉన్నదొక్కటి మాత్రమే యెన్న రెండు
లేక పెక్కుగా నేవియు లేవుసుమ్మి
యొకటులన్నియు నాయందు నొకటియయ్యె
నేను దేనిని ద్వేషింప నిజముగాను
నన్ను విడఁదీయఁజాలను నన్నునుండి
ప్రేమ గలిగియుండుట నాకుఁ బ్రీతికరము. 10

(గీతమాలిక)

కలలనుండియు మేల్కొను గల్గుమేలు
బంధములనుండి ముక్తిని బడయుమీవు
భయముఁజెందకు మాయను బారద్రోలు
నన్ను నాఛాయ భయపెట్ట దెన్నఁడైనఁ
దుదకు నేనెయూతండని తోఁచునీకు.

నాయాట ముగిసినది

(గీతమాలిక)

జీవితంబను వాహినిఁజేరి నేను
పాటుపోటుల రీతిని బయలు వెడలి
కాల కెరటములనుఁగూడి కలసిమెలసి
యడగి లేచుచు నస్థిరంబైనపెక్కు
జన్మలందలి దృశ్యము ల్చాలఁగనుచుఁ
దొర్లి పోవుచుంటిని నేను త్రోవ లేక
అంతు లేని యీనాటకమందు నాకు
విసుగు జనియించె నిప్పుడు వివిధమైన
యిట్టి దృశ్యములను గాంచి తుట్టతుదకు
దనివి నొందక నేనైతిఁ దథ్యముగను
నిట్లు పరుగిడుటయెగాని యెప్పుడైన
గమ్యమును జేరునాశయుఁ గలుగదయ్యె
దృష్టికినిఁగూడ దూరమై తీరముంట
జన్మజన్మల యందును సరిగ నేను
ద్వారములకడఁ బడియుండ దారికొఱకు

నవియుఁ జెరువకుండెను దానినపుడునాకుఁ
జాలకాలము నుండియు సత్యమనెడు
దానికిరణము నొకదానిఁ గాననెంచి
నేను జేసిన కృషియంత నిష్ఫలంబు
గాగ నల్ప జీవితపుఁ బైగట్టునందు
నిలిచి క్రిందకుఁజూడగ నేనుగాంచ
గల్గితి నటుల మనుజుల కలవరంబు
గుంజులాడుచు నేడ్చుచుఁ గూడివారు
నవ్వుచుండురు మరియును నాల్గుదిశల
నెందుకట్టులొనర్తురో యెవరికెరుక?
మొగముఁ జిట్లించుకొనుచును ముందునిలిచి
యంధకారము దారి లేదంచుఁ బల్కు
గమ్యమును జేర హద్దిది కడకునెపుడు
భావికాలగతి! నాకుభ్రాంతిగూర్ప
కుండి నీ వాజనులఁ గూడియుండి యెపుడు
వారితోడఁ గ్రీడింపుము వదలినన్ను
జ్ఞానమార్జనఁ జేయగఁ బూనువాఁడు
పొందవలయును దుఃఖము మొదటనెపుడు
గానవారితోఁ గాలంబుఁ గడుపుమీవు
నేనుమాత్రము విశ్రాంతిఁ బూనఁజాలఁ
దేలుచుండెడు బుడగను బోలుపుడమి
బూటకములగుచుండియు మోసపుచ్చు
దానిరూపము నామము దానిజనన
మరణములు నాకుమాత్రము తరచిచూడ

వ్యర్థములనుచుం దోఁచు యథార్థముగను
దాటి నామరూపములను దారిఁ బోవ
గోరుచుంటి నో యమ్మరో! దారిఁ దెలుపు
మిపుడు నలసటఁ జెందితి నీవు నాకు
కాంతి ద్వాఃకవాటములను గడకఁ దెలుపు
మిల్లుఁ జేరఁగ వాంఛజనించె నాకు
నేను నీపుత్త్రుఁడను గానె? నిజముగాను
"పుడమిమీఁదను నాఁట ముగిసెనమ్మ"
నీవు నన్నంపితివటకు నిశ్చయముగ
జీకటిని నేనునటనంబుఁ జేయుటకును
నీవుభీకరాకృతిఁ దాల్చినావు తల్లి!
కాంచ నీమోము భీతియుఁ గల్గె నాకు
నాశయదుగంటె భయమునాకధికమయ్యె
విసుగుఁ జెందితి నాటలోవినుము తల్లి!
దుఃఖసుఖములతోఁ గూడి తుచ్ఛమైన
సారరహితమౌ సంసారసాగరమున
జననమరణములనుగూర్చు జన్మలెన్నొ
యెత్తుచుంటిని విధి లేక యిచటనేను
పలుక జీవనము మృతజీవనముగాదె!
మృత్యువనునది సుఖదుఃఖ మిళితమైన
నదియు నొకజన్మ కారంభమగునుగాదె?
దుఃఖసుఖముల యాకులతోడఁ గూడి
పాత చక్రమె తిరుగుచు బయలువెడలు
దాముముందు బూడె యగుటఁ దలఁప లేక

జ్ఞానశూన్యులౌ బాలురు చక్కనైన
యాశలను జీవితాకాశమందు ముందుఁ
గల్గఁబోయెడు వానిని గలలఁగాంచి
తాముగతజన్మ లందును దనివితీర
ననుభవింపని వానిని ననుభవించు
నాశతోడను జీవితమంతగూడ
ద్రుప్పు పట్టినవిధమునఁ దోచుచుండు
ఇంతలో జీవితముగూడ నంతమగును.
జ్ఞానమార్జించు తరుణము సాగిపోవు.
జీవితంబను చక్రము చివరకెట్లు
దిరుగుచుండును వృథగాను దెలిపి లేక
క్రొత్తజీవులు జన్మించి కూడిబలము
సాగుచుండును చక్రమే సమయమందు
మాయనాటక మిదిగాక మఱియునేమి?
దీనిఁగదలించు శక్తియే లేనియాశ
కోర్కెయనువది దిమ్మగాఁ గుదిరియుండు
దుఃఖమానందములు దానితోడఁ దిరుగు
నాకునై యుండు దానికి నట్టిచక్ర
మందు గ్రిందమీఁదను బడుచుందునేను
కాని యెందుఁబోవుచునుంటిఁ గడకునిపుడు
దెలియదమ్మరో! నాకు నాస్థితినిగాంచి
యగ్నినుండియుఁ గాపాడు మమ్మ! నన్ను

గోరికలతోడఁ దేలుచుఁ గ్రుంగుచుంటి
దయకు నిలయమై యుండెడు తల్లి! నీవు
వానినుండియు రక్షించి భయముఁదీర్చు
కోపదృష్టినినా పైని జూపకమ్మ
దానిని భరింపఁ జాలను తల్లి! నేను
తప్పులనుగూడ మన్నించి దయనుజూపి
కష్టములనుండి దరిఁజేర్చు కడకునన్ను
దుఃఖములు కంటిధారలు దూరముండు
ధరణి నానంద సుఖములఁ దాటియుండు
సూర్యచంద్రులు తారలు చూపకుండు
మెఱుపుఁగాంతియు దేనిని మెఱయునటుల
జేయిలేకుండు నెప్పుడుఁ జివరకవియు
ప్రతిఫలింపగఁ జేయును వాస్తవముగ
దానికాంతినిమాత్రమే దానికడకు
నన్నుఁ జేర్చియునమ్మరో! నన్నుఁగావు
భ్రాంతికలిగించు కలలను బాఱఁద్రోలి
కప్పి నీమోహము నాకును గానఁబడక
యుండునటులఁ జేయు తెఱగు నింకుదయను
నాకుఁజూపియుఁ దొలగించి నన్నుఁబ్రోవు
మమ్మ! బంధములనుద్రుంచి యమ్మ! నీవు
స్వేచ్ఛనిడుమమ్మ నాకును స్థిరముగాను
అమ్మ! నాయాట ముగిసెనే యని సుఖింతు

తప్పుగా గ్రహించుట

(గీతము)

గంగయొడ్డున వెనుకటి కాలమందు
వృద్ధుఁడగు మతబోధక సిద్ధుఁడొకడు
రాముఁడును సీతయు నవతారంబు లనుచు
సీత బాధల వివరించి చెప్పసాగె. 1

(గీతము)

నంతలో వానిబోధయు నంతమయ్యె
శ్రోతలిండ్లకుఁ బోవుచుఁ జోద్యముగను
వాదనలు సల్పుచుండియు వానినొక్క
ప్రశ్నయడిగెను వారిలోఁ బ్రముఖుఁడొకఁడు. 2

(గీతమాలిక)

తెల్పుమయ్య మాకిప్పుడు దేటపడఁగ
వేనినిగుఱించి మీరిప్డు విశదముగను
బోధఁజేసిరో? యట్టి యాపురుషుఁడైన
రాముఁడెవ్వఁడు? సీతయు నేమి యగును?
వారిఁగూర్చియుఁ దెల్పుఁడు వాస్తవముగ 3

(గీతము)

నేను జెప్పినదానికి నిశ్చయమగు
భావము గ్రహింపకుండియుఁ బల్కుటులఁ
దప్పటర్థంబుఁ దీయుట తగునెమీకు?
నేనిటులఁ బల్క నన్ను మన్నింతుగాక. 4

(గీతమాలిక)

అంతయునుగూడ దైవమే యనుచు నర్థ
శూన్యమగుమాట బోధింప సులభమగును
పిచ్చి భావమె యగునద్ది వినుఁడుదాని
నేనిపుడు మీకు బోధింపఁబూన లేదు
తప్పుగా గ్రహించితిరయ్యా ! దానిమీరు. 5

(గీతమాలిక)

నేను జెప్పెడుదానిని నిజముగాను
జ్ఞప్తియుంచుండు డిపుడైన జ్ఞానమబ్బి
దైవమే సత్యమగుఁగాని తలప నితర
మంతయు నసత్యమేయగు నయ్యాయెపుడు
జగతి నిజమనితోచును జనులకెల్ల
స్వప్నతుల్యముగాదె యీజగతిఁ దలప
అతఁడె సత్యమే నేనన నతఁడె సుమ్మి
వస్తుతత్త్వము మారదు వాస్తవముగ 6

ఆశీర్వాదము

(గీతమాలిక)

తల్లి! ప్రేమతో నొప్పు హృదయముగల్గి
వీరుని దృఢ నిశ్చయముతో వెలయుచుండి
మలయమారుతమువలె సౌమ్యతయుగల్గి
యార్యపీఠములందు నత్యధికముగను
బ్రజ్వలించుచు స్వేచ్ఛను బడసెనీవు
పావనమనోహరత్వము బలము మఱియుఁ

బెక్కు యోగ్యతలు గలిగినిక్కముగను
భారతావనిలోఁ బుట్టి ప్రతిభఁగాంచు
నట్టిపురుషుని నీవు చేపట్టివాని
కడుపు గృహిణివై చెలిమియుఁగలిగియెంతో
సేవనొనరించి కీర్తిని జెందుచునావు
పూర్వ మే జీవి యిట్టి యపూర్వమైన
జీవితముఁగూర్చి కలనైనఁ జింతఁజేసి
యుండియుండదు నిజముగానొక్కఁడైన.

నేను నిన్నుగూర్చి పాడెడుపాట.

(గీతమాలిక)

పాటనొకదాని నినుఁగూర్చి పాడుచుంటి
జనులభూషణ దూషణల్ సరకుగొనక
ప్రకృతితోఁ గూడియుండెడు పరమపురుష!
నీకు సేవకుఁడ నగుదు నిజముగాను
నేను సేవకుండను జుమ్మి నిశ్చయముగ
శక్తితోఁగూడి నీవుండ శక్తిఁగొలుపు
నట్టినీపాదములకు నే నమితభక్తి
తోడ వంగి నమస్కృతితుదకొనర్తు 1

(గీతమాలిక)

నీవునా వెన్కఁదిరముగా నిలిచియుండి
నేను వెన్కకుఁదిరిగియు నిన్నుజూడ
నిండుమందహాసముతోడ నుండుమోము
గాంచుచుందును గన్నులకరవుదీర
గాన పాడుచుందును నేను కడకునెన్నొ

మార్గమునుఁగూర్చి పాటను మఱలమఱల
గాన భయముఁ జెందను లేశమైనగాని
జననమరణము లనునట్టి సహజమైన
ప్రకృతిజన్యగుణంబులు వాస్తవముగ
నాపదములకు మ్రొక్కుచునంటునవియు
నెపుడు సాష్టాంగపడుచుండు నెఱిగినన్ను 2

(గీతమాలిక)

జన్మజన్మలయందు నిజంబుగాను
నీకు సేవకునిగ నుంటి నేను భువిని
దయయనెడుసాగరము నీవె ధన్యచరిత!
ఎవరునీచర్యలనుగూర్చి యెఱుగగలరు?
ముందునాగతి యెటులుండు పుడమియందు
నెఱుగకుంటిని దానిని నెఱుఁగఁగోర
భక్తి, ముక్తి, జపంబు, తపస్సు, పూజ,
ధ్యానభోగము లన్నిటి ధరణినేను
వదలియుంటిని నీయాజ్ఞఁబట్టి యిపుడుఁ
గాని నాకొక కోరిక కలదుసుమ్మి
యదియె నీతోడి యన్యోన్యమైన మైత్రి
కోర్కె నాకడ్డురాకుండఁ గొంచెమైన
నన్ను నీయందుఁజేర్చి కొనంగనేను
నిన్ను వేడుచుంటిని ప్రభూ! నన్నుగావు. 3

(గీతమాలిక)

కన్ను జగతిని గాంచునుగాని తాను
తన్నుగాంచలేకుండును దానిదాను

గాంచు నితరులయందును గడకు నెపుడు
నీవు నాకండ్లు నీవుండి నిజముగాను
జీవముగల దేహము ప్రకాశింపఁజేయు
నెపుడు నీ మోము తేజము నినుమడింప
గావఁ గన్నులన్నియు నీవె కాంచనెప్పుడు. 4

(గీతమాలిక)

బాలుఁడాడెడు నాటల పగిదినుండు
నీయెడల నేను వర్తించు నీతి క్రమము
నేను కొన్నివేళలయందు నిన్నుగాంచి
కోపమునుబూని యుందునుగూడ నేను
కాని కొన్నివేళలయందు నేనునీకు
దూరముననుండి మిక్కిలి ఘోరమైన
కటికిచీఁకటి రాత్రిని నెటకో యేగి
స్వేచ్ఛతో సంచరింతును జింతలేక
కాని యచ్చట మౌనముగల్గి నీవు
కండ్లనుండియు నీరెంతో కారుచుండ
నిలిచియుందువు నాముందు నిజముగాను
అపుడు నీసుందర వదన మధికమైన
ప్రేమదృష్టిని నాదగు మోముపైనఁ
బడఁగఁజేయ నేను వెనుకవైపు దిరిగి
తత్క్షణము నిన్నుగాంచి మోదంబుమీఱ
మోకరించియు నీ పాదములను బడుచుఁ
కోపదృష్టిని నీవు నీకొమరుపైనఁ

జూపకుండుదువు గాన నాచొప్పుఁదెలిసి
నన్ను మన్నింప వేడను నిన్ను నేను
బుద్ధిమాలినవాఁడనై పూర్తిగాను
సరిగనేఁజేయు విపరీత చర్యలకును
నెవరుభరియింపఁ గలరయ్య యీవుగాక?.

(గీతమాలిక)

నీవెఱుఁగుదువు నాకెప్డు నిర్మలాత్మ
నీవు నాయాత్మ సఖుఁడవు నిజముగాను
నేనుగాంచితిఁ బలుమారు నిన్ను నేను
నీవు, నీవునునిజముగా నేనెసుమ్మి
నేనుమాటాడు భాషలో నీవుగలవు
నీవునాకంఠమందున నిలిచియుండ
జ్ఞానకమనీయమూర్తియౌ శారదవలె
నొప్పియుందువు ప్రభువర్య! యెప్పటికిని
నరులు నీయాజ్ఞవలనె సరిగనెపుడు
బడియుశక్తియౌ మాయాప్రవాహమందు
గొట్టుకొనిపోబడుచునుందురు తుట్టతుదకు
గలతఁజెందిన సంద్రపుటలలయొక్క
ధ్వనియు నురుము బోలిన యతిప్రబలమైన
నీకుగల కంఠనాదము నేకరీతి
పైకి వినిపించునట్టులఁ బడుచు వెన్క
దాని గొనిపోవుచుండును తథ్యముగను
సూర్యచంద్రులనుండియు సూటిగాను
వినఁగఁజెల్లును నీ కంఠమున వెలువడు

ధ్వనియునున్ గూడ నెప్పుడు స్పష్టముగను
మలయవాయువునందు నీపలుకులెల్ల
సరిగ వినుపించుచుండును జనులకెల్ల
గాన బాహ్య బోధలెపుడు జ్ఞానమిచ్చి
సత్యసందేశమును నీయజాలకుండు
గాని యాకాశ పథమున గానబడెడు
సూర్యచంద్రులు, గ్రహములు చూడఁబెద్ద
కాంతినినొసఁగు తారలు గగనసీమ
ధూమకేతువు మెఱుములతోడఁగూడు
సృష్టిప్రాముఖ్యములగు విచిత్రవస్తు
చయము జిజ్ఞాసువునకు విజ్ఞానమిచ్చి
భక్తిసాధకములగుచుఁ బరగునెపుడు
శ్రద్ధగలమానవులు దీని సరిగగాంత్రు. 6

(గీతమాలిక)

క్రోధకామ మాశలతోడఁ గూడియుండు
మోహము మొదలుగాగల ముఖ్యమైన
గుణములే సృష్టికెల్ల గారణములయ్యె
విద్యయు నవిద్యయునుగూడ వెలయుచుండు
నట్టియునికియుండు, మఱియునహముకాని
కెపుడు కేంద్రమై ద్వంద్వభూయిష్ఠమైన
కష్టసుఖములతో నిండి కడకు జనన
మరణములు వినాశమ్మును మఱియునట్టి
జీవితము గల్గియుండును జివరవఱకు

బాహ్యాభ్యాంతర్యమును దాని బాహువులగు
నాకసమునందు వెల్గుచున్నట్టి సూర్య
చంద్రులు మఱి నక్షత్రముల్ సాగరమున
నుండువస్తువులును, మధ్యనుండుసకల
వస్తుజాలము, మనసునుబలుక మఱియు
బుద్ధి, చిత్త మహంకారములును దేవ
యక్ష కిన్నర సిద్ధ సాధ్యాళి దైత్య
పక్షి సంతతులును మఱిబహుళమైన
క్రిములుఁ గీటకములును మఱియును బెక్కు
నణువులును మిశ్రమములగు నన్ని జీవ
కోట్లు, నిర్జీవకోట్లును గూడ బాహ్య
మయ్యు నాంతర్యముగ నుండు నన్నిగూడ
నొక్క సామాన్యమగునట్టి యునికియందు
గనుబొమలపైనఁ బెరుగుచుఁ గానఁబడెడు
వెండ్రుకలరీతి బయటను వెలయుచుండి
బాహ్యసృష్టియు నిట్టుల బయటఁబడియె. 7

(గీతమాలిక)

మేరుపర్వత శిఖరము మిన్ను ముట్టు
మేఘములఁ జొచ్చి పోవఁగ మితినిమీఱి
మంచుతోఁగూడి యెన్నియో మైళ్ళకొలఁది
దానిపంక్తులు దిశలను దాటిపోవు
తెల్ల నగుమంచుతోఁగూడి తేజమొప్పి
రవియు భూమధ్యరేఖపై రహినిమించి

తెల్లని కిరణకాంతితోఁ దీవ్రమైన
దృష్టితోడను మేరువు దిశకుఁ బనుప
మంచుగొండయుఁ గాంతితో మించి వెలుఁగు
దాని దృశ్యము వర్ణింపఁదరముగాదు
కిరణజాలమునకుఁ గొండ కేంద్రమయ్యెఁ
బిడుగులనుబోలి వేడిమి ఫెళ్ళుమనుచు
శిఖరమును ముంచివైచెను శిరముపగుల
గాంతితోఁగూడి వేడిమిఁ గడకు రవియు
నన్ని శిఖరములను బడునటులఁజేయు
నతఁడు కడునలసియు మూర్ఛ నందినటులఁ
దోచుచుండును వానిని జూచినపుడు
గాఢమగు మంచువేడిచేఁ గరగినపుడు
శిఖరముల నుండి యుదకము శీఘ్రగతిని
భయముగొల్పెడు ధ్వనితోడఁ బడుచుఁగ్రింద
బారు సెలయేటి రీతిని బయలునందు
దృశ్యమంతయుఁ గలయని తేలుఁదుదకు. 8

(గీతమాలిక)

నిరుపమానకటాక్షము నీకుఁగల్గ
మానసంబున నాకుండు మార్పులెల్లఁ
నేకమైపోయి యొకటిగా నెఱుఁగబడియె
జ్ఞానభానుండు నాయందుఁ గానఁబడఁగ
వేయి సూర్యులకాంతియు వెన్నుఁజూపె
సూర్యచంద్రులుఁ దారలుఁ జూడ లేవు

స్వర్గపాతాళ లోకము ల్సమసిపోవు
గోవుడెక్కచే నేర్పడు గుంటరీతి
జగతి గాన్పించుచుండెను సత్యముగను
నమితబాహ్యచిత్రిక దాటునంత నరుఁడు
చేరునొక తావు యోచించి చివరకెట్లు
బాహ్యలోకము క్షీణించు బాధలెల్ల
నంతమొందును దేహము నంతమొంద
మనసునందలి గర్వము మాయమగును
హృదయ శృంఖలములు గూడ కదలిపోవు
బంధములు వీడిపోవును భ్రాంతితొలఁగుఁ
గంపనము లేని నాదంబు కడకునొకటి
శ్రావ్యతరముగ వినిపించుఁ జక్కగాను
నీది యాధ్వనియగుఁజుమ్మి నిశ్చయముగ
దానిని వినుచునుండి నీదాసుఁడెపుడు
సిద్ధముగనుండు నీపనిఁ జేయుటకును. 9

(గీతమాలిక)

ప్రళయకాలమునందుఁ జిత్రముగనొప్పు
జగతి లయమును జెంద నాసమయమందు
నేనుమాత్రముండును గడు నిశ్చయముగ
జ్ఞాతయనువాఁడు మఱియును జ్ఞేయవస్తు
వులును నాజ్ఞానమునుగూడఁ బూర్తిగాను
లయముఁ జెందును లోకము లయముఁగాంచు
జగతి నూహింప గుర్తింపఁ దగదు నాడు

సూర్య చంద్రులు తారలు శూన్యమగును.
అట్టిదియె మహానిర్వాణ మనఁగఁబరగు
కర్త కర్మ క్రియలు వాని కారణంబు
లంత్యమై గాఢ తిమిరంబు నలముకొనఁగ
నట్టివేళను నేనుందు నచటఁగాంచ, 10

(గీతమాలిక)

భేదములు లేక గుణములు వెలయుచుండి
శాంతిఁజెందియు నుండును సాంతముగను
వస్తువొక్కటి గలదు ప్రశస్తమగుచు
నదియు నణురూపమై యుండి యమితముగను
సూక్ష్మరూపము నొందియుఁ జూడఁబడుచు
మిశ్రితముగాక యేకమై మెలగుచుండ
సకల మందు లయముఁజెందు సరిగ నపుడు
నచట నేనుందుఁ దప్పక యరసిచూడఁ. 11

(గీతమాలిక)

దిరిగి వికసింతు నేనప్డు తేజమొప్పి
నేను నేనను నహామప్డు నిలుచుమొదటఁ
బిదప నాశక్తిలోనుండి బిగ్గరగను
నాదమొక్కటి వినిపించు నాల్గుదిశల
"నదియె" ఓమ్ అను పదముగా నలరుచుండు
శూన్యమున నుండి శబ్దము శ్రుతివిమించు
హద్దులేని యాకాశమునందు నదియుఁ

కంపనముతోడ మ్రోగును గడకు నపుడు
నాదికారణభూతము లట్టి తతిని
నిదురనుండియు మేల్కాంచు నింగిముట్టు
లెక్కలేని యణువులపు డొక్కరీతిఁ
నంత వెలువడు నూతనంబైన యట్టి
జీవరాశిని సృష్టింపఁ జివర కవియుఁ
గ్రొత్త జీవులతోఁగూడి క్రొత్తసృష్టి
జరుగఁ బ్రారంభమగుటచే సరిగనపుడు
నణువు లెగుఱుచు గిఱ్ఱున నన్నిదిశలఁ
దిరుగుచును నృత్యముసలుపు తీరుగాను
చాల దూరమునుండియు శక్తితోడఁ
జేరుచుండును కేంద్రము చివరకలియు
గొప్పభూతసాగరమందుఁ గొండలవలె
బైకిలేచును గెరటముల్ ప్రాణవాయు
వపుడు నాసాగరముపైన వడిగవీవ
పడుచు లేచుచుఁ బొంగుచుఁ బ్రబలమగుచు
గెరటములపిండు కదలుచుఁ గ్రియకునెఱుము
బోలిముందుకు సాగుచుఁ బోవుచుండు
శక్తిచే ద్రోయబడునట్టి శకలములుగ
బెక్కుగోళములు కదలు నొక్కసారి
గ్రహము నక్షత్రములుఁ బెక్కు గగనమందు
నమిత వేగమున గదలి యాడుచుండు
మనుజుని నిలయమగుభూమి మఱలమఱల

దిరుగుచుండియుఁ దనచుట్టుదిరుగు రవిని
జుట్టికూడ విశ్రాంతి లేనట్టిరీతి. 12

(గీతమాలిక)

ఆదియందు సర్వజ్ఞుడనైన నేను
నిండియుంటిని నాయందు నుండెమాయ
చలన మచలనములు రెండు గలిగి యదియు
సృష్టిచేయుచు నుండును జివరకెపుడు
నాడుచుండును మాయతోఁ గూడినేను
మఱియు నాయాజ్ఞవలననే మహినిమేఘ
చయము రాచుకొనుచు బోవు రయమువిూఱ
నవియుగర్జన చేయును నాకసమున
నుఱుముమెఱుములతోఁ గూడి యుండి యమిత
వేగముగ తుపానులు చెలరేగుచుండు
మందమారుతము దిశలయందు వీచు
జల్లని కిరణములనంపుఁ జందురుండు
నెండియుండిన భూమియునుండుఁదిరిగి
యాకుపచ్చని రంగుతో నందముగను
పచ్చిక బయళ్ళతోనిండి ప్రాకుచుండు
లతలతోడను జెట్లతో రహినిమించి
సుందరమగు కాంతులవెల శోభగూర్పఁ
బూర్ణముగ వికసించియుఁ బొల్పుగాను
మంచుచేఁ గడుగఁబడియు మించిసుఖము
సూర్యుని దిశకుఁ దలయెత్తి చూచుచుండు. 13

స్నేహితున కిచ్చిన సందేశము

(గీతమాలిక)

ఎచటఁ జీఁకటి కాంతిగా నెంచఁబడును?
దుఃఖము సుఖముగా నెందుఁ దోఁచుచుండు?
వ్యాధి యారోగ్యముగ నెటఁ బరిణమించు?
నెచట బిడ్డ పుట్టిన యంత నేడ్వనదియుఁ
బ్రతికి యుండిన నట బెంచబడునో? యట్టి
మాయచేఁ గలుగు ప్రపంచమయము నీవు
గాంచఁ గలుగుదువె? సుఖంబు నెంచిచూడ, 1

(గీతమాలిక)

పోరు యుద్ధంబు లెచ్చటఁ బొసగుచుండుఁ?
గొడకుపైఁ దండ్రి యెచ్చటఁ గ్రోధమూను?
నహామహాంబనుపాటయె యంతు లేక
పాడఁబడుచుండు నెచ్చటఁ బ్రజలచేత?
నట్టి మాయా ప్రపంచమం దరయ నీవు
కాంచఁగలుగుదువే? శాంతి నించుకైన. 2

(గీతము)

స్వర్గ నరక మిళితము సంసార మరయ
నిట్టి మాయసంసారము నెవరుదాటఁ
గల్గుదురు? కర్మబంధముల్ కట్టివేయ
బానిసీడేడ? రక్షణఁ బడయగల్గు . 3

(గీతమాలిక)

యోగమార్గమ్ము నింద్రియ భోగమ్ములును
గృహనివాసియు సన్న్యాసి క్రియలఁ దెల్పు
జీవితంబులను ధనమార్జించువిధము
పూజ నియమము ధ్యానము పూర్ణమైన
యింద్రియ జయంబు మతకర్మ లెన్నియేని
త్యాగమునుగూడఁ గల్గియుఁ దనివితీఱ
ననుసరించియుఁ వాని నే ననుభవమున
నేమి తెలిసికొంటిని తుద కిపుడునేను? 4

(గీతము)

లేశమైనను సౌఖ్యంబు లేనికతన
జీవితము కష్టములకు వశీకృతంబు
మంచి హృదయముగల్గ నీ కెంచిచూడ
గష్టములు దానికిని మించి గల్గుచుండు. 5

(గీతమాలిక)

కల్గియు విశాలహృదయముఁ గలిగి ప్రేమ
త్యాగమూర్తివిగానుండు తరుణమందు
నీకు నేతావు లేకుండు లోకమందు
గట్టిదెబ్బను భరియింపఁ గల్గు నినుము
దానిని భరింప రాతికిఁ దరముగాదు 6

(గీతమాలిక)

ఆత్మగౌరవ మిసుమంత యైన లేక
చురుకుఁదనమును నీయందు శూన్యమగుచుఁ

దేనలోలుక్క పల్కులయందుఁ దీర్పుగల్గి
విషమునిండిన హృదయము నెలయుచుండి
సత్యమునకు దూరమగుచు సబబువీడి
యహరహముగొల్చుచుండఁగ నపుడు నీకు
స్థానముండును జుమ్మి సంసారమందు. 7

(గీతము)

జ్ఞానసంపాదనకు నేను సగముకాల
మీభువిని గడపితిని యథేచ్ఛగాను
ప్రేమనాయందు నెలకొల్ప పిచ్చివాని
విధముగానేను ఛాయలవెంటఁబడితి. 8

(గీతమాలిక)

సకలమతములు వెదకితి సత్యమరయఁ
బర్వతగుహాలయందును వనములందు
రుద్రభూములయందును భద్రముగను
గంగమొదలగు పుణ్యమొసంగుపెక్కు
నదులతీరములను గొన్నినాళ్లు నేను
గడిపియుంటెని నేను భిక్షాటనంబు
నెంతకాలము గడపితి నింతవఱకు? 9

(గీతమాలిక)

మిత్రుఁడును లేక డబ్బైన మిపులకుండఁ
జిరుగుగుడ్డల ధరియించి తిరుగుచుండి

యేగి యింటింటికిని తుదకేది దొరకు?
నట్టిదానిని భుజియించి యధికమైన
తపముచే మేనుడయ్యంచు తరుణమందు
నెట్టిదివ్యము నార్జించితిపుడునేను?. 10

(గీతమాలిక)

వినుము. మిత్రుఁడ! నీకిప్డు విశదపఱతు
హృదయమందలి భాగము లొక్రదటనుండి
నేను నాజీవితంబున నిజముగాను
గొప్పదగునిట్టి సత్యమునొప్పగాను
గాంచఁగలిగి యనుభవము గలిగినంత
జీవితంబను సుడిలోనఁజేరియలల
తాకిడివలన దెబ్బలు తగులుచుండ
నట్టి సంసారసాగర మనెడుదాని
దాట నొకమాట కలదను మాట నిజము
అట్టినౌకయె దాటించు నంబురాశి. 11

(గీతమాలిక)

పూజఁజేసెడి విధులెన్నొ పుడమిఁగలవు
యోగమార్గములు వివిధ యాగములును
శాస్త్రములును వేదాంత విచారణలును
ద్రవ్యసంపాదన విధులు దానిపిదప
ఖర్చుపెట్టెడు రీతులుఁ గలవు పెక్కు
కాని యివ్వి యన్నియుఁగూడ మానసంబు

నందు గలుగు భ్రాంతులుమాత్రమగును జుమ్మి
ప్రేమయనునది యొక్కటే పెన్నిధియగు. 12

(గీతమాలిక)

బ్రహ్మ, జీవుఁడు, నరుఁడు, దైవంబు, దేవ
తలును, దయ్యముల్, పితృదేవతలును, ధరణి
యందు నుండునట్టి మృగ విహంగములును,
మఱియుఁ గ్రిమికీటకంబులై మనుచునుండు
నన్ని జీవుల హృదయము లందుఁగూడ
నిట్టిప్రేమయే వెలుఁగొందు నెఱచిచూడ. 13

(గీతమాలిక)

దేవులందఱిలో మహాదేవుఁ డెవఁడు?
జగతి నంతను గదలింపఁ జాలునెవఁడు?
బిడ్డ కొఱకును బ్రాణముల్ వీడుతల్లి,
దొంగతనమును జేయును దొంగకూడ
వీని కంతకు మూలము ప్రేమసుమ్మి. 14

(గీతమాలిక)

అదియు వాఙ్మన సంబుల కావలుండు
దుఃఖసుఖములతోనుండుఁ దుదకు నదియు
సర్వశక్తియు సర్వనాశనముఁ జేయు
కాళికాదేవివలెనుండుఁ గడకునదియె
దయకు నిలయమై యొప్పును దల్లివలెను. 15

(గీతమాలిక)

వ్యాధి యాప్తబంధు వియోగబాధ తీవ్ర
తరముగానుండు లేమియు, ధర్మబుద్ధి,
ధర్మశూన్యము, దుష్టమౌకర్మ, మంచి
కర్మల ఫలితములుగూడఁ గడకుఁ బ్రేమ
యనెడు దానిఫలితములై తనరుచుండుఁ
గాని జీవుఁడొక్కఁడు చేయఁగలుగు దేని? 16

(గీతమాలిక)

సుఖముఁబొందఁగ నాత్రతఁ జూపువాఁడు
దుఃఖముకొఱకు మిక్కిలి దొర్లువాఁడు
మృత్యువును గోరువాఁడును నిత్యమైన
జీవితముఁగోరువాఁడును జెప్పనెపుడు
భ్రాంతితోఁగూడి మతిలేనిపశువులనియుఁ
బిచ్చివారలనియుఁ బల్కవచ్చుఁగాదె. 17

(గీతము)

స్వచ్ఛమగునట్టి మనసనుస్యందనంబు
నెక్కినీవెంతదవ్వైన నేగియున్న
దుఃఖసుఖములు సుడులుగా దొర్లుచుండ
నదియు సంసారసాగరమగును దుదకు. 18

(గీతమాలిక)

వినుము రెక్కలులేనట్టి విహగమీవు
తప్పుకొను మార్గమిదికాదు తలఁచిచూడఁ

గష్టములు పెక్కు తఱచుగఁ గల్గు నీకుఁ
దుదకు మృత్యువు దప్పదు పదును మించు
సాధ్యపడనట్టి కృషి నీవు సలుపు టేల?. 19

(గీతమాలిక)

జ్ఞానమార్గము వ్యర్థముగాన నీకు
దానిమీఁద నీవెప్ప డాధారపడకు
మర్చనలు ప్రార్థనలు వీడుమయ్య యింక
బలము నార్జింపఁ గృషిఁ జేయ వలదు నీవు
అహము లేని ప్రేమయె నీకు సర్వమగును
ప్రేమతో మంటఁగలిసెడు క్రిములు మనకుఁ
గఱవు నీతిని బూర్తిగాఁ గడకు నెపుడు. 20

(గీతమాలిక)

అందమగు తేజమును గాంచి యద్భుతంబు
జెంది కీటకము తుదకు జెడియు జూవు
మంటఁగలసియు నశియించు మఱియునటుల
ప్రేమపూరితమగు నాత్మ వెలుగుచుండ
నీచమగు నహంభావము నిజముగాను
దగ్ధమైపోవుఁ జేరియు దానియందు 21

గీతమాలిక

బిచ్చగానికి సుఖమెట్లు వచ్చు నెపుడు?
ధర్మమున క్షాత్రతగలుగు దానినెపుడు

దానమీయక దానిని దాచియుంచ
నేమిఫలితము చేకూరు? నిలనునీకు
నీదుహృదయము ప్రేమచే నిండియున్నఁ
బ్రతిఫలము గోరకుండియుఁ బరులకిమ్ము
ఈయఁగలదాని నంతయు నెంచినీవు 22

(గీతమాలిక)

హద్దులేని యాత్మకు నీవు ముద్దుగొల్పు
వారసుఁడ వగుటవలన వాస్తవముగ
నీహృదయమునందెకలదు నిక్కమైన
ప్రేమసార మనునదియుఁ గ్రియకుజూడ
నిమ్ము నీకున్నదంతయు నిమ్ముతుదకు
నిచ్చుప్రతిఫలమును గోర నింకిపోవు
ప్రేమసాగరమంతయు బిందువుగను 23

(గీతమాలిక)

బ్రహ్మ మొదలు క్రిమివఱకు స్వల్పమైన
యణువువఱకును గలయట్టి యంతులేని
జీవ నిర్జీవ కోటిలోఁ జేరియుండు
నతఁడె ప్రేమస్వరూపు డౌనట్టి ప్రభువు,
దైవము, భగవంతుడు గూడ దానిఁబట్టి
మిత్రమా! నీవువాని పవిత్రమైన
పదములందును నీదగుహృదయమాత్మ
మానసముల నర్పింపుము పూనిప్రేమ 24

(గీతమాలిక)

కలవు నీముందు వానికిఁ గలిగియుండు
పెక్కురూపము లీరీతిఁ బృథ్వియుండుఁ
గణనఁజేయక వానిని గడకు నీకు
దైవమునుగాంచఁ గలుగుట తరముకాదు
వెదకిచూచిన నెచ్చోట వెడలి నీవు
భేదభావమును విడిచి ప్రేమతోడ
సకలజీవులకెల్లను సమముగాను
సేవఁజేసిన మనుజుఁడె చివరకెపుడు,
దైవమును బూజఁజేసిన దానిఫలము
నొందగల్గును నిజముగా నుర్వియందు. 25

ప్రబుద్ధ భారత పత్రికకు హెచ్చరిక

(గీతమాలిక)

మేలుకొను మింక నొకసారి మేలుకొనుము
నీకు మృత్యువు కా దది నిజముగాను
క్రొత్తజీవితమును సమకూర్పనదియు
నీకు విశ్రాంతి నొసగెడు నిద్రయగును
కంజదళములఁ బోలు నీ కన్నులకును
సాహసంబగు దృశ్యము ల్చాలఁగాంచ
బలముఁగూర్ప విశ్రాంతియై పఱగుచుండు
వేచియున్నది లోకము వేగిరముగ
నిన్ను మరలగాంచ నిపుడు నిశ్చయముగ
సత్యమా! నీకు లేకుండు మృత్యు వెపుడు. 1

(గీతమాలిక)

బాటప్రక్కను గ్రిందుగాఁ బడియు నుండు
ధూళిఁజెదరంగ గొట్టక తుదకుశాంతి
కెట్టిభంగము లేకుండునట్టి రీతి
నెమ్మదిగ నడ్డులిడుచును నీవు మఱల
నటులెపొమ్మింక బలము సాహసము నిశ్చ
లత్వమానందముల గూడి లలితమైన
స్వేచ్ఛతో నీవు ముందుకు సేమమొప్ప
సాగుము ప్రబుద్ధ భారతీ! సాగుమింకఁ
బరులహృదయములను గదల్పఁగనుజాలు
పలుకులను బల్కుచుండియు వఱలుమీవు. 2

(గీతమాలిక)

ప్రేమహృదయులు నిన్నుంచి పెంచి రెచట?
నీదువృద్ధిని గాంచియు నెచటవారు
వెల్లడించిరో సంతోష? మెల్లనట్టి
నీ నివాసమిపుడిచటఁ గానరాదు.
కాని భావిగతి బలముగలిగియుండు
నదియు నీసృష్టిధర్మమై యలరుచుండు
సకలవస్తువులును గూడ జననమొందు
తావునకు మఱలబలము తగినరీతి
బొంది యేతెంచి యౌన్నత్య మందగల్గు. 3

(గీతమాలిక)

మేఘములు చుట్టియుండగ మెఱయుచుండు
మంచుఁగొండలు నిన్నుదీవించి క్రొత్త
వింతసమకూర్పఁ జాలెడునంతబలము
నీకిడుచునచటవియుండు నెపుడుఁగూడ
నట్టి నీజన్మభూమియం దపుడునీవు
బయలుదేరుము క్రొత్తగా బలముఁజేరి
స్వర్గవాహిని యగుగంగ శ్రావ్యమైన
శాశ్వతంబగు గానము సలుపుచుండ
నీదుపలుకులు గొనిపోవు నిశ్చయముగ
నవియు దానిప్రవాహమునందుఁ గలిసి
వెంబడించును దానిని వివిధగతుల
దేవదారు వృక్షములెల్ల దివ్యమైన
నీడనిచ్చి శాశ్వతశాంతిఁ గూడనీకు
గలుగజేసి విశ్రాంతిని గలుగఁజేయు. 4

(గీతమాలిక)

అన్నిటికిఁ బైనవెలయుచు హైమవతిగ
నొప్పుహిమవంతుఁ బుత్రిక యుమయుఁగలదు
నిర్మలత్వపరిశాంతుల నెగడునామె
శక్తివలెనుండి యన్నిట జగతియందు
నామెయే జగజ్జననిగా నలరుచుండు
సకలమగు పనులను జేయుశక్తి యామె
లోకమంతయు సృజియించు లోకమాత

సత్యమార్గముఁ జూపెడు జననియామె
కృపనుజూపియు జనులకు నెపుడుఁగూడ
నొక్కఁడందఱిలోనుండె నిక్కమనుచు
దెలుపువారికిఁ బ్రేమతోఁ దేటపడఁగ
నలసటగలుగఁజేయని బలమునీకు
నామెయే సమకూర్చు నీయవనియందు
నంతులేనట్టి ప్రేమయే యదియుఁజుమ్మి. 5

(గీతమాలిక)

ఒక్కయుగ మొక దేశము నిక్కముగను
తమదనుచుఁ జెప్పఁజాలని తాపసులును
జాతికిని మూలపురుషులై ఖ్యాతిఁగాంచి
హృదయమున సత్యమునుజూపి హితవుఁజూపి
మంచిచెడ్డలతోఁ గూడు మానవునకు
బోధఁజేసిరి ధైర్యముఁబూని వారు
వారిసేవకురాలవై వసుధయందు
"నుండెనొక్కటి యంతటనిండి" యనెడు
సత్యమగు రహస్యంబును సరిగనీవు
తెలిసికొంటివిపూర్తిగాఁ దెలివిఁగలిగి. 6

(గీతమాలిక)

ప్రేమరూపిణీ! పలుకుము ప్రియముగూర్చు
శాంతియుతమగు మృదువగు స్వరముతోడ
గాంచుదృశ్యము లెట్టులుగరగిపోయె

స్వప్నతుల్యములైనట్టి జగతులెన్నొ
శూన్యమును జేరుచుండుటఁ జూడనొక్క
సత్యమే దానిమహిమతో సరిగనెపుడు
వెలుఁగుచుండుటచివరకుఁ దలపుమీవు. 7

(గీతమాలిక)

మఱియులోకమునకు నిట్లు మఱలమఱల
జాటుచుండుము సత్యముఁ దేటపడగ
"లెండునరులార! మేల్కొనియుండుఁడింక
గలలఁగాంచకుఁడింకను గలలతోడ
నిండియుండియు నీభూమి మెండుగాను
నిచటఁగర్మమనునదియె యెపుడుఁగూడ
మంచిచెడ్డయూహలనెల్ల నెంచివాని
తోడ దార మాధారముఁగూడ లేక
పూలదండలనిర్మించుఁ బూలదండ
మంచిచెడ్డవాసనలను మఱియుఁగలిగి
యుండుపూలతో నేర్పడీయుండు నటుల
నట్టియూహలు శూన్యమునందుఁబుట్టి
వేరు మార్గికులు వానికి వెదుకలేవు
అల్పమగుసత్యమును గూడ నట్టివాని
నాదిమూలమౌ శూన్యమునందుఁ జేర్చి
ధైర్యమునుబూని సత్యముదరికిఁ జేరి
కాంచి దాశిని దానిలోఁగలియు డింక
గలలునశియింపఁజేయుఁడు కలలగనుట

నాపలేకుండియుండిన నపుడుమీారు
శాశ్వతంబగుప్రేమను జాలినంత
స్వేచ్ఛతోఁ గూడియుండెదు సేవఁగూర్చు ”
కలలుమాత్రముగాంచుడు గడకుమీారు. 8

జె. జె. గుడ్విన్ కిచ్చిన హెచ్చరిక.

సాగు మోయాత్మ ! నీవింక సరసగతిని
నీదు తారాపథమునందు నిక్కముగను
నోయి యానందమూర్తి ! విధేయుఁడవయి
స్వేచ్ఛతోఁగూడు యోచనల్పివరవఱకు
నెచట నెలకొనియుండునో యచటనెపుడుఁ
గాలమవకాశములు నీదుగమ్యమునకు
నడ్డుతగులక యుండునో యచట కీవు
సాగిపొమ్మింక నాగక వేగముగను
శాశ్వతంబగు శాంతియు శక్తిఁ గూర్చ,
నాఁదుదీవనలునుగూడ నమ్మకముగ
నీకుఁ జెందియుండునుగాక నిశ్చయముగ, 1

(గీతమాలిక)

నీదు నిజమగు సేవయే నీవుచేయు
త్యాగమును బూర్తిచేయును ధరణియందు
ప్రేమపూరితహృదయమే వెల్లివిరిసి
నీదుగమ్యముఁ జూపును నీకునెపుడు
నీదుతావునకు వెనుక నిండియుండు

మృదువగు గులాబిపూవుల మెత్తరీతి
శాశ్వతమగునట్టిదానిదౌ జన్మ్రిమెపుడు
కాలమవకాశములఁ జంపుఁగడకుఁజూడ. 2

(గీతమాలిక)

నీదుబంధములు తెగిపో నిజముగాను
నిర్మలానందశోధన నీకు ముగిసె
జీవితమరణముల నవి చేరిపోది
యొకటిగా నుండెనో దానియునికితోడ
నీవుగూడ నేకమగుచు నెగడుచుంటి
విపుడు పృథ్వియందు జనుల కెపుడునీవు
స్వార్థమును వీడి సాయంబు సల్పుటాని
ప్రేమతో లోకమందలి పెక్కుకష్ట
ములను దొలగించి జనులకుఁ బూర్తిగాను
సాయపడుటకు ముందంజ వేయుమెపుడు 3

ఖేతి మహారాజునకు హెచ్చరిక

(గీతము)

ఇనుని మేఘముగప్పిన నించుకంత
నంధకారము గ్రమ్మిన నాకసమున
బూనిన పనిని వీడక పూర్తిచేయు
మయ్య! ధీరహృదయ! జయమగును నీకు 1

(గీతమాలిక)

వేసవియు నేడు కాలము వెంటరాకు
శీతకాల ముండక యుండుఁ జెంతఁబల్ల
మనెడునది లేక యుండదేయిలయు గూడ
బల్లముండినఁ గెరటము బయలుపడును
నీడ వెలుతురులవలెను గూడనవియు
నొకటితర్వాత వచ్చు వేరొకటి యెపుడు
జలన మొందక యువ్వాని చందమునను
ధైర్యముగలిగి నిలువుము ధరణియందు 2

(గీతమాలిక)

జీవితపుధర్మములు పెద్దచెడునుగూర్చి
బాధకరములై యుండును వసుధయందు
అల్పకాలికమగు భోగ మవనియందు
గమ్య మస్పష్టమై యుండు గడకుఁజేర,
గాన ధీరహృదయ! యంధకారమందు
సాగిపొమ్మింక ముందుకు శక్తి జూపి 3

(గీతమాలిక)

చేసినపనియుఁ గష్టము ల్చివరకెపుడు
వ్యర్థములుగావు శక్తులు పాడువడిన
యాశలెల్లను బొందిన నాశనంబు

వీరుఁడవుగమ్ము నీయొక్క వారసులును
వీరులగుదురు నీకును విజయమబ్బు
చేసియుండిన మేలెప్డుఁ జెడదుసుమ్మి
కాన ధీరహృదయ! నీవుపూనుపనిని
సాహసముతోడఁ జేయుము సౌఖ్యమబ్బు. 4

(గీతమాలిక)

మంచివారలు జ్ఞానులనెంచ భువిని
స్వల్పసంఖ్యగనుందురు వారుజనుల
నడుపుచుందురుగాని యానరులువారి
విలువను గ్రహింపజాలరు తెలివిలేక
యెవ్వరిని లక్ష్యపెట్టక యెపుడునీవు
నెమ్మదిగ నడుపుము కడునెమ్మిఁజూపి. 5

(గీతమాలిక)

దూరముననుండువారు నీతోడనుంద్రు
సర్వశక్తియుతుఁడగు నాసర్వమయుఁడు
ప్రభువు నీచెంతనుండును వాస్తవముగ
నోమహాత్మ! దీవనలెల్ల నొక్కమాఱు
పడుచు నీపైన వర్షముపడెడురీతి
జయముఁగూర్చును నీకెప్డుఁజాలినంత. 6

జూలై 4 వతేది

(ఆమెరికాస్వాతంత్ర్యము ; స్వామి నిర్యాణము)

(గీతమాలిక)

దట్టముగ గూడి యూరేయి ధరణిఁగప్పి
శవముపైఁగప్పబడు గుడ్డచందమునను
కారుమేఘములు తుదకు వేరుపడుచుఁ
జెదరిపోవుట, గనుమింకఁ బిదపమఱియుఁ
వింతయగు నీకిరణములు పృథ్విదాకు
ముందులోకము మేల్కాంచు ముందుగాను
పక్షులన్నియు నేకమై పాడసాగు
దారలనుబోలు పుష్పముల్ తలలనెత్తి.
మంచుబిందువులనుగూడి మించిశోభ
యిడును సుస్వాగతము నీకుఁ గదకునపుడు
తమసహస్రదళారవిందములతోడ
విస్తరించినకొలనులు ప్రేమఁజూపి
హృదయపూర్వకస్వాగత మిడునునీకు
మిగులతేజస్వరూపుడ వగుటనీవు
ప్రభువరా! నీకు నెల్లరు భక్తిఁజూపి
వందనములిడుచుందురు ముందుగాను

(6)

స్వాగతము నీకు నిపుడు సుస్వాగతంబు
నీదుకిరణము లీనాడు నిజముగాను
స్వేచ్ఛనిచ్చును జనులకు స్థిరముగాను
సూర్యభగవానుఁడా! కడుశోభఁగూర్చి 1

(గీతమాలిక)

వేచియుండెను లోకంబు వెదకెనిన్ను
దేశకాలంబులనుబట్టి తెలిపి లేక
కొందఱు గృహములనువీడి, కొందఱుతమ
ప్రాణమిత్త్రులవీడియుఁ బడయనిన్ను
జింతఁగూరుచు సాగరసీమలందు
నడవిప్రాంతములందును బిడియపడక
చాలశ్రమకోర్చి సిద్ధమైచావునకును
నిన్ను వెదుకంగఁబోసాగి రన్ని దిశల
వారుచేసినకృషికిని ఫలితమిచ్చు
దినముచివరకు నేతెంచెఁ గనఁగవారు
ప్రేమ సేవయుత్యాగము క్రియకు ఫలము
నిచ్చి కార్యసాఫల్యమై మెచ్చదగిన
యట్టియాస్వేచ్ఛ లభియించెఁ గట్టకడకు
స్వేచ్ఛ తేజము ప్రబలమై పరివిగాను
నీవు వెదచల్లినాడవు నిజముగాను. 2

(గీతమాలిక)

నీదుమధ్యాహ్నకాంతిచే నిక్కముగను
లోకమంతయు వెలుగుచు లోకమందు
నుండు దేశములన్నియు నిందుకాంతి
ప్రతిఫలింపఁగఁ జేయుచు వఱలుచుండ
స్త్రీలు పురుషులు నీవైపు చేతులెత్తి
నీకు వందనములఁ జేసి యేకరీతి
నిన్నుఁ గొనియాడువఱకును నిశ్చయముగ
వారి బానిసత్వముపోయి వారికుండు
బంధములు పూర్తిగాఁ ద్రెంపఁబడిన వంచు
దెలిసి నూతనబలముతోఁ దిరిగి క్రొత్త
జీవితము ప్రాప్తమగుటచేఁ జెప్పరాని
సంతసము పొంగిపొరలెడునంతవఱకు
నడ్డులేని నీమార్గమునందు నీవు
కదలిపొమ్మింక ప్రభువరా ! ముదమొసఁగుము. 3

సమాప్తము

శ్రీ హయగ్రీవాయ నమః

ప్రతిజ్ఞా యౌగంధరాయణము

రచయిత:

కవిశేఖర, శతావధాని, మధ్వశ్రీ

పల్లె పూర్ణప్రజ్ఞాచార్యులు

గుంటూరు హిందూకళాశాలాసంస్కృతాధ్యాపకులు

★

ప్రకాశకులు :

వేంకట్రామ అండ్ కో.,

ఎడ్యుకేషనల్ పబ్లిషర్సు,

పూర్ణప్రజ్ఞ గ్రంథమాల - ద్వితీయకుసుమము

శ్రీ హయగ్రీవాయనమః

ప్రతిజ్ఞాయౌగంధరాయణము

ఇది

శ్రీభాసమహాకవి సంస్కృతనాటిక కాంధ్రానువాదము

రచయిత:

కవిశేఖర మధ్వశ్రీ పళ్ళె పూర్ణప్రజ్ఞాచార్యులు

(గుంటూరు హిందూకళాశాల సంస్కృతాధ్యాపకులు)

—: ప్రకాశకులు :—

వేంకట్రామ అండ్ కో.,

ఎడ్యుకేషనల్ పబ్లిషర్సు

బెజవాడ - మద్రాసు

1947

ద్వితీయ ముద్రణము
3000 ప్రతులు

వేంకట్రామ్ పవర్ ప్రెస్, ఏలూరు.

సర్వధారినామ సం॥రం

శ్రీ హయగ్రీవాయనమః

విజ్ఞప్తి

(ద్వితీయ ముద్రణమునకు)

తెనాలితాలూకా మూల్పూరువాస్తవ్యుఁడు, భూస్వామి ఉదారుఁడు, వృద్ధికాముఁడు నగుమద్భాగినేయుఁడు చిరంజీవి శ్రీ మానూరు వేంకటరమణారావు మద్గ్రంథంబులలో నొక్కదానిని ముద్రింప ముచ్చటపడి సాదరంబుగా నా కొసంగినసద్ద్రవ్యముతో నే నీనాటికను 1947 సంవత్సరము మా పూర్ణప్రజ్ఞ గ్రంథమాలలో ద్వితీయ కుసుమముగాఁ దొలుసారి ప్రకటించితిని. భాసమహాకవి యందలి భక్తిచేతనేమి మద్గ్రంథమునందలి గుణలేశముచేతనేమి యనుపదమే యీనాటికను శ్రీఆంధ్ర విశ్వ విద్యాలయమువారు 1950 వ సంవత్సరమునకును, శ్రీ మద్రాసు యూనివర్సిటీవారు 1951 వ సంవత్సరమునకును ఇంటర్మీడియేటు పరీక్షకుఁ బాఠ్యగ్రంథముగా నిర్ణయించి ద్వితీయ ముద్రణావకాశమును వెంటనే కలిగించి మా గ్రంథమాలను బ్రోత్సహించినందులకు ఉభయ విశ్వవిద్యాలయాధికారులకును మత్కృతజ్ఞతా పూర్వకాభివందనముల నర్పించుచున్నాను.

నాయందభిమానముంచి యేతన్నాటికాపునర్ముద్రణమునకు రు 650 ఆఱువందలయేఁబది రూప్యముల నాకు విరాళముగా నొసఁగిన శ్రీ గుంటూరు రామచంద్రపురాగ్రహార సభవారికి నాధన్యవాదములు.

పై విధమున నాకును మద్గ్రంథమాలకును సర్వవిధములఁ దోడ్పడుచున్న విద్యాధికారులకు, గ్రంథ ప్రకాశకులకు, ఉదారులకు, అభిమానులకు, సహాయులకు, మిత్రులకు నా యభివందనములు.

ఇట్లు

[illegible]

ఆంధ్ర భాషానిలయము, నాంపల్లి, హైదరాబాదు
A NILAYA NAMPALLY, HYD-A.P

శ్రీహయగ్రీవ...

విజ్ఞప్తి

మామిత్రులగు శ్రీమాన్ కొమాండూరు కృష్ణమాచార్యుల వారిపీఠికయే భాస, తన్నాటక ప్రాశస్త్యమును బహుభంగుల విశదీకరించుటం జేసి నాభారము చాలవఱకుఁ దగ్గినను సముదాచారానుసారము రెండువాక్యముల వ్రాయుచున్నాను.

శ్రీమహామహోపాధ్యాయ టి. గణపతిశాస్త్రిగారి యముద్రిత గ్రంథాన్వేషణ కృషిఫలితముగా లభించిన భాసనాటక చక్రమును గాంచుభాగ్యము నాకు రమారమి యిరువదియైదు వత్సరములకుఁ బూర్వము గలిగినది. అప్పటి తన్నాటకాలోకన జనితానందమే నాకు 'ప్రతిమా, ప్రతిజ్ఞాయౌగంధరాయణ, చారుదత్త, దూతవాక్య, దూతఘటోత్కచ' నాటకాంధ్రీకరణములకు హేతువయ్యెను. ఉత్సాహము కలిగినప్పుడు గ్రంథములు వ్రాయుటయేగాని వానిఁ బ్రకటించుటయందు నా కంతగా దృష్టియుండెడిదిగాదు. కనుకనే కావ్యాలోక, శతలక్షణ్యాది గ్రంథము లెన్నియో మాతృకారూపమున నింటనే యున్నవి. ఇప్పటికేని కొందఱుమిత్రుల ప్రోత్సాహముతో నెలకొల్పఁబడిన మా పూర్ణప్రజ్ఞ గ్రంథమాలలో ఈ ప్రతిజ్ఞా యౌగంధరాయణమును (నాటికను) ద్వితీయ కుసుమముగాఁ బ్రకటింపఁ గలిగినందులకు సంతసించుచున్నాను. ఆదరపూర్వకముగాఁ బీఠికవ్రాసియిచ్చిన యస్మత్ప్రియ మిత్రులకు ధన్యవాదములు. మా గ్రంథమాలయందుఁ బ్రత్యేకాభిమానముఁ జూపుచున్న మిత్రులకును, ప్రకాశకులకును, శ్రీ చంద్రికా ముద్రాలయాధిపతులకును నే నెంతయుఁ గృతజ్ఞుఁడను.

ఇట్లు, గ్రంథకర్త

పల్లె పూర్ణప్రజ్ఞాచార్యులు.

పీఠిక

ప్రథితయశసాం భాససౌమిల్ల కవిపుత్రాదీనాం ప్రబంధా నతిక్రమ్య వర్తమానకవేః కాళిదాసస్య క్రియాయాం కథం బహుమానః.

సూత్రధారకృతారంభై ర్నాటకై ర్బహుభూమికైః
సపతాకై ర్యశో లేభే భాసో దేవకులై రివ.

పైనుదాహరింపఁబడిన కాళిదాసబాణమహాకవుల వాక్యముల వలన భాసుని ప్రతిభావిశేష మూహింప వలసినదే గాని వ్రాయ నలవి గాదు. కవితాప్రపంచమున కవికులగురుఁడును, గద్యరచనమున నిరవద్య విద్యాచణుఁడగు బాణుఁడును భాసునియందు సమాన ప్రతిపత్తి గల్గి యుండుట గమనింపఁదగిన విషయము.

1910 యవ సంవత్సరప్రాంతమున మహామహోపాధ్యాయ టి. గణపతిశాస్త్రిగారీ నాటకములను విద్వల్లోకమునకు వెలిఁబుచ్చిరి. అది మొదలుగా భాసకవిని గూర్చియు తత్కృతనాటకత్రయోదశిని గూర్చియు వాదప్రతివాదములు ప్రబలియుండుట పండితులెఱింగినదే. నాటకములు మిక్కిలి సంగ్రహముగా నుండుటవలనను సౌలభ్యాతిశయముగలిగి యుండుటవలనను పూర్వకవికృతములును విస్తృతములుఁ నగునాటకములను రంగస్థలోచితముగా మలయాళమునందలి భరతపుత్రులు కొత్తి వ్రాసికొనియుందురనియు తజ్జ్ఞులభిప్రాయపడుచున్నారు. ఈ పూర్వకవిభాసుఁడే కానోపు. రచన ననుసరించియు శైలియందలి యార్షభావమునుబట్టియు నీ నాటకములు తప్పక కాళిదాసునకుఁ బూర్వమునఁగల రూపకరంగమును సూచించుచున్నవనుట నిర్వివాదము.

శతానీకపుత్త్రుండగు నుదయనుఁడు క్రీ. వె. 6 వ శతాబ్దమునను ఐదవ శతాబ్దప్రారంభముననను వత్సవిషయము నేలిన వత్సరాజు. ఆకాలముననే భాసుఁడును గలఁడని యొకయభిప్రాయము. మృచ్ఛకటికమునఁగల పాలకుఁడును, మాగధుఁడగు దర్శకుఁడును, ఉజ్జయినీనాథుఁడగు ప్రద్యోతుఁడును సమకాలికులు. చారుదత్తనాటకమే

మృచ్ఛకటికముగాఁ బరిణమించినది. శూద్రకుఁడు క్రీ. శ. 2 వ శతాబ్దమునఁ గలఁడని నిరూపించిరి. పాణిని క్రీ. పూ. 6 లేక 7 వ శతాబ్దప్రాంతములఁ గలఁడని ఐతిహాసికసమ్మతి. భాసుని అపాణినీయ ప్రయోగముల ననుసరించియు, ఆర్షకావ్య మగు శ్రీమద్రామాయణముతోఁ దులఁదూఁగఁగల శైలీసంవాదము ననుసరించియు, భాసుని కాలము క్రీస్తునకుఁ బూర్వము 4 లేక 5 వ శతాబ్దప్రాంతము గానోపును.

ఈనాటకములందు సౌలభ్య మనునది ప్రథమగుణము. ఔత్తరకాలికనాటకరంగమునఁ బ్రదర్శనయోగ్యము లయ్యును శబ్దార్థవైచిత్ర్యము గలిగి ప్రాచ్యపాశ్చాత్యఖండములందును నగ్రస్థానము వహించిన కాళిదాసనాటకములు మొదలుగా ప్రదర్శనమున కనుకూలములు గానివియును శబ్దార్థాడంబరము గలిగి సుప్రసిద్ధ పాణినీయ ప్రయోగోదాహరణభూతము లగు భవభూతి, మురారి ప్రస్థానముల వఱకును గల శైలీభేదములు భాసునియం దించుకేయును గానరావు. ఇంతియ గాక రంగస్థలమున నత్యంతరమణీయములును యామమాత్రకాలమునఁ బ్రదర్శనార్హములు నగుట యీనాటకములందుఁ గల సామాన్యగుణసంపద. కావున దృశ్యకావ్యము లనుమాట యీనాటకములకే చెల్లినది. ఉత్తరనాటకరంగమున మృచ్ఛకటిక మొక్కటి దక్క తుల్యానుభావము గలనాటకము మచ్చునకైన దొరకదు. పాత్రములగమనిక సినిమారంగమునందువలె నతిశీఘ్ర మగుటయు రసస్ఫూర్తి గల్గి యుండియును పదాడంబరము లేక చర్వణానుకూల మగురీతి నొప్పారుటయును ఈరూపకములందుఁ గలయనన్యసామాన్యధర్మము. కావున నతిప్రాచీనము లయ్యును బ్రకృతరంగమున కవి యెంతయు ననుకూలము లగుచున్నవి. "ఉదయనకథాకోవిదగ్రామవృద్ధాన్" అను మహాకవిపద్ధతి కనుగుణముగా నీనాటకములం దితిహాసవృత్తము లగు రామభారతకథలే గాక స్వప్నవాసవదత్తాప్రతిజ్ఞాయౌగంధరాయణములం దుదయనకథయుఁ గ్రోడీకరింపఁబడినది. ఆధునికనాటకమందలి పిచ్చివానిపాత్ర యౌగంధరాయణపాత్ర ననుసరించియే వ్రాయఁబడినది. మహావీరచరిత్రమునకు నుత్తరరామ

చరిత్రమునకుఁ గల సంబంధమే, ప్రతిజ్ఞాయౌగంధరాయణస్వప్నవాసవదత్తలకునుగలదనుట విమర్శకసంవేద్యము; రసములును వీర-(కరుణ విప్రలంభగర్భిత) శృంగారము లుభయమునకును సమానమే. పై యుదాహరణముల ననుసరించి యీనాటకము లుత్తరరూపకకర్తలకెట్లు మార్గదర్శకము లయ్యెనో పండితు లూహింపఁ గలరు.

ఈనాటకములందలి యితివృత్తములు ప్రఖ్యాతోత్పాద్యమిశ్ర భేదములు గల్గి రామభారతభాగవత కథాపీఠముల ననుసరించి స్వోపజ్ఞ మగు శైలివిశేషముచే నల్లఁబడినవి.

బాలచరితమున శ్రీకృష్ణచేష్టితములును, మధ్యమవ్యాయోగ, పంచరాత్ర, దూతవాక్య, దూతఘటోత్కచ, కర్ణభారోరుభంగములఁ బాండవకథయు, ప్రతిమాభిషేకముల రామోదంతమును, ప్రతిజ్ఞా స్వప్నముల నుదయనేతివృత్తమును, అవిమారకచారుదత్తముల నుత్పాద్యవస్తువులును కూర్పఁబడి కవియొక్క సర్వంకష ప్రతిభాశాలిత్వమును, సర్వరసప్రపంచచంచుత్వమును వేనోళ్ళఁ జాటుచున్నవి. కాళిదాస భవభూతులందును ఇట్టిచతురశ్రనిర్మాణమార్మికతకలదా? అనియును శంకింప వలసినట్లున్నవి గాదా యీరూపకములు? ఇవి త్రయోదశ సంఖ్యాత్మకములయ్యును రసపూర్ణములే.

ప్రకృతనాటకమునందలి పాత్రౌచిత్యరసపోషణాదికావ్యగుణములను విస్తరించి వర్ణింపవలయుననిన నుపోద్ఘాతము విస్తరించుటయేగాక పాఠకలోకమున కేర్పడుస్వైరభావముల నరికట్టు ప్రయత్నమువంటి దగునేమో యని యట్టియుద్యమమునుండి విరమించుచున్నాను.

గ్రంథకర్తలగు మధ్వశ్రీ పూర్ణప్రజ్ఞులు సార్థకనామధేయులు, నాంధ్ర విద్వల్లోకమున కతిపరిచితులు నగుట వారిని పాఠకులకుఁ బరిచితులనుగా నొనర్ప యత్నించుట కేవల మనుభవపునరుక్తి యగును. అయినను నూతనవిద్యార్థులకుఁ గొంత యెఱింగించుటయు యుక్తమే. వీరు బాల్యమునందె శబ్దశాస్త్రనిష్ణాతులై యష్టావధాన, శతావధానముల నొనరించి కావ్యనాటకనిర్మాణమున నుభయ

భాషలందును బంచాశదధిక గ్రంథముల రచించిరి. శ్రీరామకళ్యాణమే వీరి ప్రథమప్రయత్న మగునచో వీరి ప్రతిభావిశేషము చాలవఱకును జెప్పినట్లే యగును. పరిణతదశ నందిన కాదంబరీకవిత యనర్ఘశము గదా. ముద్రితగ్రంథములగు ద్విపదమేఘసూత్ర కైకేయీ సౌశీల్యాదు లాంధ్రుల కదివఱకే సుపరిచితములు. కావ్యాలోక శతలక్షణ్యాద్యనేక గ్రంథము లింకను ముద్రణాలయమును జొఱకున్నవి. భాసునిసాల ఖ్యాతిశయమునకు మెఱుగు వెట్టినట్లున్న దీయాంధ్రీకరణము. స్థాలీపులాకన్యాయముగా ఈ క్రింది శ్లోకమున కాంధ్రీకరణమును బరిశీలింపుడు.

శ్లో॥ కాష్ఠాదగ్నిర్జాయతే మథ్యమానాత్ భూమిస్తోయం ఖన్యమానాదదాతి
సోత్సాహానాం నా స్త్యసాధ్యంనరాణాం మార్గారబ్ధాః సర్వయత్నాః ఫలంతి.

అం-1-శ్లో-18

గీ. రాయుచోఁ గట్టెనుండియు రాలు నిప్పు త్రవ్వుచో నీరొసంగును ధరణి యేని
కా దసాధ్య ముత్సాహుల కేది కూడఁదలఁ నొనర్చ ఫలించు యత్నంబు లెల్ల.

శ్రీయాచార్యులవారు నాకుఁ జిరపరిచితు లగుటయే గాక మిత్రులును గౌరవపాత్రులు నగుటచే వీరి నామస్మరణము నాహర్ష చరిత్రమున వ్యంగముగా నొనరించియుంటిని.

"స్వాదుకాంబరీరసాస్వాదమునను బూర్ణమగు ప్రజ్ఞ వాయని బుధవరులను, శాబ్దికులఁ గావ్యవేత్తల సరసకవుల లాక్షణికులను దలఁతు సలక్షణముగ". (1-7 ఆంధ్రహర్షచరిత్రము)

ప్రస్తుతము కీతికామిమమున మరల వీరియుత్కర్షమును బరిమిత ముగాఁ బచరింపఁ గల భాగ్యము నా కొదవించినందులకు కృతికర్తల కెంతయుఁ గృతజ్ఞుఁడను. శ్రియఃపతి వీరి కాయురారోగ్యసంపదల నొసంగును గాక యని యభిలషించుచు నింతటితో నాపీఠిక ముగించుచున్నాను.

గుంటూరు,
25—5—47.

కొమాండూరు కృష్ణమాచార్యులు,
Retd.) Lecturer, A. C. College, Guntur.

ఈనాటికయందు వచ్చు పాత్రములు

పురుషులు

యౌగంధరాయణుఁడు – వత్సరాజుగారి ప్రధానమంత్రి

సాలకుఁడు
నిర్ముండకుఁడు } యౌగంధరాయణుని చారపురుషులు

హంసకుఁడు – వత్సరాజునకు నిత్యసన్నిహితుఁడగు పరిచారకుఁడు

బ్రాహ్మణుఁడు – యౌగంధరాయణుని మిత్రుఁడు

కాంచుకీయుఁడు } మహాసేనమహారాజుగారి యంతఃపుర పరిచారకుఁడగు బాదరాయణుఁడు

రాజు – } మహాసేన మహారాజు. వాసవదత్త తండ్రియగు ప్రద్యోతుఁడు

విదూషకుఁడు – వత్సరాజుగారి ప్రియవయస్యుఁడు వసంతకుఁడు

ఉన్మత్తకుఁడు – పిచ్చివేసముతోనున్న యౌగంధరాయణుఁడు

శ్రమణకుఁడు – బౌద్ధసన్యాసివేషముతోనున్న వత్సరాజుమంత్రి

రుమణ్వంతుఁడు – వత్సరాజ సచివుఁడు – శ్రమణకవేషధారి

భటుఁడు – మహాసేన భృత్యుఁడు

గాత్రసేవకుఁడు – వాసవదత్తావాహనమగు భద్రవతికిఁ బరిచారకుఁడు

సాధారణభటులు (ఇరువురు) – మహాసేనుని భటులు.

భరతరోహకుఁడు – మహాసేనుని ముఖ్యమంత్రి

శాలంకాయనుఁడు – మహాసే[illegible]ని సచివుఁడు

స్త్రీలు

విజయ – వత్సరాజగృహమున ద్వారపాలిక (ప్రతీహారి)

దేవి – మహాసేనుని పట్టపురాణియగు అంగారవతి.

శ్రీ హయగ్రీవాయ నమః

ప్రతిజ్ఞా యౌగంధరాయణము

ప్రథమాంకము

(నాంద్యంతమున సూత్రధారుఁడు ప్రవేశించును)

సూత్రధారుఁడు—

గీ. సేన మెల్లర కిడు మహాసేనుఁ డధిక
బలుఁడు వాసవదత్తోరుభద్రుఁ డెపుడు
వత్సరాజాభిధానుఁ డవార్యశక్తి (1)
రాజితుం డగుయౌగంధరాయణుండు॥

[నడచి తెరవైపు చూచి] ఆర్యారాలా ! ఇటువచ్చెదవా ?

[ప్రవేశించి]

నటి:—ఆర్యా ! ఏమి సెలవు ?

సూత్ర:—నటీ ! ఏదే నొక్కదానింగూర్చి గాన మొనర్పుము. నీ గానమ్ముచే రంగస్థలంబు ప్రసన్న మగుడు మేమును నాటక ప్రయోగంబున కుపక్రమింతుము. నటీ ! ఆలోచించుచుంటి వేమి ? పాడెదవా ?

నటి:—ఆర్యా ? బంధుకులంబున నేదో యస్వస్థత వాటిలినట్లు నేఁడు కలఁగంటిని. కానఁ గుశల మెఱింగి వచ్చుటకు నెవరినైనఁ బంపఁ గోరెద.

సూత్ర—అట్లే యొనర్చెదను.

గీ. పురుషు నొక్కనిఁ బంపుదుఁ బూవుఁబోఁడి !
అఖిల మెఱిఁగినవాని హితాభిలాషి.

[తెరలో]

సాలకా ! సిద్ధముగా నుంటివా ?

సూత్ర:—

అఖిల మెచ్చఁగినవాని హితాభిలాషి
నదిగో యౌగంధరాయణుఁ డంపునట్లు.

[ఇరువురు నిష్క్రమింతురు]

ఇది స్థాపన.

[పిమ్మట సాలకునితో యౌగంధరాయణుఁడు ప్రవేశించును]

యౌగంధరాయణుఁడు:—సాలకా ! సిద్ధముగా నుంటివా ?

సాలకుఁడు:—ఆర్యా ! సిద్ధముగా నుంటిని.

యౌగం:—చాల దూరము పోవలయుఁ జుమా.

సాల:—మహత్తరం బగుస్నేహంబుతోఁ గదా యేలినవారికడ సేవ చేయుచున్నాను.

యౌగం:—ఔను. అట్టిస్నేహంబుగల బలశాలియే గదా పోఁగలఁడు. వలయున

గీ. ఇడ వలయు దుష్కరపుఁ బెట్టు సెప్పుడు స్నేహ
భరితులందునొ సత్కార నిరతులందొ
వారిసామర్థ్యమును దైవవశముచేతఁ
జెడినఁ జెడు లేక యనుకూలపడినఁ బడును. 3

అట్లని నర్మదానదీతీరసమీపవర్తి యగు వేణువనంబు నంటి మూఁడరణ్యంబులు గలవు. వానిలో నాగవనంబునకు రేపు మహారాజుగారు వెడలుదురు. ఈలోపలనే నీవు శ్రీవారిని సందర్శింప వలయుఁజుమా.

సాల:—ఆర్యా ! మహారాజుగారికి మనవి చేయఁదగు విషయంబుల తోడి లేఖయేగదా నన్నుఁ బోనీయకున్నది.

యౌగం:—విజయా !

(ప్రవేశించి)

విజయ:—ఆర్యా! ఏమి సెలవు.

యౌగం:—లేఖను రక్షాసూత్రమును త్వరితముగాఁ గొనిరమ్ము.

విజయ:—చిత్తము (నిష్క్రమించును.)

యౌగం:—సాలకా! నీవీమార్గము నెన్నఁడైనం జూచియుంటివా?

సాల—లేదు. వినియుంటిని.

యౌగం:—ఇదియు మేధావిలక్షణంబె. ఓయీ! ప్రద్యోతుఁడు వనగజప్రచ్ఛాదితశరీరం బగునీలగజంబు నొకదానిఁ గల్పించి మనప్రభువుగారిని వంచింపఁ దలంచుచున్నాఁడని నేఁడు విన వచ్చినది. మహారాజుగారిబుద్ధి యీపాటికే మోసమునఁ బడియుండ దనితలంతును. ఆహా! ప్రద్యోతునకు మా వత్సరాజువలన నెంత భయము! దీనివలన నాతని యక్షౌహిణులకు వత్సరాజుసైన్యముతోఁ బోరఁ జాలమి తెల్లమగును. ఏల యన.

చ. బల మధికమ్మె కాని నరహాలుకేదరము కాదు, వీరులుం
గల రధికమ్ము కారు నరకాంతునిపై ననురక్తు, లందుచే
ఛలమున వత్సరాజుఁ గొన సాహసి యయ్యెను వీడి యుద్ధవా
ర్తలు; బల మెంత యున్న ననురాగము లేనిమొదన్ గలత మా.

(ప్రవేశించి)

విజయ:—ఇదిగో లేఖ. రక్షాసూత్రము సర్వాంతఃపురజన హస్తంబులనుండి తొందరింపఁబడుచుండె నని రాజమాతగారు సెలవిచ్చిరి.

యౌగం:—విజయా! సర్వాంతఃపురవధూకరస్పృష్టంబు గాని వేరొండు గాని రక్షాసూత్రంబు వేగిర మొసంగుఁ డని రాజమాతగారికి మనవి చేయుము.

విజయ:—ఆర్యా! చిత్తము. (నిష్క్రమించును)

(ప్రవేశించి)

నిర్ముండకుఁడు:—ఆర్యా! సుఖ మగుఁ గాక.

యౌగం:—ఏమీ నిర్ముండకుఁడా?

నిర్ముం:—ఆర్యా! మహారాజుగారిసన్నిహిత పరిచారకుం డగు హంస
కుఁడు వచ్చియున్నాఁడు.

యౌగం:—ఏమీ! హంసకుఁడొక్కఁడే వచ్చె ననియా? సాలకా!
ఒకముహూర్తంబు విశ్రమింపుము. అవసర మగునేనిఁ ద్వరిత
మ్ముగా నైనఁ బోవచ్చును లేదేని విశ్రాంతినైన నందవచ్చును.

సాల:—ఆర్యా! చిత్తము. (నిష్క్రమించును)

యౌగం:—నిర్ముండకా! హంసకుని దోడి తెమ్ము.

నిర్ముం:—ఆర్యా! చిత్తము. (నిష్క్రమించును)

యౌగం:—ప్రభువుగారితో నవినాకృతుం డగుహంసకుఁ డిప్పుడేకాకియై
వచ్చెనని వినుటచే నాచిత్త మెంతయుఁ దత్తఱ పడుచున్నది.
ఏల యన.

సీ. కబురులం దెల్ప బందుగుల్ కాచి యుండ
నరిగి పరదేశ మిలు సేరునరున కట్ల
ప్రియమె విందునో యకట! యప్రియమె విందు
నో గదా యని శంకింప సాఁగె మనసు.

(పిదప హంసకుఁడు నిర్ముండకుఁడును బ్రవేశింతురు)

నిర్ముం:—ఆర్యా! ఇటు — ఇటు.

హంస:—ఆర్యయౌగంధరాయణు లెచ్చట నున్నారెచ్చట నున్నారు?

నిర్ముం:—వీరే యార్యయౌగంధరాయణులు. సమీపింపుఁడు.

(నిష్క్రమించును)

హంస:—(సమీపించి) ఆర్యునకు సుఖ మగుఁగాక.

యౌగం:—హంసకా! మహారాజుగారు నాగవనంబునకుఁ బోలేదు
కదా.

హంస:— ఆర్యా! మహారాజుగారు నిన్ననే నాగవనంబునకుఁ బోయినారు.

యౌగం:— అయ్యో! నిష్ఫలంబుగదా యిక సాలక ప్రేమణము. వంచితుల మైతిమి. ఇఁక నేమైనఁ దిరిగి యాశకలదా? లేక యిప్పుడే ప్రాణములఁ బాయ వచ్చునా?

హంస:— రాజుగా రింతవఱకు జీవించియే యున్నారు.

యౌగం:— రాజుగా రింతవఱకు జీవించియే యున్నారనుటచే నేలిన వారి కొకపాటియాపద గల్గినట్లు చెప్పినట్లయ్యె. మహారాజుగారు పట్టువడిరా? ఏమి.

హంస:— ఆర్యులు చక్కఁగ నూహించితిరి. అట్లే పట్టువడిరి.

యౌగం:— ఎట్లు. మహారాజుగారు పట్టువడిరా? ఆహా! ఎంత దుష్కరకృత్యం బొనర్చిరి. నేటికిఁ బ్రద్యోతుని భాగ్యము ఫలించినది. నేటినుండియు వత్సరాజామాత్యుల కసమర్థతయు నపకీర్తియుఁ బ్రకటితంబు లగు. రాఁబోవు ననర్థంబులకు ముందే ప్రతీకారముఁ జింతించునా రుమణ్వంతుఁ డెప్పు డెచ్చటకేగెను? ఆయాశ్వికసైన్య మప్పు డెందుండెను? ఏల యన

ఉ. స్వామియెడన్ సరాగ మతిసాహ్యదనీతము సత్కులంబు వ్యా
యామపటిష్ఠపూర్ణవిషయంబు గుణార్జవయుక్త మాశ్విక
సోమము లంచ మీ నరులఁ జొచ్చెనో? దురమభూమి యాట న
ల్పోమ్ముల విచ్చెనో? రిపుసమూహ మెదుర్కొనలేమి నొచ్చెనో?

హంస:— మహారాజుగారు సమగ్రయోధబలపరివారులేని ఈయనర్థము మూడకయే పోయెడిది.

యౌగం:— ఏమీ! మహారాజుగారు సమగ్రయోధపరీతులు కారా?

హంస:— ఆర్యా! చిత్తగింపుఁడు.

యౌగం:— మార్గశ్రాంతిచే నీవును బడలియున్నావు. కూర్చుండుము.

ఆతపం = ఎండ
పరిచ్ఛదుడు = కప్పుకొనువాడు

ప్రతిజ్ఞాయౌగంధరాయణము

హంస:— ఆర్యా! చిత్తము. (కూర్చుండి)

ఆర్యా! చిత్తగింపుడు. మన మహారాజుగారు హాయసుఖదాయక మీకాల మని కించిదవశిష్ట యగు రేయియందే యనుక రేవుదారిగ నర్మదానదిని దాటి వేణువనంబున నిజకళత్రంబునుంచి యాతపత్రమాత్ర పరిచ్ఛదుండై గజమృగయార్హంబగు బలంబుతో మృగంబుల హాహారావంబులు పిక్కటిల్లు వీథినుండి నాగవనంబునకుఁ బ్రయాణమైరి.

యౌగం:— తరువాత తరువాత.

హంస:— తరువాత సూర్యుఁ డంపవేటుదూరంబున నుండఁ గొన్ని యోజనంబులు నడచి పోవ మదగంధిర పర్వతమునకు గోశ మీవలఁ దటాకపంక్తోత్థితమై, యర్ధనిర్మిత, మనశ్శిలా లేపంబుం బలె భీమదర్శనం బగుగజయూథంబు మాదృష్టిపథంబునం బడియె.

నిర్మిత = చేయబడిన

యౌగం:— తరువాత తరువాత.

హంస:— తరువాత మనసేనలు తదేకదృష్టితోఁ జూచుచుండ నాగజయూథంబు భయం బుప్పతిల్ల నొక్కెడ గుమిగూడె — అప్పుడీయవసరంబునకు మూలకండ మగునొకభటుండు మహారాజుగారిచెంతకు వచ్చెను.

యౌగం:— ఆఁపుము — ఆఁపుము. ఇచ్చటికిఁ గోశమాత్రదూరంబున మల్లికాలతాచ్ఛాదిత శరీరంబుతో నఖదంతశూన్యంబుగ నేక నీలంబగు నొకయేనుఁగు నాకగుపించెనని చెప్పలేదా?

హంస:— ఏమీ! ఆర్యున కంతయు నవగతమే. ఇంత జాగ్రదవస్థయందున్నను ఇట్టియనర్థ ముప్పతిల్లినది గదా.

యౌగం:— ఓయీ! జాగరూకుని కంటెను విధియే బలవత్తరమని యెఱుంగుము. తరువాత తరువాత.

హంస:— తరువాత ప్రభువుగారు నూఱు బంగారునాణెంబు లా వ్యక్తిసమునకు బసదనం బిచ్చి యుండలువిన నిట్లనియె. హస్తిశిక్షయందు నీలకువలయుతను వను గజసార్వభౌమ మొంను గల దని తొల్లి చదివియుంటిని. కావున మీరెల్ల రీగజయూధంబున నప్రమత్తులరై మెలంగునది. నేను వీణామాత్ర ద్వితీయుఁడ నై యాగజేంద్రమును బట్టితెచ్చెదను అని.

యౌగం:— అప్పుడు రుమణ్వంతుఁడు స్వామి నుపేక్షించెనా?

హంస:— లేదు. లేదు. ఏలినవారిని బతిమాలుకొని రుమణ్వదమాత్యుఁ డిట్లు మనవి చేసెను.

మహారాజా! ఐరావణాదిదిగ్గజ గ్రహణంబును దేవరవారి పట్ల నాపపన్నంబు. కాని రక్షణ కళకంబు లగుటంజేసి దేశాంతరంబులు సన్నిహితానరంబులై యుండును. అందును నిర్జలు దుష్కులీను లగుననార్యులు నివసింతురు. కావున గజయూధయోగ్యపదాతివర్గంబుతోనే గాక సమగ్రసైన్యంబుతో మనమందఱ మట కేగుదమే కాని దేవరవా రొంటరిగ నేగుట సమంజసము కాదు అని.

యౌగం:— రుమణ్వంతుఁడు మహాజనసమక్షమునందే మహారాజుగారితో నిట్లు మనవి చేసెనా? అట్లని యాతనిప్రభుభక్తి నిరుప మనియే తలంతును. తరువాత — తరువాత,

హంస:— తరువాత మహారాజుగారు తన్నట్లు వారించెను రుమణ్వంతుని దనప్రాణంబులపై నొట్టిడుకొని నివారించి నీలవలాహకమును నేనుంగు డిగి సుందరపాటలనామకహయరత్న మధిరోహించి యంబరమణి నభోమధ్యంబు చేరక మున్న యిరువది మంది భటులు వెంట రాఁ బ్రయాణ మైరి.

యౌగం:— విజయంబునకా? — ఛీ, గజగ్రహణకుతూహలంబునఁ బ్రద్యోతునివంచనోద్యమంబు దలంపఁ డాయె. తరువాత — తరువాత.

హంస:— తరువాత ద్విగుణమాత్రంబుగ మార్గంబు గమించి యొక్కచో సాలవృక్షచ్ఛాయయందు వృక్షసావరణంబున దేహనీలిమంబు ప్రత్యక్షము కనుంగొనరాక తళతళ మెఱయుచు నశరీరనిక్షిప్తంబులం బోలెఁ బొలుచు చతుర్దంతములతో నాదివ్యవారణప్రతికృతి ధనుశ్శత ప్రమాణ దూరంబున మా కగుపించె.

యౌగం:— హంసకా! అది దివ్యవారణ ప్రతికృతి గాదు మాసంతాపాకృతి యని నుడువుము. తరువాత – తరువాత.

హంస:- తరువాత మహారాజుగారు గుఱ్ఱంబు డిగి దేవతాప్రణామం బొనర్చి వీణఁ గైకొనిరి. అంత నాదివ్యవారణప్రతికృతికి వెనుక గజనిశ్చయంబునం బోలె నొకకంఠీరవంబు గానిపించె.

యౌగం:— సింహమా? తరువాత తరువాత.

హంస:— తరువాత సింహాన్వేషణార్థమై మమ్ము దరిగితిమి. అప్పుడు మహామాత్రప్రధానాయుధీయులతో నిండియున్న యాకృత్రిమ వారణంబు మెల్ల మెల్లగా మహీవల్లభు నెదుర్కొనియె.

యౌగం:— తరువాత – తరువాత.

హంస:— తరువాత మనప్రభువుగారు తనకుఁ దోడుగా వచ్చిన సత్కులప్రసూతు లగుయోధవరుల నామగోత్రపురస్సరముగాఁ బేర్కొని యోదార్చి యిది యంతయుఁ బ్రద్యోతుని కపటప్రయోగము. మీరెల్లరు నన్ను నెంబడింపుఁడు. నే నిప్పుడేయీప్రద్యోతుని విషమం బగుఛలప్రయోగంబు నస్మత్పరాక్రమంబుచే సమం బొనర్తు నని నుడివి వెంటనే పర బలంబుఁ బ్రవేశించిరి.

యౌగం:— పరబలంబును బ్రవేశించెనా? ఏమి చేయును?

గీ. వైరివంచనచే సిగ్గు వడియె, మాని,
సత్వసముపేతుఁ డెంతయు శౌర్యశాలి
ఒకఁడు శత్రుసన్నిధి నుండె; నింక
నరిబలమును దొలఁకఁ జేఁ డేమి సేయు?

తరువాత – తరువాత

హంస – ఆత్మాభిప్రాయానువర్తి యగుసుందరపాటలం బను నా హయరత్నంబుపైఁ గ్రీడించువాఁడుం బోలెఁ దనమనంబున నున్నంతకన్న మిన్నగఁ బరబలంబు నుఱుమాడుచు వైరి బలంబు బహుళం బగుటం జేసి యత్యంతము కాయక్లేశ మందుచు విషణ్ణనష్టసకలపరివారుండై యేకాకి నగునాచే – కాదు కాదు – తనచేతనే తాను రక్షించుకొనఁ బడుచుఁ బగ లంతయు నెడతెగక యాల మొనరించుటం జేసి డస్సి వైరిప్రహారంబులచే హయంబు గూల సూర్యాస్తమయసమయంబున మనరాజుగారు మూర్ఛిల్లిరి.

యౌగం:—ఏమి! మనరాజుగారు మూర్ఛిల్లిరా? తరువాత తరువాత

హంస:—తరువాత సమీపారణ్య ప్రదేశములనుండి యేజాతివారో తెలియని కొన్నికర్కశవర్తుల శక్తికోలంది పెకలించుకొని వచ్చి శరీరబంధనమున సామాన్యమానవునట్లు మహారాజుగారు పరిభవింపఁబడిరి.

యౌగం:—ఏమీ! మహారాజుగారు పరిభవింపఁబడిరా?

సీ. మాంసలాత్యంతోన్నతాంసద్వయం బొప్పి
వ్యాయామ సుదృఢ పర్వములు గల్గి
నాగేంద్రహస్తంబు నగెడునాకృతి గల్గి
తగుదీర్ఘ వర్తులత్వములఁ దనరి
చాపసంస్ఫాలనశస్తహస్తము లొప్పి
వడి వడి శరము లెక్కిడుటఁ దెలిసి
సతతంబు విప్రపూజనశీల మొప్పారి
విహితులఁ గడు గారవించు టెఱిఁగి

గీ. శ్రీమలయమందున నాలింగనములచేతఁ
బొలుచు మావత్సభూపతిభూరిభుజయుగము
గళికిఁ దగిలించి నే మహాకఠినమతులు
కంకణంబుల నిడుకొంట కంటిలను.

హాంసకా ! తరువాత నెప్పటికి మహారాజుగారికిఁ దెలివి వచ్చినది.

హాంస:—ఆర్యా ! ఆపాపాత్ముల పని పూర్తియగునప్పటికి.

యౌగం:—అట్లైని అదృష్టంబుచే మహారాజుగారిశరీరమే పరిభూతమయ్యెఁ గాని తేజంబు గాదు. తరువాత – తరువాత

హాంస:—తరువాత మహారాజుగారికి స్మృతి వచ్చుటఁ బరికించి యప్పాపు లీతఁడే మాయన్నం బన్న మొనరించె, కటకటా! ఈతండే మాతండ్రి నుసుఱులం బాయంజేసె, అక్కటా! ఇతఁడే నాకొడుకుఁ జక్కాడె, అయ్యో ! ఈతఁడే నామిత్రు దుర్గతిపాత్రు నొనర్చె నని వే శోకతీరునఁ బ్రభువుగారి విక్రమంబునే యభివర్ణించుచు నొక్కమాఱుగా మనతేని నెదుర్కొనిరి.

యౌగం:—తరువాత-తరువాత.

హాంస:—తరువాత నాభయం బటులుండ రెండవభయం బొండు తారసిల్లె. ఒండొరుల ప్రోత్సాహంబున వారిలో నొక్కఁడొక యకార్యంబున కొడిగట్టి మనతేని దక్షిణాభిముఖు నొనర్చి కదనవ్యాపారంబునఁ జెదరినతలవెండ్రుకల నిరుపచారంబుగాఁ బ్రోవు చేసి పట్టుకొని కేలం గరవాలంబుఁ దాల్చి దానికిఁ గొంతయుసి యొసంగుటకై వెనుకకుఁ గొంతదవ్వు పరుగెత్తెను.

యౌగం:—హాంసకా ! ఈవృత్తాంతము కొంతసే పాపుము. అంతలో నేను తెప్పిఱిల్లుదును.

హాంస:—తరువాత నానృశంసుఁడు రక్తప్రవాహపంకిలం బగు నమ్మహీతలంబునఁ దనవడిచేతనే కాళ్ళు తడఁబడ జాఱిపడి ప్రతిహతారంభుఁడై తనకత్తియ తనకు మిత్తిగాఁ బ్రాణంబులఁ బాసెను.

యౌగం:—ఈ పాపాత్ముఁడు ప్రాణంబులఁ బాసెనా ? ఆహా !

గీ. పరనృపులచేత నాక్రమింపఁ బడకుండ
ధర్మసాంకర్య మింతమాత్రంబు లేక
పాలితం బయి పుడమి తన్నేలుధరణి
పాలుఁ బాలింపుచుండు నాపదలయందు. ౧౦

హంస:—తరువాత నేలినవారిచేఁ దొలుదొల్తనే బల్లెపుఁబోటున మూర్ఛిల్లిన శాలంకాయనుం డనుమహాసేనామాత్యుఁ డప్పుడే తెలిసి 'వల దీసాహసకార్యంబు వలదీసాహసకార్యం' బని యఱచుచుఁ దత్ప్రదేశంబునకు విచ్చేసె.

యౌగం:—తరువాత – తరువాత.

హంస:—అట్లు విచ్చేసిన పదపడి యయ్యమాత్యుండు మనఱేనికిఁ దత్కాలదుర్లభం బగు ప్రణామంబు గావించి బంధంబులనుండి విడిపించెను.

యౌగం:—మన ప్రభువుగారిని బంధవిముక్తుఁ గావించెనా ? మేలు ! శాలంకాయనా ! మేలు ! దురవస్థ శత్రు నేనియు మిత్రకార్యర బునకుఁ బురికొల్పును గదా. హంసకా ! ఇప్పుడు నాహృదయంబు వ్యసనంబునుండి యించుక యూఱడిల్లినదవలెనున్నది. తరువాత నా సజ్జనుం డేమి చేసెను ?

హంస:—అంత నాప్రద్యోత సచివుండు సాదరంబుగఁ గొన్ని సాంత్వ వచనంబుల నూఱడించి దెబ్బలు గాఢముగఁ దగిలియుండుటచే వాహనంబుపైఁ గూర్చుండఁజాలరని స్కంధశయనంబుపై మనరాజుగారి నుజ్జయినికిం గొనిపోయెను.

యౌగం:—మనఱేని నుజ్జయినికిఁ గొనిపోయెనా ! ఇదియే నుండి నే శంకించుననర్థము.

గీ. అపుడె నాతలపోయునదర్థ మిదియ
[illegible] ప్రద్యోతుఁ [illegible] యుదియ

ధీరచిత్తుండు కాన నీదృశము లైన
కష్టముల నెట్లొ జీవింపఁ గలిగె నేఁడు. ౧౧

ఇటుపై

శా. ఏరీతిం గను మాప్రభుండు మును లెక్కే చేయఁ డాతెని, నిం
కేరీతిన్ వినుఁ దత్కువాక్కులు సువాక్కే యెప్డు విన్వీనులన్
పోరే కల్గమి వ్యర్థ పౌరుష నెటుల్ పూనున్ మదిన్, సమ్రుఁ డౌఁ
గా రుద్ధుం డొకవేళఁ జెందుతను సత్కారంబొ ధిక్కారమో. ౧౨

(ప్రవేశించి)

ప్రతీహారి:—ఆర్యా! రక్షాసూత్ర మిదిగో

యౌగం:—

గీ. అవసరం బేగ భాగ్యహైన్యమున నాయె
వితగమును పార్థితంబు లీప్రతిసరములు
కణము ముగిసినపై హాయ రాజమునకుఁ
జేయునీరాజనోత్సవ చిహ్నము లటు. ౧౩

ప్రతీ:—ఆర్యా! ఇదిగో రక్షాసూత్రము

యౌగం:—విజయా! ఉంచుము.

ప్రతీ:—రాజమాత కేమని విన్నవింపను?

యౌగం:—ఈలా గని.

ప్రతీ:—ఈలా గనఁగా.

యౌగం:—ఇట్లు,

ప్రతీ:—ఆర్యా! సెలవిండు సెలవిండు.

యౌగం:—(ఆత్మగతము) ఈ వృత్తాంతము దాఁచ శక్యముగాదు. రాజమాత కీవార్తఁ దెలియఁ జేసెదను. (ప్రకాశము) విజయా! మనస్సు గట్టిచేసికొనుము. (చెవిలో నేమో చెప్పును).

ప్రతీ:—అయ్యో! అయ్యో!

యౌగం:—నీవు విజయవు కదా. ధైర్యము వహింపుము.

ప్రతీ:—ఇదిగో పోయెదను. మందభాగ్యురాలను గదా!

యౌగం:—రాజమాతతో రాజుగారు బంధితులైరని యొకమాటయు విన్నవింపకు సుమా. స్నేహదుర్బలంబగు మాతృహృదయంబు నెట్లేని రక్షింపవలయు.

ప్రతీ:—అట్లేని ఈ వృత్తాంత మెట్లు విన్నవింప మందురు.

యౌగం:—వినుము.

మ. తొలుదొల్తం బలుసందియంబులకు నుద్బోధంబుగా నెవ్వియో
పలుకం గా వలె యుద్ధదోషముల న్నాపై నామె సందిగ్ధయై
తలపోయం దనపట్టి కయ్యశుభ మాత్మన్ దుఃఖ ముప్పొంగఁ గాఁ
గలరూపంబు తెలంగ నేర్పుమెయి వక్కాణింప నా సత్తలిన్. ౧౪

ప్రతీ:—గ్రహించితిని. (నిష్క్రమించును)

యౌగం:—హంసకా! నీ వపుడు స్వామితోఁ గూడ నేల పోవైతివి?

హంస:—దేవా! నే నప్పుడు మహారాజుగారిని వెంబడించి నాయాత్మను గృతార్థ మొనర్చుకొన నుద్యుక్తుఁడ నైతిని గాని శాలంకాయనుం డీవృత్తాంతమును గౌశాంబీనగరంబునఁ దెలుప నన్నుఁ బంచెను.

యౌగం:—శాలంకాయనుం డిట్లేల చేయును? లాభము లేదను నిరాశతో రాజుగారు పంప మానిన యీవృత్తాంతమును స్వామిప్రీతికై యిటఁ బంపఁ దలంచెనా? లేక అనురక్తుండగు భటుండు రాజుకడ నుండుట యపాయ మని నిన్నుఁ బరిహరించుటకుఁ గా నిట్లు పన్నియుండునా?

హంస:—అవును. నన్ను బరిహరించుటకే యట్లు పన్నియుండును.

యౌగం:—లేక — ఆశాలంకాయనుండు గర్వంబుచేఁ దనబుద్ధిసామర్థ్యమును గౌశాంబీజనులకుఁ జాట నెంచెనా? అదియుఁ గాదేని తనయుద్యమంబు ఫలించెనని యిట్లానందించు చున్నాఁడా? కానిమ్ము. హంసకా! నన్నుగూర్చి మహారాజుగా రేమియుఁ జెప్పియుండ లేదా?

హంస:—ఆర్యా! చెప్పియుంత కేమి? శాలంకాయనుం డట్లు కౌశాంబి కేగి యీ వృత్తాంత మెఱింగింపు మని నన్నుఁ బంపిన పదపడి నేను ప్రయాణము కాఁబోవుచు నేలినవారికిఁ బ్రదక్షిణంబు గావింప నంతర్బాష్పాకలితలోచనంబులతో నాతో నేదియో యెక్కువగాఁ జెప్పనుంకించియు స్తంభితకంఠు లగుటచే మాట రాక కాఁబోలు మహారాజుగారు హంసకా! హామ్మ. యౌగంధ (సగమనియాఁపును.)

యౌగం:—హంసకా! నన్నుఁ బేరితో బిలుచుచుంటి నని సంశయింపకుము. నిశ్శంకముగాఁ జెప్పుము. ఇయ్యది స్వామివాక్యము గదా.

హంస:—యౌగంధరాయణుఁ జూడుమనిరి.

యౌగం:—ఉండుము. ఏ మనిరి? తక్కినమంత్రి మండలము నెల్ల నటుంచి యౌగంధరాయణునే చూడు మనిరా?

హంస:—దేవా! చిత్తము.

యౌగం:—ఇట్టియిక్కట్టు కలుగక మున్నే తగుప్రతీకారము గావింపఁ జాలని యీయదూరదర్శిని — నిరర్థకముగా నింత కాలమునుండి రాజాన్న మారగించు నీనిరర్థకజీవనుని — నిరుపయోగంబుగా నిన్నినాళ్ళనుండి రాచమన్ననల నందుచున్న యీవ్యర్థుని — నన్నుఁ జూడవలయు నని రాజుగారు తలంచిరా?

హంస:—చిత్తము.

యౌగం:—అట్లని మాఱురూపంబుతోడి నన్ను స్వామి చూడఁ గలఁడు.

చ. అరినగరంబునందో చెఱయందో యరణ్యమునందో లేక దు
ర్భరతర వేదనం దనువుఁ బాసినచోఁ బరలోకమందునో
కరము జయంబుఁ గొంటి నని గర్వితు నానృపు మోసగించుచో
స్థిరనిజరాజ్యవైభవముఁ జేకొని శ్లాఘ్యుతఁ బార్శ్వమందునో ౧౫

(తెరలో)

హా! ప్రాణేశ్వరా! హా! ప్రాణేశ్వరా!

యౌగం:—

క. శోకమున కిదిగో స్త్రీలు ప్ర
తీకార మెఱఁగరు కట్లు దీనికె కాదీ
శోకం బగుఁ బో మంత్రుల
ప్రాకట సామర్థ్య హైన్య వర్ణనముల్. (11)

(ప్రవేశించి)

ప్రతీహారి:—ఆర్యా! రాజమాతగారు

యౌగం:—ఏమి? ఏమి?

ప్రతీ:—ఇట్లుమనవిచేయుచున్నది.

యౌగం:—ఎట్లు?

ప్రతీ:—సుహృజ్జనపరిగృహీతుం డగు నా వత్సరాజువృత్తాంత మి ట్లాయెఁ గదా ఇప్పుడు వైరనిర్యాతనంబుకన్నఁ గర్తవ్య మొండేమి యుండును. సుహృజ్జనంబుతో సంప్రతించి నిర్ధారింపఁ దగును. ఎవ్వఁడు మహాసంకటంబులనైతము కటకటం బడఁడో, ఎవ్వఁడు విషమగతుం డయ్యు వెన్నుదీయఁడో, ఎవ్వఁడు వంచితుం డయ్యు నిర్విణ్ణుఁడు గాఁడో, ఎవఁడు ప్రతీఘాతంబులనైతము ప్రాణంబులఁ బాయఁడో యట్టిబుద్ధిమంతుని గదా యడుగుచుంటిని. తొలుదొల్త మత్కుమారునకు వయస్యుండవును బదపడి యమాత్యుండవునగు పుత్రకా! మత్పుత్రకుఁ గొనిరమ్ము అని.

యౌగం:—ఆహా! ఈపూజ్యురాలు రాజకులోచితంబుగా గంభీర ముగఁ బల్కినది. ఈయమ సంభావనను బహూకరింతును. విజయా! నీరముఁ గొని రమ్ము.

ప్రతీ:—అయ్యా! చిత్తము. (నిష్క్రమించి మరలఁ బ్రవేశించి) ఇదిగో నీరము.

యౌగం:— తెమ్ము. (ఆచమించి) విజయా! పూజ్యురాలగు రాజమాత యేమి చెప్పెను ?

ప్రతీ:— పుత్రకా! మత్పుత్రకుఁ గానిరమ్ము – అని

యౌగం:— హంసకా! ప్రభువుగారే మనిరి ?

హంస:— యౌగంధరాయణుఁ జూడుము – అని.

యౌగం:— విజయా!

గీ. రాహుసంగ్రస్తుఁడౌ ద్విజరాజుఁ బోలె
వైరిసంగ్రస్తుఁ డైనయావత్సరాజు
విడిచి పెట్టింప లే నేని బిలువ వలదు
నన్ను యౌగంధరాయణుఁ డన్న పేర. ౧౨

(ప్రవేశించి)

నిర్మండకుఁడు:— ఆర్యా! ఒకయద్భుతకృత్యము జరిగినది: మహారాజుగారి దుర్దైవశాంతినిమిత్తము జరుగుసంతర్పణమున భోజన మొనర్చు బ్రాహ్మణజనంబుఁ జూచి యున్మత్తవేషధారి యగునొకద్విజుండు పెద్దగానవ్వి – 'తినుండు తినుండు మీ యిష్టము వచ్చినట్లు తినుండు. దీన నీ రాజకులంబున కభ్యుదయమే లెం' డని యంతలోనే యంతర్హితుం డాయెను.

యౌగం:— నిజముగా ?

(తరువాత బ్రాహ్మణుఁడు ప్రవేశించును)

బ్రాహ్మణుఁడు:— ఇవిగో యున్మత్తవేషధారి యగునాబ్రాహ్మణుఁ డుపయోగించుకొని పనితీరుపై వదలిపెట్టి పోయినదుస్తులు, ఈదుస్తుల ధరించి భగవానుం డగుద్వైపాయనుండు వచ్చియున్నాఁడు.

యౌగం:— ఎట్లు! ద్వైపాయనుండు వచ్చియున్నాఁడా ?

బ్రాహ్మ:— ఔను.

యౌగం:—అల్లేని ఆమహామహుని జూచెదను.

బ్రాహ్మ:—చూడుఁడు.

యౌగం:—ఏమిది రూపాంతరమువలెఁ గన్పట్టుచున్నది. అహా! నాకిప్పుడు స్వామిసన్నిధి కరిగినట్లే యున్నది. ఈయుపకరణంబుల ధరించి రిపునగరంబున నిర్భయంబుగా సంచరింపు మని యుపదేశింపనే కాఁబోలు భగవానుండగు బాదరాయణుఁ డీదుస్తుల నాకుఁ బ్రసాదించినాఁడు.

గీ. మదుపదేశంబు కొలఁకె యున్మత్తవేష
మూని యేతెంచె నిప్పు డీమానివరుఁడు
రాజు విడిపింపఁ గలఁ డరిరాజ్యమందుఁ
గాన రాకుండ నడిపింపఁ గలఁడు నన్ను. ౧౮

(ప్రవేశించి)

ప్రతీహారి:—ఆర్యా! రాజమాతగారు "పుత్రకు నొక్కమాఱుచూడఁ గోరెద" నని పలుకుచున్నారు.

యౌగం:—ఇదిగో వచ్చుచున్నాను. ఆర్యా! శాంతిగృహమున నాకై వేచియుండుము.

బ్రాహ్మ:—చిత్తము. (నిష్క్రమించును)

యౌగం:—హంసకా! నీవు విశ్రమింపుము.

హంస:—చిత్తము. (నిష్క్రమించును)

యౌగం:—విజయా! ముందు నడువుము.

ప్రతీ:—చిత్తము. (ముందునడుచును)

యౌగం:—ఆహా!

గీ. రాయుచోఁ గట్టెనుండియు రాలు నిప్పు
త్రవ్వుచో నీ రొసంగును ధరణి యేని
కా దసాధ్య ముత్సాహుల కేది కూడఁ
దటి నొనర్ప ఫలించు యత్నంబు లెల్ల. ౧౯

(అందఱు నిష్క్రమింతురు)

ఇది ప్రథమాంకము

శ్రీ హయగ్రీవాయ నమః

ప్రతిజ్ఞాయౌగంధరాయణము

ద్వితీయాంకము

(తరువాతఁ గాంచుకీయుఁడు ప్రవేశించును)

కాంచుకీయుఁడు:— ఆభీరకా! ఆభీరకా! నీవు పోయి మహాసేన మహారాజుగారి మాటగాఁ బ్రతీహారరక్షకునితో నిట్లు చెప్పుము. వీరు కాశీరాజుగారి యుపాధ్యాయులు. జైవంతి నామధేయులు. దూతకృత్యంబుమీఁద నిట కేఁగుదెంచిరి. ఇమ్మహాత్మునకు సామాన్యదూతలకుం బలెఁ గాక విశేష సత్కార మొనర్చి మంచిబస చూపించుటయే గాక యీ యతిథి యాతిథేయసత్కారంబుల లెస్సగాఁ బడసితినని యనుకొనులాగొనర్పఁ బ్రయత్నించునది. — అని —

ఆహా! ఈలాగునఁ బ్రతిదినమును గోత్రానుకూలంబు లగు రాజకులంబులనుండి దూత లేఁగుదెంచుచున్నారు. కాని మహాసేనమహారాజుగా రెవ్వరిని నిరాకరింపరు. ఎవ్వరిని స్వీకరింపరు. ఇది యేమిటో? ఏమి యున్నది. కన్యాదాన
(13) విషయంబున దైవమే సమర్థంబు. ఏలయన.

చ. ఎవనికి భార్య కాఁగలదో యీ మనవాసవదత్త యట్టిభూ
ధవుకడనుండి దూత నృపుదండకు రాఁడవు; లేనిచో మహీ
ధవుఁ డిటు దూతలన్ నృపకదంబము పంప వరప్రతీక్షుఁడ
య్యు వరగుణంబులన్ దెలిసియున్ వరు నేటికి నిశ్చయింపఁడో? ౨౦

ఓహో! ఇం దంతఃపురపరిచారవర్గ మందంద యొదిఁగి కొనుటం జేసి మహారాజుగా రీప్రదేశంబున కరుదెంచుచున్న ట్లున్నది. ఇదిగో. మహాసేనమహారాజుగారు ఈమహానుభావుఁడు.

గీ. నిబిడ దూర్వాంకుర స్నిగ్ధ నీలమణి వి
భాసిపీతాంగదోన్నత బాహుశిఖరుఁ
డీకనకతాళవనినుండి యేగుదెంచు
శరవణమునుండి వెడలు విశాఖు నట్లు.

(నిష్క్రమించును)

విష్కంభము.

(తరువాత రాజును బరివారమును ప్రవేశించును.)

రాజు:—
చ. మహిపతులెల్ల భృత్యులటు మార్గమునందున మత్తురంగము
ప్రహితపరాగముల్ మకుటభాగములంట ధరింతురి గాని యా
మహిమము నాకు మోద మణుమాత్రముఁ గూర్పదు వాగవిజ్ఞతా
మహితుఁడు వత్సరాజు గుణమాన్యుడు నన్ బ్రణమిల్ల కుండుటన్.

బాదరాయణా !

(ప్రవేశించి)

కాంచుకీయుఁడు:—మహాసేనులవారికి విజయ మగుఁ గాక.

రాజు:—జైవంతికి బస నేర్పాటు చేసితివా ?

కాంచు:—బస నేర్పాటు చేసితిమి. తగినట్లు సత్కరించితిమి.

రాజు:—మంచిపని చేసితివి. నీవు రాజవంశ్యగుణాభిలాషివి. వచ్చినపెద్దల మర్యాద చేయుటయే మంచిది. ఇట్లు మాతల వంపిన రాజులలో నెవ్వరు కన్యాప్రదానమున కర్హు లని. యెవరి నడిగినను వార లొండొరులయభిప్రాయంబునకో నాయభిప్రాయంబునకో నిరీక్షించు చుందురే కాని తమయభిప్రాయంబుల నొక్కరును వెల్లడింపరు. (కాంచుకీయునివైపు చూచి) నీవేమో చెప్పఁ దలఁచువానివలెఁ గాన్పింతువు.

కాంచు:—మఱేమియు లేదు. కన్యాప్రదానంబును గూర్చి యడుగ వలెనని యనుకొనుచున్నారు.

రాజు:—సంకోచింపకుము. సంకోచింపకుము. ఈకన్యాప్రదానవిధి సర్వసామాన్యము కదా. నీవు చెప్పఁ దలఁచిన దేదియో నిశ్శంకముగాఁ జెప్పుము.

కాంచు:—మహాసేనమహారాజా! నా చెప్పఁదలఁచినది మ తేమియు లేదు. ఇదియే. ఇట్లు ప్రత్యహంబును గోత్రానుకూలంబు లగురాజకులంబులనుండి దూత లేతెంచుచున్నను మహారాజుగా రొక్కరిని నిరాకరింపరు. ఒక్కరిని స్వీకరింపరు. ఇది యేమిటి? అని.

రాజు:—బాదరాయణా! ఇది వాస్తవమే. వరగుణంబులయం దతి లోభంబునను వాసవదత్తయం దతివాత్సల్యమునను వర నిశ్చయ మొనర్పఁ జాల కున్నాను. నేను వరునియందు

మొదలన్ సత్కుల మెంతు వాపయి దయన్ ముఖ్యంబుగా నెన్నెదన్
మృదు వయ్యున్ దయ సారవత్సుగుణ మామీఁదన్ సురూపంబు నా
పిదపన్ గాంతిని, వీని నెన్న గుణలుబ్ధిన్, స్త్రీజనార్థంబె; యా
పిదపన్ వీర్యము నెంతు లేక యది పృథ్విన్ స్త్రీల నె టోమ నా. 23

[illegible]

కాంచు:—దేవరవారియందుఁ దప్ప నిప్పుడీసద్గుణంబు లెల్ల! నెక్కడ నేని ఒక్కనియందుఁ గాన వచ్చునా?

రాజు:—అందులకే గదా యింతగా విచారించుట.

గీ. తఱచుగాఁ దండ్రి చేయుయత్నంబుచేతఁ
గన్యకకు సద్గుణుం డైనకాంతుఁ డబ్బు;
తక్కువై భవములమాట దానిదాని
ప్రాక్కృతం బగుసుకృతంబుఁ బట్టి యుండు. 24

[illegible]
కన్యాప్రదానకాలంబునఁ దల్లులు దుఃఖశీల లగుదురు. కాన దేవిని గూడఁ బిలుచుకొని రమ్ము.

కాంచు:—మహాసేనుల సెలవు (నిష్క్రమించును)

రాజు:—అదేమో కాశీరాజు దూతను బంపినాఁ డని వినఁగానే వత్సరాజును బట్టికొన నాచేఁ బంపఁబడిన శాలంకాయనుని మీఁదికి నాబుద్ధి పోవు చున్నది. ఏ మయియుండును. ఇంత దనుక నా బ్రాహ్మణుఁ డావృత్తాంత మేమియుఁ బంపకున్నాఁడు.

గీ. ఏనుఁగులనేఁట యాతని కెపుడు నాట
ఆతనిహృదయంబు సంతతం బంద యుండు;
కాని తన్నంతయు కెల్లరుఁ గా ద టంచు
మెండు గా యత్న మొనరించి యుండ వలయు. ౧౫

(తరువాత సపరివారయై దేవి ప్రవేశించును)

దేవి:—మహాసేనులకు జయ మగుఁ గాక.

రాజు:—దేవీ! కూర్చుండుము.

దేవి:—చిత్తము [కూర్చుండును]

రాజు:—వాసవదత్త యెక్కడ?

దేవి:—ఉత్తర యనువైతాళికయొద్ద మహతీవీణాభ్యాసంబునకై పోయి యున్నది.

రాజు:—ఏమీ! వాసవదత్తకు గాంధర్వమున నభిలాష జనించినదా?

దేవి:—ఏదే నొక్కపని యుండుట మంచి దని తనచెలియగు కాంచనమాల వీణ నేర్చుకొనుటఁ జూచి తాను గూడ వీణ నేర్చుకొనఁ దలఁచినది.

రాజు:—ఇది బాల్యంబున కుచితమే గదా.

దేవి:—దేవరవారితో నే నొకటి విన్నవింపఁ దలఁచుకొన్నాను.

రాజు:—ఏ మని?

దేవి:—వీణ నేర్ప నొకయాచార్యుఁడు కావలయు నని.

రాజు:—సన్నిహితవివాహకాల యగువాసవదత్తకు వేఱేయాచార్యుఁ డేల? భరతయే వీణ నేర్పును లెమ్ము.

దేవి:—ఆఁ ! అప్పుడే నాబిడ్డకుఁ బెండ్లియీడా ?

రాజు:—దేవీ ! పుత్రికను ప్రతిదినము ననురూపవరునకు నొసంగు మని మమ్ముపరోధించుచు నిప్పు డిట్లు పరితపించెద వేల ?

దేవి:—కన్యాప్రదానము నాకభిమతమే గాని పుత్రీవియోగము మాత్రము నన్ను సంతాపపెట్టుచున్నది. అట్లైన ఎవరి కొసంగితిరి.

రాజు:—ఇంకను నిశ్చయము లేదు.

దేవి:—అమ్మాయికి వివాహవయస్సు వచ్చినను నిశ్చయమే లేదా ?

రాజు:—

గీ. ఈయ లే దన్నచో సిగ్గ దేఁగుదెంచు
ఇచ్చితి మటన్నచోఁ జింత హెచ్చు మదికి
ధర్మమునకుఁ బ్రేమకును మధ్యమున నుండి
కూఁతులం గన్నతల్లులు కుందుదు రెట.

ఇప్పు డన్ని విధంబుల మనవాసవదత్త యుత్తమామలకుఁ బరిచర్య సేయఁ దగినయీడులో నున్నది. అదియుం గాక కాశీరాజోపాధ్యాయుం డగునార్యజైవంతి దూతగాఁ జను దెంచి తదీయచారిత్రంబుచే న న్నెంతయు లోభపెట్టు చున్నాఁడు. (తనలో) దేవి ఏమియు బదులు చెప్పదు. కన్నీరు గార్చుచుఁ గలఁతఁ జెంది యున్నది. వరనిశ్చయ మేమి చేయఁగలదు. కానిమ్ము. ఈయమకు నాయభిప్రాయ మెఱిఁగింతును.

(ప్రకాశము)

అస్మదీయసంబంధాభిలాషులై రాజులు వచ్చినట్లు దూతల వలన వినుచున్నాము.

దేవి!—ఇది యంతయు నిప్పు డేటికి ? ఎవరి కొసంగినచో సంతాప మొందమో యట్టివారి కొసంగుఁడు.

రాజు:—ఆహా! ఎంతసులభముగాఁ బల్కితివి. తరువాత నేమైన మూఁడినచో నన్నుపాలంభించుట కాదా? వినుము.

గీ. వచ్చిరి మదీయసంబంధవాంఛఁ గాశి
రాజు, మైథిల, మగధ, సౌరాష్ట్రనృపులు
వంగపతి, శూరసేనుండు, వరగుణాఢ్యు
లిం దెవఁడు పాత్రుఁడో, పుత్రి నీయఁ జెపుము. ౨౩

(ప్రవేశించి)

కాంచుకీయుఁడు:—వత్సరాజు.

రాజు:—వత్సరాజా?

కాంచు:—మహాసేనమహారాజా! అనుగ్రహింపుము. అనుగ్రహింపుము. ప్రియవచననివేదనత్వరచే సముదాచారంబు పాటింప మఱచితిని

(నేలపైఁ బడును)

రాజు:—ఏమీ! ప్రియవచనమా?

దేవి:—[లేచి] ఆర్యపుత్రా! జయము. (అని పోఁబోవును)

రాజు:—(హర్షముతో) దేవీ! ప్రియవచనాకర్ణనమునకు నీవు పరిహార్యురాలవు గావు. కూర్చుండుము.

దేవి:—ఆర్యపుత్రుని సెలవు. [కూర్చుండును]

రాజు:—బాదరాయణా! లెమ్ము. లెమ్ము. సంకోచింపక చెప్పుము.

కాంచు:—(లేచి) పూజ్యు లగుమనశాలంకాయనామాత్యులు వత్సరాజును బట్టుకొనిరి.

రాజు:—(హర్షముతో) ఏ మంటివి?

కాంచు:—పూజ్యు లగుమనశాలంకాయనామాత్యులు వత్సరాజును బట్టుకొనిరి.

రాజు:—ఉదయనునా?

కాంచు:—అవును.

రాజు:—శతానీకుని పుత్రుని ?

కాంచు:—నిజముగా.

రాజు:—సహస్రానీకుని మనుమని ?

కాంచు:—అతనినే.

రాజు:—కౌశాంబీపురాధీశుని ?

కాంచు:—స్పష్టముగా నాతనినే.

రాజు:—గాంధర్వవిద్యాధనుని ?

కాంచు:—అతని నట్లే చెప్పుదురు.

రాజు:—వత్సరాజునే గదా ?

కాంచు:—చిత్తము. వత్సరాజునే.

రాజు:—అట్లని యౌగంధరాయణుఁడు కాలధర్మ మొందెనా ?

కాంచు:—లేదు. కౌశాంబీనగరమున నున్నాఁడు.

రాజు:—అట్లని వత్సరాజును బట్టుకొన లేదు.

కాంచు:—మహారాజ ! నామాట నమ్మఁడు.

రాజు:—

ఉ. నమ్మఁగఁ జాల నే నుదయనగ్రహణంబును జేయుఁ జెప్ప హ
స్తమ్ముల మందరాచలము దర్పసమగ్రతఁ ద్రిప్పినట్లు; యు
ద్ధమ్ముల వైరు లాన్నృపు నుదగ్రపరాక్రము ముగడింత్రు క
ర్ణమ్ములఁ దోచ్చుఁ దత్సచివరత్నము మంత్రమహాప్రభావముల్. ౨౮

కాంచు:—మహారాజా ! అనుగ్రహింపుము. వృద్ధుండ నదియుంగాక బ్రాహ్మణుండ. ఏలినవారియెదుట నెన్నఁడును దబ్బఱ లాడి యుండ లేదు.

రాజు:—ఆఁ. అవును నీవిదివఱ కెన్నఁడును దబ్బఱలాడ లేదు. అట్లని శాలంకాయనుం డేపియదూత నిట కంపెను ?

కాంచు:—దూత నెవ్వనిఁ బంప లేదు. జవాతిశయంబు గలఖురరథం బుపై ముందుభాగమున వత్సరాజుం గూర్చుండఁ బెట్టుకొని శాలంకాయనామాత్యుండు తానే వచ్చెను.

రాజు:—అలాగా? అహో! అట్లైని ఇంక మనసైనికు లెల్లరుఁ గతశ్రమం బుల విచ్చిసుఖంబుగా విశ్రమింప వచ్చును. నేఁడు మొదలుకొని సామంతరాజు లేతద్భయంబు లేమిం జేసి నాకడకుఁ బ్రిచ్ఛన్న ముగా దూతల నంపుట మాని నిర్భయంబుగా నుండవచ్చును. వేయేల నేఁడు గదా నేను మహాసేనుండ నైతి. (18)

దేవి:—ఏమీ అమాత్యుండు కొనివచ్చెనా?

రాజు:—కొనివచ్చెను.

దేవి:—ఇతనికొఱకే గదా మనవాసవదత్త నేరికి నొసఁగఁ దలంప కున్నాము.

రాజు:—ఈతండు నాకు యుద్ధమున గెలుచుకొన్న శత్రువేయైనను గుణసంపన్నుఁబట్టి పట్టి నీతనికే యీయఁ దలంచితిని. బాదరాయణా! శాలంకాయనుం డెక్కడ?

కాంచు:—భద్రద్వారమున విడిసి యున్నాఁడు.

రాజు:—పొమ్ము. యువరాజోచితగౌరవంబుతో వత్సరాజు ప్రధానం బుగా నమాత్యుని ప్రవేశపెట్టు మని ముఖ్యామాత్యుఁ డగు భరతరోహకునితోఁ జెప్పుము.

కాంచు:—ఏలినవారిసెలవు. (పోవును)

రాజు:—బాదరాయణా! ఇటు రమ్ము.

కాంచు:—ఏమి సెలవు?

రాజు:—వత్సరాజును జూడ వచ్చుపౌరుల నెవ్వరిని వారింప వలదు.

క. ఇతనిన్ మద్రిపు శౌర్య
శ్రుతపూర్వున్ బౌరజనము చూచుం గాతన్
క్రతు సంయుతంబు నంతః
స్థితరోషము సైనికాదమసింగముఁ బోలెన్.

కాంచు:—చిత్రము. అక్క. (నిష్క్రమించును)

దేవి:—ఈ రాజకులంబునఁ బెక్కు లభ్యుదయంబు లనుభూతంబు లయ్యెం గాని యార్యపుత్రున కింతటి ప్రీతిభాజనం బొండేదియుం గాదని తలంతును.

రాజు:—నేనును వత్సరాజగ్రహణసదృశం బగుప్రియవార్త నిదివఱకు విన్నట్లు నేఁ దలంపను.

దేవి:—వత్సరాజా?

రాజు:—అవును.

దేవి:—పెక్కు రాజకులంబులు మనసంబంధముం గోరి వచ్చియున్నట్లు విని యున్నాను గాని యీతం డొకమాత నేనియు నిదివఱకుఁ బంపి యుండ లేదు.

రాజు:—మహాసేనుండను వాని నేనియు నన్నితఁడు లెక్క సేయఁడు. ఇంక మనసంబంధమును గోరునా?

దేవి:—లెక్క సేయఁడా? అక్క బాలుఁడా? లేక మూర్ఖుఁడా?

రాజు:—మూర్ఖుఁడు కాఁడు - బాలుఁడే.

దేవి:—అతని నేది యింత గర్వింపఁ జేయుచున్నది?

రాజు:—ఏదియా? వినుము. సుప్రసిద్ధరాజర్షి విరాజితంబును వేదాక్షరసమ్మిళిత మహాభారత ప్రతిపాద్యము నగుభరతవంశ మీతని నింత గర్వింపఁ జేయు చున్నది. వంశపరంపరాయాత మగు గాంధర్వవేద మీతని కింత కావరము గలిగించుచున్నది. వయోఽనురూపం బగురూప మీతని నింతగా విభ్రమింపఁ జేయు చున్నది. ఎట్లో యేర్పడినపౌరానురాగ మీతని నింత విస్రంభపాత్రుఁ గాఁ జేయుచున్నది.

దేవి:—అక్క అభిలషణీయగుణంబులు గదా యీవరగుణంబులు. ఈతం డేగుణంబుచే దోషి యయ్యె?

రాజు:—దేవీ! ఏమీ! ఆశ్చర్యము లేనిచోట నాశ్చర్యపడెదవు. చూడుము.

గీ. గడిపాదలో నిడినయగ్ని గతి నిరంకు
శంబుగా ధాత్రి నంతట సంచరించి
శాసనం బస్మదీయ మజ్జ్వలిత మయ్యు
సమసిపోయెడు నితనిరాజ్యంబునందు. ౩౦

(ప్రవేశించి)

కాంచు:— ఏలినవారికి జయ మగుఁ గాక. దేవరివారి యానతిచొప్పున యువరాజసత్కారముతో శాలంకాయనామాత్యులు నగరంబుఁ బ్రవేశించి యేలినవారితో నిట్లు మనవి చేయుచున్నారు. ఇదిగో భరతకులోపభుక్తంబును వత్సరాజసంక్రాంతంబు నగు ఘోషవతి యనుదర్శనీయం బగువీణారత్నంబు. మహాసేను లిద్దాని స్వీకరింప వలయును — అని — (వీణను జూపును)

రాజు:— జయచిహ్నముగ దీనిఁ బరిగ్రహించితిని. (వీణను గొని) ఆఘోషవతి యియ్యదియే కాఁబోలు. ఇది

గీ. శ్రవణసౌఖ్యద మధుర నిసర్గరక్త
నఖశిఖరఘృష్టతంత్రీసునాద మైన
వీణ ఋషివాక్యగతమంత్రనిద్యలోలెఁ
గైవసముఁ జేసికొను బన్నఁగకులమనను. ౩౧

ఎందేనియు సమరసముపార్జితంబు లగురత్నంబు లిప్పాను భవంబుచేఁ బ్రీతిజనకంబులగు. ఇవ్వీణయే నాకొమరుల కొసంగుదు మన్న —

గీ. అస్త్రశాస్త్రగుణాభిజ్ఞఁ డంతె నాదు
బాలకుఁడు జ్యేష్ఠుఁ డైనగోపాలకుండు;
బాలకుఁడు ద్వితీయుం డనుపాలకుండు
హారిగాంధర్వమాషి, వ్యాయామతోషి. ౩౨

ఎవ్వరి కొసంగిన నిదిసార్థకం బగు? దేవీ! వాసవదత్త వీణ నభ్యసించు చున్నది గదా!

దేవి:— అభ్యసించు చున్నది.

రాజు:— అట్లని ఈవీణను మనవాసవదత్త కిమ్ము.

దేవి:—ఇప్పుడే వాసవదత్త వీణియమాట యెత్తిన నున్మత్తురాలగు చున్నది. ఈవీణ యొసంగితిమేని మఱింత యున్మత్తురాలగును.

రాజు:—ఆడుకొన నిమ్ము - ఆడుకొన నిమ్ము - అత్తగారింట నిట్టివి సులభంబులు గావు గదా. బాదరాయణా! వాసవదత్త యెక్కడ?

కాంచు:—అమాత్యునియొద్దఁ గూర్చుండి యున్నది.

రాజు:—వత్సరా జెక్కడ నున్నాఁడు?

కాంచు:—కాళ్ళకు సంకెలలు తగిలించుటచేతను కాయంబునఁ బలు గాయంబులచేతను డోలికమీఁద మధ్యమగృహంబునఁ బ్రవేశ పెట్టఁ బడియున్నాఁడు.

రాజు:—ఛీ! ఎంతకష్టము. కాయంబునఁ బలుగాయంబులా? ఇయ్యది యస్థానప్రయుక్తపరాక్రమదోషము. అన్యముగాదు. మహాఘాతుకుఁడు గదా యిట్టిపట్ల నుపేక్షించువాఁడు. బాదరాయణా! నీవు పోయి భరతరోహకునితో వత్సరాజునకు వ్రణచికిత్సఁ గావింపు మని చెప్పుము.

కాంచు:—ఏలినవారి సెలవు.

రాజు:—ఇదిగో యిటు రమ్ము.

కాంచు:—ఇదిగో వచ్చితిని.

రాజు:—ఆతని కెందుఁ గోర్కెయో యెఱింగి సబహుమానముగా దానిని దీర్చునది. ఆకారమును బట్టియే యాతని ప్రీతివిషయంబుల నారయ వలయు. అతిక్రాంతసమర ప్రస్తావనల నాతని ముందు తే రాదు. క్షతాదులపట్ల వృద్ధసముదాచారంబుగా మంగళాశీర్వాదము గావింపవలయును. కాలానుగుణము లగు కైవారంబులచే మర్యాద చూపు చుండ వలయును.

కాంచు:—చిత్తము [నిష్క్రమించి మరలఁ బ్రవేశించి] మహాసేన మహారాజా! జయము. వత్సరాజునకు దారియందే వ్రణ

చికిత్స గావింపఁ బడెను. రెండవసారి చికిత్సకు నింకను వేళ కాలేదు. ఇప్పుడు సూర్యుఁడు నడిమింటనే యున్నాఁడు.

రాజు:—ఆవీరమాని యిప్పు డెచ్చట నున్నాఁడు ?

కాంచు:—మయూరయష్టిసౌధముముఖభాగమున నున్నాఁడు.

రాజు:—అయ్యో ! కష్టము. ఈప్రదేశము వాసయోగ్యము కాదు. ఎండ తగులకుండుటకై మణిభూమికయందుఁ బ్రవేశపెట్టు మని చెప్పుము.

కాంచు:—చిత్తము [నిష్క్రమించి తిరిగి ప్రవేశించి] ఏలినవారిసెలవు ప్రకార మంతయు నొనర్చితిని.

శ్రీ భరత రోహకామాత్యులు దేవరవారిని సందర్శింపఁ గోరుచున్నారు.

రాజు:—ఓహో ! అలాగా ? వత్సరాజు నిట్లు సత్కరించుట యాతని కెంతమాత్రము నిష్టములేదు. వత్సరాజ పరిగ్రహణ వైత దీయ నీతిపరిశ్రమ ఫలితమేకాన నీతని మన్నింప వలయును. నేనే యాతని నొప్పింతును.

దేవి:—సంబంధము నిశ్చయించితిరా యేమి ?

రాజు:—ఇంతవఱకు నిశ్చయింపలేదు.

దేవి:—అప్పుడే తొందరలేదు. ఇంకను మనవాసవదత్తబాలికయేగదా.

రాజు:—నీయిష్టప్రకారమే కానిమ్ము. నీ వంతిపురమున కరుగుము.

దేవి:—చిత్తము. [సపరివారయై నిష్క్రమించును]

రాజు:—(ఆలోచించి)

చ. ఉదయనుతోడివైర మితఁ డుకత్తుఁ డౌ నని యయ్యెఁ దొల్లి యా
పదపడి పట్టి తే నితనిపట్టున మాధ్యమవృత్తి నుంటిఁ బో
కదనమునం దితండు బలుగాయములం దినె, నుండె దుస్థితిన్
బ్రదుకునొ ? లేదొ ? యంచు వినవచ్చుటఁ జిత్తము తత్తఱించెడిన్.

[ఇరువురు నిష్క్రమింతురు]

ఇది ద్వితీయాంకము

శ్రీ హయగ్రీవాయ నమః

ప్రతిజ్ఞాయౌగంధరాయణము

తృతీయాంకము

(సిదప వెట్టివానివేషముతో విదూషకుఁడు ప్రవేశించును)

విదూషకుఁడు:— [పరికించి] ఏమీ యీమాయ. ఈ దేవకులికయందు నామోదకమల్లిక నుంచుకొని దక్షిణామూషకంబుల లెక్కపెట్టి మూట గట్టుకొని మరల వచ్చి చూతును గదా నామోదకమల్లిక మిందుం గానరాకున్నది. [ఆలోచించి] ఆఁ — ఏమిది ఈ యవలక్షుండు కాఁజేసె నందుమా? ఈతఁ డొక్క మోదకంబుతోనే తృప్తిం జెంది నావెంట నైనను రాఁడు. కుక్క లేమైన వచ్చి నోటఁ గఱచుకొని పోయె నందుమా? ప్రాకారమ్మెంతయు నున్నతంబు గాన వాని కిట మసలుట కేనియు నవకాశము లేదు. లేనిచోఁ బథికు లేమైనఁ జాపలంబునఁ గొనిపోయి రనుకొన్న నదియును బొసగదు. వారక్షతభక్తులు గాన ఈమోదకము నభిలషించరు. కానిచో నొకవేళ నేనే నోటఁ బెట్టికొంటి నేమో? ఇది యెట్లు తెలియును. కానిమ్ము ఆఁ — తెలిసినది. ఒక్కపనిచేసి చూచెదను. ఇప్పు డొకమాఱు త్రేంచి దానిగంధముచే నీమోదకంబును నేనే తింటినేమో తెలిసికొందును గాక. హీ హీ — పూరింపఁబడిన వరాహవస్తివలె నుత్తగాలినే విడుచుచున్నాను. అట్లేని దీని నెవరు తీసికొని యుందురు. లేక యీ శివుఁడే నా లోహితకాత్యాయనికడ నున్నది నాదేయని తలంచి తానే యొకవేళఁ దీసికొని యుండునా? (నిరూపించి) కాదు — కాదు — ఈ బ్రహ్మచారి గాఁడుత్తవేషధారిగా నున్నాఁడు. మోదకంబుపై నాసచే దుండగ మేమైనఁ జేసి యుండునేమో. కానిమ్ము మఱల వెదకెదను. ఓహో! ఎంత పొరపాటు. ఒడిలోనే యుంచుకొని యూరెల్ల వెదకుచున్నాను. ఇదిగో నామోదకమల్లిక మీశ్వ

రని కాళ్ల ముంగలనే యున్నది. వేగిర మేఁగి చేకొందును. స్వామీ! నా మోదకమల్లకమిమ్ము. మోదకమల్లకమిమ్ము. స్వామీ! నీవుగూడ దొంగపనిఁ జేయుదువా? అయ్యో! ఎంతమోసపోతిని. ఇయ్యది గోడమీఁదిచిత్రలేఖనము గదా. సంతాపాంధకారములో నామోదకమల్లకము గానరాకున్నది. కానిమ్ము — కానిమ్ము — చేతులతోఁ దడవి చూచెదను. తడవిచూచి బట్టితే కిల్బిషా! మేలు మేలు. ఏమీ! ఈయుక్తవరత. ఆశ్చర్య మాశ్చర్యము. చేతులతోఁ దుడిచిన కొలఁది మఱింత యెక్కువగా మెఱయుచున్నది. కానిమ్ము. నీళ్లతోఁ దుడిచి చూచెదను. ఇచ్చట నీరమెందుదొరకునో? ఇదిగో శుద్ధజలాన్వితంబగు తటాకంబు. ఇచ్చటికే వెళ్లెదను. శివా! నీవు గూడ నావలెనే యీ మోదకమల్లకంబున నిరాశుండ వగుము.

(తెరలో)

మోదకంబులారా! మోదకంబులారా! హీ హీ హీ —

విదూ:— ఈ పిచ్చివాఁడు నామోదకమల్లకంబు చేకొని నవ్వుచు దుఱుగుతోఁగూడిన మలినంబగు వర్షాకాలరథ్యోదకంబువలె నిటే వచ్చుచున్నాఁడు. నిలు నిలు ఉన్మత్తకా! నిలు నిలు. కఱ్ఱచే నొక్కేటున నీపుఱ్ఱెఁ బగులఁ గొట్టెదను.

[పిదప నున్మత్తుఁడు ప్రవేశించును.]

ఉన్మ:— మోదకములారా! మోదకములారా! హీ హీ హీ

విదూ:— ఉన్మత్తుఁడా! నామోదకమల్లకంబు నా కొసంగుము.

ఉన్మ:— ఏమి మోదకంబులు. ఎక్కడి మోదకంబులు. ఎవరి మోదకంబులు! ఈమోదకంబుల వదిలిపెట్టవలయునా? లేక దాఁచవలయునా? లేనిచోఁ దినవలయునా?

విదూ:— తినను దినరు. వదలిపెట్టను వదలిపెట్టరు.

ఉన్మ:—ఇదిగో నానాలుక తినవలయునని లొట్టలు వేయుచున్నది.

విదూ:—ఉన్మత్తకా! నామోదకమల్లకంబుఁ గొనిరమ్ము. ఇతరుల వస్తువుల నాసించి పట్టుపడకుము.

ఉన్మ:—ఎవరురా ననుఁ బట్టుకొనువారు? నాప్రాణము పోయినను నేను వీని వదలుదునా? ఈ మోదకంబులే నన్ను రక్షించును.

ఎవరురా ననుఁ బట్టునీపాటివారు
ఎవరురా ననుఁ బట్టునింతసాహసులు
కోపాన ననుఁ బట్టుకొందురు గాక
కాపాడ నీమోదకంబులు లేవె?
వివిధరూపములతో విలసిల్లు నివియె
అవసరంబుల నాకు ననుకూలపడును.
కాలవశంబుచేఁ గడు వాసియున్నఁ
జాలుఁబో నా ప్రాణసంరక్షకివియె.
ఎవరబ్బసొమ్మని యిమ్మందు వీని
అవురసొమ్మిచ్చి నే నంగడిఁ గొంటి.

విదూ:—ఓ ఉన్మత్తకా! నామోదకమల్లకము నా కొసంగుము. దీని ప్రత్యయమున నే నుపాధ్యాయకులమునకుఁ బోవలయును.

ఉన్మ:—నేనును దీని ప్రత్యయమున నూఱామడలదూరము వెళ్ళవలయును.

విదూ:—నీవు నూఱామడలదూర మేఁగుట కైరావతమవా యేమి?

ఉన్మ:—అవును. నే నైరావతమనే. కాని నాపై దేవరా జెక్కుడు. ఎక్కినచో నాయనను గూడఁ గొనిపోదును. కాని ఇంద్రుఁడు పాదపాశికలచే బంధింపఁ బడినాఁడఁట. ఇదిగో యిప్పుడే ధారానిగళంబు లగునీమెఱుపుఁ గొరడాలచేఁ జావమోది. బెడిదంపుసుడిగాడ్పులచే నీబంధంబుల ఛిన్నభిన్నం బొనర్చెదను.

విదూ:—ఉన్మత్తకా! నీవు నామోదకమల్లకము నాకీయవా? ఈయ నిచో నేడ్తును.

ఉన్మ:—ఏడువు మేడువుము. మొత్తుకొనుము.

విదూ:—చంపుచున్నారో చంపుచున్నారు.

ఉన్మ:—నేనును ఏడ్తును – ఇంద్రుని బంధించిరో యింద్రుని బంధించిరి.

విదూ:—చంపుచున్నారో చంపుచున్నారు.

(తెరలో)

భయపడకుము – భయపడకుము – బ్రాహ్మణోపాసకా భయపడకుము.

విదూ:—(సంతోషముతో) చంద్రుఁడురాఁగానే సర్వనక్షత్రములును వచ్చినవి. బ్రాహ్మణ్యము విషాదకరము. ఈహామాత్రికుఁడౌ శ్రమణకుఁ డభయమీయవలసె. (తరువాత శ్రమణకుఁడు ప్రవేశించును.)

శ్రమ:—భయపడకుము భయపడకుము – బ్రాహ్మణోపాసకా! భయపడకుము. ఇక్కడ నెవరెవరున్నారు? ఏల దుఃఖించెదరు?

విదూ:—ఏమీ! ఈశ్రమణకుఁడు ద్వారపాలకవృత్తి ననుభవించుచున్నాఁడే. అయ్యా! శ్రమణకా! ఈ యున్మత్తకుఁడు నామోదకమల్లకంబుఁ గొని యీయకున్నాఁడు.

శ్రమ:—ఏదీ మోదకము చూచెదను.

ఉన్మ:—శ్రమణకా! ఇదిగో చూడుము చూడుము

శ్రమ:—థూ – థూ –

విదూ:—అయ్యో! ఛీ – ఈయున్మత్తకునిచేతిలో ఈహామాత్రికుండగు శ్రమణకుండు థూత్కార మొనర్చినాఁడు. నిర్భాగ్యుండ నగునే నిదివఱ కేమి చూచితినో యంతే.

శ్రమ:— ఓయి యున్మత్తోపాసకా ! కస్తూరికాఫేన పాండురంబులును బహుపిష్టసమృద్ధంబులును గోమలంబులు నగునీమోదకంబుల నిచ్చివేయు మిచ్చివేయుము. వృథాగాం దిని క్షుధోన్మత్తుండవు గాకుము.

విదూ:— ఎంతకష్టము. మోదకంబు లనుకొని కలులకువాలకై యాశించితిని.

శ్రమ:— ఓ ఉన్మత్తోపాసకా ! ఇచ్చివేయు మిచ్చివేయుము. లేనిచో నిన్ను శపింతును.

ఉన్మ:— శ్రమణకా ! అనుగ్రహింపు మనుగ్రహింపుము. భగవానుండా ! నన్ను శపింపకు శపింపకు. తీసికొనుము తీసికొనుము.

శ్రమ:— బ్రాహ్మణోపాసకా ! నాశకిని జూచితివా ?

విదూ:— ఈయున్మత్తకుం డిహామాత్రికుం డగుశ్రమణకుని శాపంబునకు వెఱచి భయభయంబునం జాచంబడిన కొనవ్రేలిపై మోదకమల్లిక ముంచుకొని నిలువంబడియున్నాండు. ఓఉన్మత్తకుండా ! నామోదకమల్లిక మిమ్ము.

శ్రమ:— ఈమోదకంబులచే స్వస్తివాచన మొనర్తురు గాక మీరు గూడ నిటు రండు ఇటు రండు.

విదూ:— హీ — హీ నామోదకంబులచేతనే నేను స్వస్తిచెప్పవలయునా ? నేను నొకగృహస్థునికడనుండి ప్రతిగ్రహంబుగా వీనిని గొంటిని. కావలయునన్న నవి మీకు నుపాయనంబులగు లెండు. పాత్రు లగుటను గొంసంగుటచే నవి సమృద్ధంబులే యగును. ఈయున్మత్తకుం డగ్నిగృహంబున కెదురుగా నేంగుచున్నాండు. ఇప్పుడు మధ్యాహ్నమాయెను. పూర్వాహ్ణమందే యీప్రదేశంబు నిర్జనం బగును. నేను నిప్పుడిదయేనా మాపకంబుల దాటిలో నొకయింటం బెట్టి వెళ్ళుదును. ఒకనికి శాటితో నవసరము: మఱొకనికి మూల్యముతోం బని.

(అందఱు నగ్నిగృహము బ్రవేశింతురు)

యౌగం:—వసంతకా! ఈయగ్నిగృహంబున నెవరును లేరు గదా?

విదూ:—లేరు. ఇయ్యది నిర్జనముగనే యున్నది.

యౌగం:—అట్లైన మీ రిరువురు నన్నుఁ గౌఁగిలించుకొనుఁడు.

ఇరువురు:—అట్లే. (కౌఁగిలించుకొందురు)

యౌగం:—కాని మీ రిరువురుఁ దుల్యపరిశ్రములరు. కూర్చుండుఁడు కూర్చుండుము.

ఇరువురు:—చిత్తము. (అందఱుఁ గూర్చుండెదరు)

యౌగం:—వసంతకా! నీవు స్వామిని జూచితివా?

విదూ:—ఆఁ! చూచితిని.

యౌగం:—అయ్యో! ఎంతకష్టము. రాత్రి నెట్లో యనర్థము లేకుండ వెళ్ళఁ బుచ్చితిమి. ఇంకఁ బగ లెట్లు వెళ్లునా యని చూచుచున్నాము.

గీ. పగలు గడచిన రేయికై దిగులు, రేయి
హాయిగాఁ దెల్లవాఱిన నడలు మఱలఁ
బగ లెటో యని, భావ్యశుభములఁ దలఁచు
మాకు సుఖ మెప్పు డన గతస్మరణమందె. ౩౪

రుమణ్వంతుఁడు:—తాము తథ్యము సెల విచ్చితిరి. రేపగళ్ళలోఁ గాలకృతభేదంబు లేకున్నను సంకటసమయంబుల రాత్రియే యనర్థపరంపరాప్రదాత్రి. ఏలన్నను

గీ. ఎందు వ్యవహారములయందు నందకుండ
లేక లోకానురాగంబు లేక మేను
బ్రొద్దునన దృష్టదోషులై పొలుచునట్టి
శాత్రవజనంబులకుఁ గాళరాత్రి రాత్రి. ౩౫

యౌగం:—వసంతకా! రాజుగారితోఁ జెప్పితివి గదా!

విదూ:—ఆఁ – చెప్పితిని, ఈవిషయమే మాటలాడుచు స్వామివారు చాలసేపుదనుక వెడల నీయరైరి. నేఁడు చతుర్దశి యగుటచే స్వామివారు స్నాన మొనర్చువఱకు నిరీక్షించుచు నే నందే యుంటిని.

యౌగం:—స్వామి స్నాన మొనర్చెనా!

విదూ:—ఆఁ - స్నానమొనర్చెను

యౌగం:—దేవపూజఁ గావించెనా ?

విదూ:—నమస్కారమాత్రంబుచేతనే సర్వదేవతల నారాధించెను.

యౌగం:—ఇట్టి సంకటసమయంబునను మహారాజు దేవతారాధనంబున నేమఱకయున్నాఁడు. ఇయ్యది శ్లాఘనీయమే గదా.

ఉ. స్నానము దేవపూజ శుభసత్క్రియ దీర్చినమీఁద నేమహీరాజు
జానిగృహంబునం బటహజాలము మ్రోఁగుచునుండు నెప్పుడా
తానికి నిప్పు డయ్యొ! దురదృష్టముచేఁ దిథిదేవపూజలన్
మానుగ మ్రోఁగుచున్నవి నమశ్శ్రితంబులు కాలి సంకెలల్. ౩౬

రుమ:—ఇప్పటితమ ప్రయత్నము త్వరలోనే రాజుగారి కుచితతిథి సత్కారంబును జేకూర్పఁగలము.

యౌగం:—(విదూషకునివైపు చూచి) మఱలఁ జనుము. తిరిగి రాజుగారిని సందర్శించి యిట్లు మనవి చేయుము. ఏ ప్రయాణంబు కొఱకు మన మిన్నాళ్ళు మంతన మొనర్చుచుంటిమో దానికిఁ బ్రయోగకాలము చేరె. నలాగిరికిఁ గట్టుచోటుల నీరాడు తావుల మేఁతపట్టులఁ బరుండుచోటుల నోషధీకైతవంబున మత్తుపదార్థము లమర్పఁ బడినవి. తత్తత్కాలప్రయుక్తమంత్రౌషధులచే నది గర్వ్యమూఢముగా సైత మొనర్పఁ బడియె. అదియుంగాక అనుకూలపవనానుసారముగా విడిచి మత్తు గలిగించుటకై ధూపంబు లాయత్తపఱచఁబడియె. రోషోద్రేకంబు గలుగఁ గాకయని ప్రతిగజమదంబు సైతము సేకరింపఁబడియె. వారణంబుల కగ్ని భయకారణం బని గజశాలకుఁ జేరువ నల్పసాధనయుతం బగునొకగృహంబు దగులఁ బెట్టుటకు నిశ్చయింపఁ బడియె. ఆగజరాజంబు చిత్తంబు విభ్రాంతిఁ జెందుటకై దేవాగారంబుల నగారా మున్నగు వాద్యంబులు వాయింపఁ బ్రయత్నంబు చేయఁ బడియె. సర్వసాధనసముపేతం బగునాధ్వనిచే మహాసేనమహారాజు తప్పక రేపు మన ప్రభువువారిని శిరముఁ జొచ్చెద్దరు. అప్పుడు

గ

దేవరవారు వైరియొప్పుదలమీఁదనే చెఱసాలనుండి బయలు వెడలి వీణచే వశపఱచుకొందు నని తనతోఁ బాటు దురవస్థ ననుభవించుచున్న యవ్వీణారత్నంబు హస్తగతం బొనర్చు కొని నలాగిరిని వశ్యంబుఁ గావించుకొని తదారూఢులై

సీ. పట్టువచ్చెశుపరబలము చిత్తంబులోఁ
గా[illegible]టీతటిం దాఁకనట్లు
కేవలముం ద్వార గీలొ[illegible] నళాగిరి
భూరివేగంబునఁ బోవనిచ్చి
దాఁటి వింధ్యాటవిఁ దనుఁ గని సేయుసిం
గముబొబ్బ పూరితి గాక మును పె
చెఱయందుఁ గాసెసనీమయందు స్వకీయ
నగరమందున నొక్కనాఁటియందె

గీ. ముత్తెఱఁగుటై పమూర్పుల మొనసి దేని
చేత మన ఱేఁడు తొలుత వంచింపఁబడెనో
అట్టికరిమిషనే యిప్పు డరుల నణఁచి
చెఱను విడి రాజు కౌశాంబిఁ జేర వలయు — అని 32

రుమ:—వసంతకా! ఆలోచించెద వేమి?

విదూ:—మా యేమియు లేదు. తా మొనర్చిన ఉపాయప్రయత్న మంతయు భగ్నము [illegible] చుంటిని.

ఇరువురు:—ఏమీ— మాకుఁ దెలియదే!

విదూ:—నాకు మొదలఁ దెలిసినది. ఇంక మీకుఁ దెలియ నున్నది.

యౌగం:—ఎందువలన నీకార్యము భగ్నమగును?

విదూ:—వత్సరాజుగారి స్వార్థపరాయణతవలన.

యౌగం:—అది యెట్టిది?

విదూ:—వినుఁడు

ఇరువురు:—అవహితులముగా నున్నాము

విదూ:—కడచిన కృష్ణాష్టమినాఁడు రాకుమారి యగు వాసవదత్త ధాత్రి ద్వితీయయై కన్యాదర్శనంబు నిర్దోష మని యథావృతం

బగునందల మధిరోహించి యవనసుట్టనంబుచే నీరు చిమ్ము ధారాయంత్రోత్క్షిప్తోదకంబుల దుర్గమం బని రాజమార్గంబుఁ బరిహరించి మనరాజుగారున్న చెఱసాల ముందుగాఁ బూజకై యక్షిణీదేవాలయంబునకుఁ బ్రయాణ మైనది.

యౌగం:—తరువాత - తరువాత

విదూ:—తరువాత మనరాజుగారా నాఁడు అభ్యంతరబంధనపరిచారకుం డగుశివకుం డనురాజసేవకు నెట్లో యొప్పించి చెఱసాలముంగిట నిలుచుండియుండెను.

యౌగం:—తరువాత - తరువాత

విదూ:—అంతట భుజములు మార్చుకొనుటకై యచ్చటనే కొంత తడవు బోయలు పల్లకి నాఁపిరి. అప్పుడా రాకుమారి బాగుగా మనరాజుగారికంటఁ బడినది.

యౌగం:—తరువాత - తరువాత

విదూ:—ఇంకఁదరువాత లేదు - గిరువాత లేదు. ఇప్పుడు మన రాజుగారా కారాగారంబుచే ప్రమదాగారంబుగా భావించుచు రాగలీలలఁ దేలుచున్నారు.

యౌగం:—స్వామి వాసవదత్తయెడ ననురక్తుఁడు కాఁడుగదా.

విదూ:—సందేహ మేల? కష్టములెప్పుడుఁ గట్టలు కట్టుకొనిగదా వచ్చును. తాము తలఁచినట్లే రాజుగారు రాకుమారిపై ననురక్తులై యున్నారు.

యౌగం:—మిత్రుఁడా! రుమణ్వంతుఁడా! హృదయమును దృఢము చేసికొనుము. ఈవేసములతోనే మనము వృద్ధులము గావలయుఁ జుమా.

విదూ:—పైపెచ్చు రాజుగారు నాతోనిట్లు సెల విచ్చిరి. 'నీవు చని యౌగంధరాయణునితో నిట్లు చెప్పుము. మీరెత్తిన యెత్తు నాకెంతమాత్రము నచ్చదు. నాప్రయాణ మిష్టమే కాని—నాకుఁ దోడుదొంగ నవమానము గావించినప్రద్యోతునకుఁ దత్క-

స్వాపహారణంబుచేఁ బ్రత్యవమాన మొనర్ప నాలోచించు చుంటిని. ఇది యతనియెత్తున కెదురెత్తుగాఁ బన్నిన దగుటం జేసి నన్నుఁ గామపరవశుఁ డని తలంపరాదు. అని

యాగం:—ఔరా! శత్రుజనాపహాస్యంబుగదా యీవచనంబు. ఏమీబుద్ధి కెంత లజ్జాహైన్యము. అయ్యో! ఇది సుహృజ్జన సంతాపకారణ మయ్యె. దేశకాలంబులఁ బరికింపకుండఁగనే ప్రభువుగారు కామవిలాసంబులఁ గోరుచున్నారు. ఏల యన

మ. కరవిన్యస్తటావృతావని నృపున్ గావించెనే సన్మగన్?
చరణోదంచితశృంఖలారవము పెంచం జాలెనే కామమున్?
చెఱలో నుండెనొ లేదొ యారయఁగ రక్షిశ్శ్రేణి 'రాజా' యనన్
గర మాలించుచుఁ గాఁ డెవండు గుఱి శృంగారప్రసంగాళికిన్?

విదూ:—అయ్యో! మనకుఁ గలస్వామిభక్తిని గనఁబఱచితిమి. చేతనైనంతవఱకుఁ బ్రయత్నించితిమి. ఇంత చేసినను మహా రాజు మనమాట విననున్నాఁడు. కనుక స్వామిని విడనాడి మనదారి మనము పట్టరాదా?

యాగం:—నీవు వసంతకుఁడవు గదా! వసంతకా! ఆ ట్లనకుము.

గీ. చింతచేతను మన్మథచింతచేతఁ
దప్పుఁడగురాజా నక్కటా! తగునె విడువ
విని మహీపాలకుఁడు సుహృజ్జనముమాట
యుక్తకాల మెఱుంగక యున్నవాఁడు.

విదూ:—అట్లైన ఈరూపములతోనే ముసలివార మగుదుము.

యాగం:—అంతటియదృష్టమే పట్టినచో నది శ్లాఘ్యమే కదా!

విదూ:—లోక మెఱింగినచో శ్లాఘ్యమే – అనియే లేదు.

యాగం:—మనకు లోకంబుతోఁ బని యేమి? స్వామికొఱకుఁ గదా యీయుద్యమంబు.

విదూ:—ఎవరికొఱ కీయుద్యమం బుపక్రమింపఁ బడెనో యాతఁడే ఎఱుంగకున్నాఁడు.

ANDHRA ... NILAYAM ... NAMPALLY

యౌగం:—దానివేళ వచ్చిన నెఱుంగఁ గలఁడు.

విదూ:—ఎప్పటి కింక దానివేళ ?

యౌగం:—ఎప్పటికి మనయుద్యమంబు నెఱవేఱునో యప్పటికి

విదూ:—మీ ప్రయత్నము ఫలింపవలయు నని మీ కింత పట్టుదల యున్నచోఁ జెఱసాలనుండి రాజుగారిని అంతఃశాలనుండి రాజకుమారిని ఇరువుర నొక్కమాఱే యేల లేవఁదీయరాదు ?

రుమ:—ఈవిషయమునఁ దాము చక్కగా నాలోచింప వలయును.

యౌగం:—ఇరువురఁ దీసికొని పోవుటకా ? కానిమ్ము. ఇదియే నా రెండవప్రతిజ్ఞ.

గీ. దేని నల్లసుభద్ర గాండీని వోలెఁ
బద్మవల్లిఁ గుంజరప్రభువు వోలె
పూవుఁబోఁడిని హేఁడు గొంపోవునట్ల
చేయలేకున్న యౌగంధరాయణుఁడనె ? ౪౦

మఱియు—

గీ. ఘోషవతిని నళాగిరికుంజరంబు
పత్ని వాసవదత్త మావత్సరాజు
ఎల్లి కౌశాంబికిం జేర్పనేనిఁ బిలువఁ
జనదు యౌగంధరాయణుం డనుచు నన్ను. ౪౧

(చెవియొగ్గి) ఏమీ శబ్దమువలె నున్నది. ఆశబ్ద మేమియో తెలిసికొనిరమ్ము.

విదూ:—చిత్తము. (వెళ్ళివచ్చి) సూర్యభగవానుండు పశ్చిమాభిముఖుం డగుటచే నెండభయము తగ్గి జనము విచ్చలవిడిగా సంచరించుచున్నది. ఇఁక నేమిచేయుదము?

రుమ:—అట్లని యీయగ్నిగృహంబునకుఁ జతుర్ద్వారంబులు గలవు గాన మనసంఘము నలుముఖంబుల విడిపోవుఁ గాక.

యౌగం:—కాదు — కాదు — మనసంఘము కలసియే యుండుఁ గాక — మనశత్రుసంఘాతమే విడిపోవుఁ గాక. మీపనుల మీరు చూచుకొనుఁడు.

ఇరువురు:—అట్లే (నిష్క్రమింతురు.)

ఉన్మ:—

— ద్విపద —

(బంగారు మాచంద్రుఁ బట్టఁ జూచెదవె
దొంగ రాహువ! నీకు దొరక నిచ్చెదనె?
పొంగకు మ్రింగితిఁబో నీని నంచు
అంగిలిఁ జీల్చి యియ్యదె విడిపింతు.
గగ్గోలు సేయుచు గరువంపుఁ దేజి
పగ్గాలు త్రెంచుక పాఱెడు నదిగో
ఇద్దానిపై నెక్కి యిప్పుడే నేను
పెద్దయెత్తుగఁ గోట బిచ్చ సాఁగింతు.
చిట్టినాయనలార! ఛీ! కొట్టకండి
కొట్టినచో మిమ్ముఁ గొట్టెద మఱల
ఆడు మందురొకో! న న్నాడు మందురొకో?
చూడండి నాయాట చూడండి నేఁడె.)

హీ — హీ — రాహువు చంద్రుని మ్రింగుచున్నాఁడు. విడువు చంద్రుని విడువు. విడువవేని నీనోరు బ్రద్దలుచేసి విడిపింతును. ఇదిగో ఇదిగో పొగరుఁబోతుగుఱ్ఱము పగ్గాలు త్రెంచుకొని యిటే పరుగెత్తుకొని వచ్చుచున్నది. ఇదిగో ఇదిగో నాల్గువీథులబాజారులో నున్నది. దీని నెక్కి భిక్షమెత్తి కొందును. వీరే వీరే పిల్లదొరలు. పిల్లదొరలారా! నన్నుఁ గొట్టుచున్నారా? నన్నుఁ గొట్టకండి కొట్టకండి. ఏమనుచు న్నారు? కొంచె మాడు మనియా? చూడండి చూడండి దొరలు. పిల్లదొరలారా! నన్ను మఱలఁ గఱ్ఱలతోఁ గొట్టుచున్నారా? కొట్టకండి కొట్టకండి. కొట్టినచో నేను గూడ మఱలఁ గొట్టెదను. (నిష్క్రమించుచున్నాడు)

ఇది తృతీయాంకము

శ్రీ హయగ్రీవాయ నమః

ప్రతిజ్ఞా యౌగంధరాయణము

చతుర్థాంకము

(తరువాత భటుఁడు ప్రవేశించును)

భటుఁడు:—ఎంతకాల మాయెను. వెదకి వెదకి వేసారి పోవుచున్నాను. రాకుమారి జలక్రీడ సలుపుతలంపున భద్రవతిని గొనిరమ్మని యానతిచ్చినది. భద్రవతీపరిచారకుఁ డగునా గాత్రసేవకుఁ డింతవఱకుఁ గాన్పింపకున్నాఁడు. భావా! పుష్పదంతా! నీవు గాత్రసేవకుఁ డేమేని గాన్పించెనా? ఏ మనుచున్నావు? ఈగాత్రసేవకుఁడు కండిలశౌండికియింటఁ జేరి కల్లు త్రాగుచున్నాఁ డనియా? అట్లేని నీవు నీపనిఁ జూచుకొమ్ము. ఇదియే కండిలశౌండికి యిల్లు. వీనిని బిలిచి చూచెదను. గాత్రసేవకా! గాత్రసేవకా!

(తెరలో)

గాత్రసేవకుఁడు:—ఎవడోసీడు. రాదారిలో వుండి గ్రాత్రసేవకా! గాత్రసేవకా! యని ఒకే మోయన పిలుత్తాడు.

భటుఁడు:—వీఁడే గాత్రసేవకుఁడు. కల్లు త్రాగి త్రాగి మత్తిల్లి మత్తిల్లి జపాకుసుమంబులఁ బోలు నెఱ్ఱనికన్నులతో సిటే వచ్చుచున్నాఁడు. వీని కెదురుగా నుండరాదు.

(సిమ్మట యథోక్తాకారంబుతో గాత్రసేవకుఁడు ప్రవేశించును.)

గాత్ర:—ఎవడోసీడు. రాదారిలో వుండి గాత్రసేవకా! గాత్రసేవకా! అని ఒకే మోయన పిలుత్తాడు. కల్లుదుకాణంనుంచి యిప్పుడే వత్తుంటే మామ కోపంతో చూచిండు. ఐతేమి ముంతెడు అమృతంలాంటి కమ్మనికల్లు వేయించి దానిమీద మసాలాతో డిమాంసంముక్క నోటఁ దగిలించా. కల్లోయిత్తే కోడలు ప్రేమిత్తది గాని యత్త కట్టుచ్చుకోకుండాలె.

— గేయము —

దన్నాలు రా వోళ్ళ్కి దన్నాలు రా
దన్నాలు రా వోళ్ళ్కి దన్నాలు రా
కల్లూ శాతనె కైపు గల్లాల రా
కల్లె వోళ్ళను బూయుః గల్లాల రా
కల్లుశాతనె వోళ్ళు కవగాల రా
కల్లుశాతనె సావు గల్లాల రా
కల్లూతో బతికుంటె కైలాస మే రా
కల్లూతో సచ్చితె కైవల్యమే రా
అట్టెయిన యిట్టెయిన ఆనందమే రా
ఎట్టెయిన కల్లున్న ఏమి దుఃఖం రా
బోగా లున్నే లేమి బోగాలు రా
తాగాల రా కల్లు తాగాల రా,

పనికిమాలినోళ్ళు కొందఱు పైకం కొల్లగా వుంచిగూడా — రోజూ కొడుకుల పెళ్ళాలగోళ్ళ, వోళ్ళ పడేపాట్లు యింటూ కంటూ గూడ ఖర్చవుతుందని కామోల్సు కల్లుకోసేరు నట్టించరు. తెలివితక్కువోళ్ళు. పాపం వోళ్ళ కిక్కడి కష్టా లేమ లోకంలో గూడ్శా వుండవ్వోసి.

భటుడు:—(సమీపించి) గాత్రసేవకా! ఎంతసేపటినుంచి నిన్ను వెతకుచున్నాను. రాకుమారి జలక్రీడ సేయుతలంపుతో నున్నది. భద్రవతీగజంబు గానరాదు. నీ విట్లు కల్లుద్రావి యొడలెఱుంగక తిరుగుచున్నావు.

గాత్రసేవకుడు:—ఔ ఆమె వోళ్ళెఱుగదు. ఆయనవోళ్ళెఱుగడు. నేనూ వోళ్ళెఱుగను. నీవ్వూవోళ్ళెఱుగవు. అందఱూ వోళ్ళెఱుగరు. ఏమంటావ్?

భటుడు: — అది యంతయు నటుండ నిమ్ము. కోటలో భద్రవతిని బ్రవేశపెట్టకుండ నీ వెక్కడ దిరుగుచున్నావు?

గాత:— ఇదిగో ఇక్కడ దిరుగుచున్నాను. ఈడ తాగుచున్నాన దీంతో తాగుచున్నా. కోపించొద్దూ. నే నిప్పు డేంశేయాలె

భటుఁడు:— ఈయసంబద్ధప్రలాపంబులుగట్టి పెట్టు. త్వరగా భద్రవతి ప్రవేశపెట్టు.

గాత్ర:— దా — దా — భద్రవతీ! దా — అమ్మో! భద్రవ అంకుశాన్ని కుదెట్టి కల్లు నీళ్ళు తాగానే మఱెట్టా?

భటుఁడు— స్వభావవినమ్రమ యగుభద్రవతి కంకుశ మేటికి? త్వరగ వెళ్ళి భద్రవతిని ప్రవేశపెట్టుము.

గాత్ర:— దా — దా భద్రవతీ! దా — అమ్మో! ఇంకెట్టా? భద్ర వతిదండ కుదెట్టి కల్లు తాగానే.

భటుఁడు:— పుష్పమాలాలంకృత యగుభద్రవతి కాదండతో నేమి శీఘ్రముగా వెళ్లి భద్రవతిని ప్రవేశపెట్టుము.

గాత్ర:— దా — దా — భద్రవతీ! దా — అయ్యో! ఎట్టా? భద్రవతి గంట కుదెట్టి కల్లుతాగానే.

భటుఁడు:— జలక్రీడాసమయంబున భద్రవతికి గంట యేమిటికి అయ్యో జాగుచేయక భద్రవతిని ప్రవేశ పెట్టుము.

గాత్ర:— దా — దా — భద్రవతీ! దా — భద్రవతి కొరడా కుదెట్టి కల్లు తాగానే యెట్టా?

భటుఁడు:— కొరడా యేటికి లే వేగిరమే భద్రవతిని ప్రవేశపెట్టుము.

గాత్ర:— దా — దా — భద్రవతీ దా — అమ్మో!

భటుఁడు:— అమ్మో! ఏమిటి

గాత్ర:— అమ్మో! నేను.

భటుఁడు:— ఏమిటి నీవు?

గాత్రి:— అమ్మో! భద్రి

భటుఁడు:— భద్ర — ఏమిటి?

గాత్ర:—అమ్మా! భద్రవతిని

భటుడు:—భద్రవతిని ఏమిటి ?

గాత్ర:—భద్రవతిని గూడఁ గుదెట్టినాను.

భటుడు:—అట్లైన నీవు కాదు దోషివి – ఆకండిలకౌండికియే – రాజవాహనమును గొని నీకుఁ గల్లు పోయునా?

గాత్ర:—నేచెప్పాను గూడ మొదలంటా చెడకని –

భటుడు:—ఏమీా ! శబ్దము ?

గాత్ర:—ఆఁ – తెలిసింది. తెలిసింది. ఆకల్లుఅమ్మెదానియిల్లు పడగొట్టుకొని భద్రవతి పాఱిపోతున్నది.

భటుడు:—ఏమనుచున్నావు ? (ఆకాశమునఁ జెవియొగ్గి) వత్సరాజు వాసవదత్తను గొనిపోవు చున్నాఁడనియా ?

గాత్ర:—(సంతోషముతో) వత్సరాజున కవిఘ్న మగుగాక.

భటుడు:—త్రాగుము. త్రాగుము.

ఇంకను మత్తిల్లి యుండే తిరుగుచుండుము –

గాత్ర:—ఆఁ ! ఏమంటివి ? ఎవఁడు రా మత్తుఁడు ? ఎవ్వనికి రా మదంబు? మమ్ముల ఆర్యయౌగంధరాయణ మహామాత్యుల చేఁ దత్తదుచితస్థానంబుల నియోగింపఁబడిన చారపురుషులను గా నెఱుంగుము. నేనును మిత్రులకు సైగఁ జేయుదును. వీరే నామిత్రులు నిర్బంధములనుండి విడివడిన నల్లత్రాచులవలె నిటునటు పరుగిడుచున్నారు. ఓహో! మిత్రులారా! వినుఁడు వినుఁడు.

[illegible]

గీ. సలిలపూర్ణంబు సకుళంబు సంస్కృతంబు –
నవశరావంబుఁ గొనఁ, డొందు నరకమతఁడు
స్వామియన్నంబుఁ దినుచు నాస్వామికొఱకు
సమయ క్షేత్ర సమరంబు సలుపఁ డేని. ౮౨

ఎక్కడ నున్నాఁడు సెప్పుమా ఇపు డార్యయౌగంధ రాయణుఁడు — అదిగో ఆర్యయౌగంధరాయణుఁడు — ఈమహాసియుండు

మ. ఉరుతీక్ష్ణాస్త్రఖడ్గ మూని నిడి యా యుస్త్రత్రశేషంబు నం
బరముల్ దాఁచి పసిండికేడెములన్ వాసాగ్రిహాసంబు క్
రికసుందుం దలవాగ తెల్లనిసిరుల్ సింగారముం గూర్పఁ గో
చరమై దక్కలిమించు చంద్రుఁడు పజం బొల్చు మేఘంబునాన్. ౪౩

ఔరా! యుద్ధంబు మహత్తరంబుగా జరుగుచున్నది.

చ. మదగజరాజబృందముల మావటివారలతోనె గూల్చి, యా
పిదప హయంబులం దునిమి బిటుగ రౌతులతోఁ, క్షణంబులోఁ
జెదరఁగఁ జేసి సేనఁ దుద సింధురదంతహతాత్మబాహుఁడై
కదనము వీడ కుండఁగనె ఖడ్గము జాఱియుఁ బోరు చుండెడిన్. ౪౪

అయ్యో! ఛీ! ఆర్యయౌగంధరాయణుఁడు పట్టువడెఁగదా. ఇప్పుడు నే నార్యయౌగంధరాయణుచేరువనే మెలంగుదును.

(నిష్క్రమించును)

భటుఁడు:—ఏమిది! ప్రాకారతోరణంబులు దప్ప సర్వము కౌశాంబీ నగరమువలెనే యున్నది. కానిమ్ము. ఈవృత్తాంత మంతయు నమాత్యున కెఱింగించెదను.

(ప్రవేశకము)

[తరువాత ఇరువురు సామాన్యభటులు ప్రవేశింతురు]

ఇరువురు:—అయ్యలారా! తొలఁగుఁడు — తొలఁగుఁడు.

ప్రథముఁడు:—అయ్యో! గొం తెంత బ్రద్దలుచేసికొనుచున్నను బౌరులకోలాహల మెక్కువగానే యున్నది.

ద్వితీయుఁడు:—అయ్యో! నే నెంత బిగ్గఱగా నఱచుచున్నను రాజదారిక యగువాసవదత్తను గొనిపోయి రని వినుటవలనఁ బొడమిన విభ్రాంతిచే నా పలు కొక్కఁ డేనియు లెక్కసేయ కున్నాఁడు —

అయ్యలారా! ఏమనుచున్నారు. తొలఁగుఁడని వారించుట యెందుల కనియా? ఆర్యయౌగంధరాయణుఁడు పట్టువడియెను — ఏమనుచున్నారు? ఎట్లు పట్టువడియె ననియా — వినుఁడు. ఖడ్గద్వితీయుండై యార్యయౌగంధరాయణుండు ముహూర్తకాలం బక్షోహిణుల యుగ్రవేగంబు నాఁపి యతి భీకరంబుగ నాలంబు గావించుచు విజయసుందరం బను నొక్క దంతావళంబుపైఁ గరవాలంబు విసరుచు నయ్యది దాని దంతంబునకుఁ దగిలి భగ్నం బాయెను. ఖడ్గదోషంబుచేఁ బట్టువడియెఁ గాని పురుషదోషంబుచేఁ గాదు.

ప్రథముఁడు:— ఓహో! జాగరూకులై యుండుఁడు. ఇది ప్రాకారతోరణంబులు లేని కౌశాంబియే సుమా.

ఇరువురు:— అయ్యా! దిగుఁడు — దిగుఁడు —

(అప్పుడు బద్ధబాహుఁడై ఫలకశయనీయంబుపైఁ గొనిరాఁబడుచు యౌగంధరాయణుండు ప్రవేశించును)

యౌగం:— ఇదిగో — దిగుచున్నాను.

శా. వైరుల్ కేలినుండి మాటు వత్సనృపునిన్ విడిపించి బల్మిమైఁ
బోరి స్వఖడ్గదోషమునఁ బోయిన వైరులచేతఁ జిక్కి యీ
తీరున తెన్నియుక్కటుఁ దీరిచి చేసుచు నుంటి గెల్పుచే
కూరె నటన్న చేసుక దిగుల్ సన రాజకులంబు హాయిగన్.

ఔరా! సౌఖ్యము గదా నిష్కళ్మషులకు గాంతారప్రవేశంబు. రమణీయంబు గదా యువాపకారములకు దైవవినిపాతంబు. అపశ్చాత్తాపకరంబు గదా సంచితధర్ములకుఁ బాలధర్మంబు. నే నన్ననో —

చ. భయమును వైరమున్ బరిభవంబు సమంబుగ వీడి కార్యమున్
నయవినయంబులన్ శరగణంబులఁ దీరిచి శత్రురాజ్యల
క్ష్మీ నయుఁ దొలఁగంగఁ జేసి నిజమిత్రులయయ్యపకీర్తితోడనే
జయమును వత్సభూపతిని శాశ్వతకీర్తిని గాంచఁ గల్గితిన్. ౪౮

ఇరువురు:—తొలఁగుఁడు — తొలఁగుఁడు — అయ్యలారా ! తొలఁగుఁడు.

యౌగం:—నన్నుఁ జూడ నభిలషించుజనంబును దొలఁగింపఁజనదు.

చ. ఆనయుఁడు రండు మంత్రిపదమం దభిలాష మనంబులోపలన్
వరలెడురాజపూరుషు లవారిగ నీనిమిత్త మిట్లు దు
ర్భరదురవస్థ లన్నిటికిఁ బా లగునన్ బరికించుచో మదిన్
దిరమగునో తదీప్సితము ధీరత లేమి వెసన్ దొలంగునో ? ౪౭

ఇరువురు:—తొలఁగుఁడు — తొలఁగుఁడు — మీ రిదివఱ కెన్నఁ డీయౌగంధరాయణుఁజూడరా ఏమి ?

యౌగం:—పూర్వము చూచిరి గాని యీరూపుతోఁ గాదు.

గీ. పిచ్చివేసంబుతో నటు రచ్చలందుఁ
బరుగిడెడునాకు నీరూపు భావ్య మగునె ?
ఇట్టిరూపంబు గొనినందు కిపుడు చూపఁ
బడుచునున్నని గనుఁడు నాపనులు ప్రజలు. ౪౮

(ప్రవేశించి)

భటుఁడు:—ఆర్యా ! తమ కొకప్రియవార్తను దెలుపుచున్నాను. వత్సరాజును గూడఁ బట్టికొనిరఁట.

యౌగం:—ఇదియెన్నఁటికిని జరుగఁబోదు.

ఉ. బంధముఁ బాసి యెడ్డ యరిపట్టణమందుననుండి వింధ్యసం
బంధివనప్రదేశముల భద్రవతీత్వరఁ బట్ట వచ్చు దు
స్సంధులు దప్పఁగాఁ దృటి వెసన్ బహుయోజనముల్ గమించు నా
బంధురకీర్తి వత్సజనపాలుఁడు వైరులచేతఁ జిక్కునే ? ౪౯

భద్రా ! అల్లేని ఎట్లు పట్టుకొని రని వింటివి ?

భటుఁడు:—నళాగిరిని వెంటఁ బరుగెత్తించి పట్టుకొని రఁట.

యౌగం:—నళాగిరి కంతసామర్థ్య మున్నమాట వాస్తవమే గాని అది స్వస్థచిత్తముతో లేదు. అదియును గాక సరిగా శిక్షఁ బొందినదియుం గాదు.

గీ. ఏనుగుల కగు వడి మావటీనిశిక్ష
అట్టిమెడ శిక్షరయే లేని యాగజంబు
వత్సనరపతి నడిపెడుభద్రవతిని
మించి నడుపంగ నల్లవిరించివశమె ? ౫౦

ఘటుఁడు:—ఆర్యా ! ఈప్రదేశం బాయుధీయసురక్షితం బగుటం జేసి తా మీ యాయుధాగారంబుననే యుండ వలయునని మంత్రి గారు సెలవిచ్చుచున్నారు.

యౌగం:—ఔరా ! ఎంతపరిహాస్య మీవచనము.

గీ. వత్సరా జనువహ్నిని వైచి చెఱను
జాగరూకత వలసినసమయమందు
మంత్రులు పరుండినారు మైమఱచి యిపుడు
రత్న మేగినఁ బెట్టె కీరక్ష యేల ? ౫౧

(నడిచి)

ఘటుఁడు:—ఇదియే ఆయుధాగారము ఆర్యులు ప్రవేశింతురుగాక.

(ప్రవేశించి)

ఘటుఁడు:—మంత్రిగారు తమనుఁ గట్లు దొలఁగింప సెల విచ్చిరి.

యౌగం:—అట్లని తొలఁగింపుము. నిజము. భరతరోహకుండు నన్నుఁ జూడఁ దలఁచుచున్నాఁడు. నేనును భరతరోహకుని జూడఁ గోరుచున్నాను.

సీ. కోపియా నాగర్వదూషితోక్తులఁ జేసి
కడుఖేద మాత్మలోఁ గాంచువాని
నేఁ జూఁచినటు సేయునీతిప్రియుఁ కెకి
నెదు రెత్తు దోఁచకే యొసఁగువాని
నీతిశాస్త్రంబుల నిర్ధారితంబులౌ
సూక్తులపై దృష్టి చొఱనివాని
నన్ను వంచించినంతకు మించి నాబుద్ధి
బలముచే వంచింపఁబడినవాని

గీ. తనదుయత్నమ్ము మాఱు యత్నమ్ముచేత
జాగరూకత భంగంబు సలుపుకూరు
విజయిఁ గాంచఁ బ్రతిక్రియావిరతి సిగ్గుఁ
బొంది తలవాంచుమల్లుని బోలె నిపుడు. ౫౨

(తరువాత భరతరోహకుఁడు ప్రవేశించును)

భరతరోహకుఁడు:—ఎచ్చట యౌగంధరాయణుఁ డెచ్చట యౌగంధరాయణుండు ?

ఉ. మోసముచే నొనర్చుకొని మున్నె స్వకార్యము దుర్నిరీక్షుఁడై
గాసిలి జేసినక్రైయిపుడు కాలముగాక యణంగి మంత్రియుం
జేసి ఫలింప నిట్లు పదశీలితమై తలయెత్తుపాము నా
భాసిలు నీ మహామహుని భవ్యుని నేమిని నొవ్వనాడుదున్ ౫౩

భటుఁడు:—యౌగంధరాయణమంత్రిగా రేలినవారికొఱ కెదురు చూచుచు నాయుధాగారముననే యున్నారు.

భరతరోహకుఁడు:—సరే కానిమ్ము.

ఆ. వె. కపటనీలహస్తి గావించి వంచింపఁ
బడియె నితఁడు మంత్రిపదవియందు
తద్విరోధ మిపుడు తలపెట్టి మే[illegible]యన
నెదురు చూచుచుండె నిట్లు నాకు. ౫౪

భటుఁడు:—ఆర్యా ! ఈతఁడే యార్యయౌగంధరాయణుఁడు.

భరతరోహకుఁడు:— (సమీపించి) ఓహో ! యౌగంధరాయణా !

యౌగం:—ఓ.

భటుఁడు:—ఏమీ యీస్వరగాంభీర్యంబు. ఈ మహామహుని యేకాక్షరాత్మకం బగుమాటచేతనే యీప్రదేశమెల్ల నిండి పోయినది.

భరత:—(కూర్చుండి) వత్సరాజామాత్యా ! యౌగంధరాయణుఁడను నశరీరంబు లగునక్షరంబులనే యిదివఱకు వినుచున్నాము. నేఁడు మాభాగ్యంబుచే నిన్నుఁ జూడఁ గల్గితిమి.

యౌగం:—ఏమీ! మాభాగ్యంబుచేతనే చూపఁ గల్గితిమనియా?

ఆ. వె. కనుము రక్తసిక్తగాత్రు నీగతి వైర
సద్వ్రతైకనిష్ఠ సలుపు నన్ను
జనకుఁ బరిభవించుచెనఁటిని నుఱుమాడి
తసి శాంతి నున్న ద్రోణిఁ బోలె. ౫౫

భరత:—గజవ్యాజంబునఁ బ్రభువు గొనిపోవుటయు శౌర్య మనియే గర్వించుచున్నావా?

యౌగం:—ఏమీ! గజవ్యాజంబునఁ బ్రభువుఁ గొనిపోవుట యనియా? అట్లేని ఇది మాత్రము మీకు న్యాయమా?

మ. వరనాగం బని సాలవృక్షముదరిన్ వత్సేశు వంచించుటల్
చెఱఁ జే దిండుగ రిత్తసేలఁ బతికిన్ సైజం బొనర్పించుటల్
కరివశ్యత్వము ఱేఁడు గోల్పడునటుల్ గా వీణఁ గైకొంటలున్
మఱి న్యాయంబులు? త్వత్కృతం బనుకరింపన్ మావి యన్యాయముల్?

భరత: యౌగంధరాయణా! మహాసేనాత్మజ యగువాసవదత్త నగ్నిసాక్షిగా శిష్యురాలిఁ జేసికొని మీవత్సరాజు అదత్తాపహారంబు గావించె. ఈచోరవర్తన మాతనికి న్యాయ్యమో?

యౌగం:—అట్లనకు మట్లనకుము. పాపము శమించుఁగాక పాపమ్ము శమించుఁగాక! శిష్యురాలిగఁ గొనుటయే తేనికి వివాహంబని యెఱుంగుము. లేనిచో

గీ. భారతమహాన్వవాయసంభవుఁడు వత్స
దేశముల కూర్జితుం డౌసధీశుఁ డెట్లు
దేవిగాఁ జేకొనక యుపదేశ మొసఁగు
కొలుయలు గలదానిఁ బాపలేవయసుదాని. ౫౬

భరత:—అది యటుండ నిమ్ము. వత్సరాజు మామహాసేన మహారాజువలన బంధమోచనసత్కారంబు వడసెఁగదా! దానినైతము పరిగణింపక తత్సుతఁ గొనిపోవుట సమంజసమా?

యౌగం:— ఇటు లాడకు మిటు లాడకుము.

గీ. విను నళాగిరి గజశాస్త్రవిదులమాట
దాన నొనరించు మాయనియాన గాన
రాజు మారాజు విడిచె స్వరక్షణమునకు
నెయ్యురకుఁ బ్రాణమానముల్ నిలుపుకొనుటకు. ౫౮

భరత:— అట్లు నళాగిరి గ్రహణార్థమే మీ రాజేఁడు విడిపింపఁబడినచో మహాసేనులచే మఱల నేల బంధింపఁ బడఁడు ?

యౌగం:— ఏల బంధింపఁబడఁడా ? తన్నుఁ దనయాప్తులను రక్షించినమహాసేనుని కృతఘ్నుఁడై బంధించినచో లోకంబు దూఱు ననుభయంబుచేత.

భరత: రాజ్యతంత్రజ్ఞుఁడ వయ్యు నిట్లు పలికెద వేల ? యుద్ధావజితులవిషయమై శాస్త్ర మేమి దండంబు విధించుచున్నది ?

యౌగం:— మరణదండమును.

భరత:— వత్సరాజు మరణదండార్హుఁడేని మాచే నట్లేల సత్కృతుండయ్యె ?

యౌగం:— కనుకనే గదా మహాసేనులశరీర మంట లేదు

భరత:— ఇదియు శక్య మనియే తలంచెనేమి మీరాజు ?

యౌగం:— సంశయ మేమి ?

గీ. హస్తగతుఁడైనమీయని నణఁచకుండఁ
బ్రోచె ధర్మాత్ముఁడైనమాభూవరుండు
పరివరముపైకి నెక్కి కేకరణి ధరణి
వైజయంతిని గొనుటకు వలను పడును ? ౫౯

భరత:— కానిమ్ము కానిమ్ము. మహాసేనులకుఁ బ్రతికూలంబు గావించి మఱలఁ గౌశాంబి కేగుద ననియే తలంచితివా ?

యౌగం:— ఏమీ ? ఎంత పరిహాస్య మీమాట!

గీ. ఏగు దెంచితి మీయెటయెదిరి కేను
[illegible] ?

పిల్లగించితి మొదలంటఁ బెద్దమాఁనె
చిన్నకొమ్మలఁ దునుముచే చిక్కు యింక. ౨౦

(ప్రవేశించి)

కాంచుకీయుఁడు:—(చెవిలో) ఈలాగీలాగు.

భరత:—బిగ్గఱగాఁ జెప్పుము.

గీ. కారణంబులు పెక్కులు గలిగి యున్నఁ
గావు మా కన్నఁటికి నపకారి వీవు
నీదునుగుణంబులందున లేదు గినుక
ఇదిగొ భృంగార మొసఁగెద భిక్ష గొనుము. ౨౧

యౌగంధ:—అయ్యో! ఛీ! ఛీ! వలదు వలదు.

గీ. ఆలు వింతకు నేఁ గాచ్చిపట్టి యుండ్లు
శాంతపడ వి: ? మంత్రిజనులమదులు
[illegible] నెంత [illegible]!
దండ్యునకు వధ గాదె సత్కార మన్న. ౨౨

(తెరలో హాహాకారము వినఁబడును.)

భరత:—ఓయీ!

గీ. అయ్యో! అకస్మికముగ [illegible]
నీఁగు దెంచెడియీధ్వని [illegible]
డేగ అక్కులతాఁచున డీల్కు వడిన
యట్టిక్రురరీని నాదంబు ననుకరించె. ౨౩

ఈశబ్ద మెవరిదో తెలిసికొనిరమ్ము —

కాంచుకీయుఁడు:—చిత్తము.

(పోయి తెలిసికొనివచ్చి)

పూజ్యురా లగునంగారవతీ దేవి వాసవదత్తా [illegible]
వలని శోకాతిరేకంబున సంతప్తస్వాంత [illegible] ప్రా[illegible]
పడియెనఁ [illegible] [illegible] [illegible]

లుంగా రీతీరుగాఁ బలికిరి. దేవీ ! ఏటి కీసంతోషసమయం బున సరితాప మందెదవు ? భవదీయతనుజాతకు క్షత్రియోచితం బగుగాంధర్వవివాహ మితఃపూర్వంబె నిర్వర్తితంబయ్యె. కావున మన మిప్పుడు ఫలకస్థితు లగువాసవదత్తావత్సభూపతులకు వివాహ మాచరింతుముగాక అని. అందువలన అచ్చట

గీ. కంటఁ దడితోడ మోములఁ గౌతుకంబు
గాన రాకుండఁ బనుల నాకస్మికముగ
మంగళద్రవ్యములు సెలఁగంగ నిపుడు
చేయుచున్నారు కౌతుకశీలు స్త్రీలు. 83

యౌగం:—అట్లేని మాటేనితో మహాసేనమహారాజులు వియ్యమందఁ దలఁచుచున్నారు గాన భృంగార మిటు గొనిరమ్ము.

కాంచుకీయుఁడు:—ఇదిగో. చేకొనుఁడు (దగ్గఱకుఁగొనిపోవును.)

భరత:—యౌగంధరాయణా ! మహాసేనుఁడు మీ కింతకంటె మఱల నేమి ప్రియంబు గావింపవలయును ?

యౌగం:—మహాసేనుండు నాయందుఁ బ్రసన్నుఁ డేని నా కింతకంటెఁ గావలసినది యే మున్నది ?

[భరతవాక్యము]

గీ. గోవులకు వ్యసనము లేక పోవుఁ గాత
శాంతిఁ జెందుత మఱి పరచక్రమెల్ల
ఈచతుర్వార్ధి సహిత మహీతలంబు
నెపుడు మారాజసింహుండె యేలుఁ గాత.

[అందఱు నిష్క్రమింతురు.]

ఇది చతుర్థాంకము.

కవిశేఖర శతావధాని పల్లె పూర్ణప్రజ్ఞాచార్యాంధ్రీకృతం
బగుప్రతిజ్ఞాయౌగంధరాయణంబు
సమాప్తము.